## చివరి మాట

ఒక వస్తువు యొక్క విలువ తెలిసినప్పుడే దానిని తగువిధంగా భద్ర పరచుకొంటాము. అలాగే ఒక వ్యక్తి ఎంతటి గొప్పవాడో తెలిసినప్పుడే వారిని తగు విధంగా సత్కరించి సంబంధం పెట్టుకుంటాము. మనకు లభించినది చక్రవర్తే అయినా ఆ విషయం తెలియకుంటే వారిని తగువిధంగా సత్కరించలేము. పొందవలసినంత మేలు పొందలేము. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారిని గురించికూడా అంతేగదా? వీరెంతటి సాటిలేని మహనీయులో పూర్తిగా తెలుసుకొని నమస్కరించిన వారిని వ్రేళ్ళమీద లెక్కించవచ్చు. ఈ సాటిలేని సద్గురు మూర్తిని గూర్చి లోతుగా ఆలోచించి ఆ మహనీయుని కృపవలన వారెంతటి సమర్థ సద్గురుమూర్తో కొంతైనా అవగాహన చేసుకొనుటకు నేనుచేసిన ప్రయత్నమే ఈ చిన్న గ్రంథం.

“అనన్యాశ్చింతయంతో మాం ఏజనా: పర్యుపాసతే” అన్న గీతా వాక్యాన్ననుసరించి సద్గురు చింతనలో నిమగ్నమవాలనే సంకల్ప ఫలితమే ఈ గ్రంథం. ఈ గ్రంధపారాయణ చేసిన భక్తుల హృదయాలన్నీ శ్రీ స్వామి వారి నిత్యనివాసాలై విలసిల్లేటట్లు చేయమని శ్రీ స్వామివారిని ప్రార్థిస్తున్నాను.

జైసద్గురురాయా

# శ్రీ అవధూత బోధామృతము

## శ్రీ వెంకయ్య స్వామివారి దివ్యబోధలు



## ప్రార్ధన

గురుమధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురు:
గురుర్ విశ్వం సచాన్యోస్థి తస్మై శ్రీగురవేనమ:


తృతీయ ముద్రణ : 2,000 - కాపీలు

ప్రాప్తి స్థానము :-

పెసల సుబ్బరామయ్య
గొలగమూడి (Po)
(VIA) సర్వేపల్లి,
నెల్లూరు జిల్లా - 524 321.

ప్రకాశకులు :-

శ్రీ స్వామికృప పబ్లికేషన్స్
గొలగమూడి,

ముద్రణ : -

శివరామ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
విజయగోపాలపురం
స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు.
ఫోన్ నెం : - 323519, 328029


2000 Copies

# శ్రీ అవధూత బోధామృతము

## శ్రీ వెంకయ్యస్వామివారి దివ్యబోధలు


రచన:

పెసల సుబ్బరామయ్య



(సర్వహక్కులు రచయితవి.)


శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు
వ్యక్తులపేర్లతో పంపరాదు.
టు ది రిసీవర్ - భగవాన్
శ్రీ వెంకయ్యస్వామి హ్యూమాని టేరియన్ మిషన్
గొలగమూడి పోస్ట్ వయా సర్వేపలి - నెల్లూరుజిల్లా అని పంపాలి


వెల : రూ. 15.00

## నన్ను శ్రీ స్వామివారి అండకు చేర్చిన పూజ్యగురుదేవులు



ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు



భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి

## ముందుమాట

మనసు అతి చంచలమైనది. కల్లుత్రాగిన కోతివంటిది. దీనిని ఒక చోట నిలిపి ధ్యానించాలంటే సాధ్యంకాదు. అనేక విషయాల వెంట పరుగెత్తే ఈ మనస్సును ఒకేసారి నిలపాలంటే సాధ్యంగాదు గనుక అనేక విషయాలకు బదులు ఒకే విషయంపై ఆలోచించడమైనా నేర్పితే ధానివేగము కోతిగంతులు కాస్త తగ్గివశమవుతుంది. ఊరంతా తిరిగే బదులు ఒకే ఒక ఇంటి ఆవరణములో తిరుగ నియమించినట్లు సద్గురుని దివ్యలీలాచింతనలో మనస్సును నియమిస్తే రెండు విధాలుగా లాభము. 1) మనస్సును నిర్భంధించి బాధపెట్టకుండా దానికి స్వేచ్ఛనిస్తూనే దాని పరిధి. వేగము తగ్గించగలిగామన్నమాట. 2) మహాద్భుతమైన సద్గురుని దివ్యస్థితిని గూర్చి చింతన చేయగా చేయగా ఆ మహనీయుని నిజస్థితి ఎంత అద్భుతమైనదో హృదయగతమై ఆనందోద్వేగములతో అనన్య సద్గురు చింతనే మనస్సుకు ఆహారమై కూర్చుంటుంది. అలాంటి దివ్యమైన సద్గురు లీలను మననం చేయకుండా అన్యవిషయాల వెంట పోవాలంటే మనస్సుకు మొగం మొత్తినట్లవుతుంది. సద్గురు లీలాచింతనే మనస్సునకు నిరంతరం ఆహారమైన ఆ శుభసమయంలో సద్గురువు ప్రసన్నుడై - "నేను నీతోనే యున్నాను. నీవు చేసే పనులన్నీ అనుక్షణం గమనిస్తూనే యున్నాను" అని తెల్పే దివ్య నిదర్శనాలు ప్రసాదిస్తాడు.

అట్టి దివ్యానుభవాలు కలిగాక కాలక్షేపానికి కబుర్లు - టి.వి.లు సినిమాలు అవసరమే ఉండదు. పొమ్మన్నా మనస్సటుపోదు. సద్గురు లీలాచింతనలో తన్మయమైన మనస్సు మన ప్రయత్నము లేకుండానే ఏకాగ్రమై నిలచి ధ్యానస్థమవుతుంది. అట్టి శుభసమయములో సద్గురు కృపవలన మనలోని (దుర్గుణములనే) మాలా, మాదిగ జోగీ జంగం అనబడు దుష్ట గుణములకు

పని నిలిచి పోతుందయ్యో" అన్నారు. అంటే తామొక విశిష్టమైన అవతార కార్యార్థమై అవతరించామని తెలిపినట్లేగదా! అదే విషయం మరొకప్పుడు "అందరిలాగా పెంచలయ్యకు పిచ్చెమ్మకు కలిగాననుకున్నావా" అన్నారు - అంటే తమ జన్మ దివ్యజన్మనీ గనుక వారు చేసే కర్మలన్నీ దివ్య కర్మలనీ తెలియజేస్తున్నారన్నమాట.

శ్రేష్టుడైన సద్గురువుకీ లక్షణాలుండాలి. (1) బ్రహ్మనిష్ట (2) శ్రోత్రియత్వం (3) గురుభక్తి (4) సర్వవ్యాపక, సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్వాలు (5) భక్త వత్సలత (6) అధునిక యుగంలో సకలమత సమైక్యత (7) బోధనాదక్షత. ఇందులో ప్రత్యేకంగా గమనించదగినవి (1) భక్తవత్సలత (2) బోధనాదక్షత. ఈ లక్షణాలన్నీ శ్రీ వెంకయ్యస్వామివారిలో సంపూర్ణంగా ప్రకటమైనాయి. శ్రీ స్వామివారు బోధించిన రీతులు స్థూలంగా నాల్గురకాలుగా విభజించవచ్చు. (1) ఆయన జీవిత విధానం ద్వారా నిరంతరం జరిగే బోధ (2) సూక్తుల ద్వారా చేసిన బోధ (3) లీలా ప్రబోధము (4) స్వప్నాల ద్వారా ఆత్మ ప్రేరణ ద్వారా బోధ.

## జీవిత విధానం ద్వారా బోధ

దండ కమండలాలు కాషాయాంబరములు ధరించకున్ననూ వారి జీవితమంతా ఆదర్శప్రాయము. శాస్త్రసమ్మతమైన సాధుజీవితమే. భిక్షాన్నం స్వీకరించి దానితోటి భిక్షనిచ్చిన గృహస్తుల పాపాలను సాధ్యమైనంత మేరకు తన తపోశక్తితో క్షాళనచేస్తూ వారికి దైవభక్తి యందనురక్తిని కల్గించారు. షిర్డిసాయి చెప్పినట్లు "దైవ శక్తి నిరూపించగలవాడే నిజమైన సాధువు" అన్న వాక్యానికి సజీవ ఉదాహరణగా స్వామి జీవించారు. అందుకే తరించే మార్గం చెప్పమన్న సేవకునితో చూచి నేర్చుకోమన్నారు.

మానవుని ప్రధమ శత్రువు-సోమరి తనంఅని పెద్దలు చెపుతారు. దానిని మనదగ్గరకు రానియకుండడమే మొదటి సాధన. జీవితయాత్ర చివరివరకు ఈ శత్రువును దూరముగా ఉంచి శ్రీ స్వామివారు మనకు ఆదర్శము చూపారు.



ఒక్కక్షణం ఏమారకుండా అగ్ని హోత్రం వ్రేల్చేవారు. కాలక్షేపానికని కబుర్లు ఏనాడు చెప్పిగాని వినిగాని ఎరుగరు. వారిలాగమనలనుగూడ నిర్విరామ కృషి సల్పి ధ్యేయము సాధించమని మనకు బోధించారు.

**అనికేతుడు :**

తమదంటూ ఒక నివాసం లేకుండా ఎప్పుడూ పర్యటిస్తూ చెట్లనీడ-దేవాలయాలు, గ్రామచావడులలో తలదాచుకొనేవారు. వర్షమొస్తే చూరుక్రిందైనా ముడుక్కునే వారేగానీ గృహస్తులు ఇండ్లలోకి మాత్రమేనాడూ వెళ్ళి ఎరుగరు. ఎంతోమంది వారివలన మేలు బొందిన శ్రీమంతులు వారికి ఆశ్రమాలు నిర్మిస్తామన్నా సుతరాము అంగీకరించలేదు. ఒక భక్తుని మ్రొక్కుబడి తీర్చేందుకు ఇల్లు కట్టిస్తానంటే దానికి బదులుగా గొలగమూడి ఆంజనేయస్వామి దేవాలయానికి ప్రహరీ కట్టించారు. మరొకరు ఆశ్రమం కట్టిస్తానంటే "ఒకరేందయ్యా కట్టించేది-ఏ ఊర్లో వాళ్ళు ఆ ఊర్లో కట్టించుకుటుండ్లా" అన్నారు. ఈనాడీమాట అక్షరాలా నిజమైంది. ముముక్షువులైన సాధకులందరికీ వారి నమ్రత, నిరాడంబరత, కార్యదీక్ష, ధ్యేయము పైగల శ్రద్ధ, నియమపాలన సాటిజీవుల ఎడల నిరవధికము, నిస్వార్థమైన నిరంతర ప్రేమ,దయ,త్యాగనిరతి, భక్తుల మొహమాటమునకు, వత్తిళ్ళకు లొంగని పరమ వైరాగ్యము, అవధూత స్థితిలో కూడా శుచి శుభ్రత పాటించడం జీవితకాలమంతటి లోనూ ఏనాడూ కోపమెరుగని పరమశాంత స్వభావము మొదలైన దైవీసంపదంతా తెలుసుకొని ఆచరించగలిగితే అమర బోధగా మిగిలిపోతుంది. సాధుకులందరూ చూచి నేర్చుకునేందుకు వీలుగా భగవంతుడు భూమిపై నిలిపిన దైవీసంపదయొక్క నమూనా రూపమే గొలగమూడిలో వెలసిన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారు. వీటిలో ప్రతియొక్క అంశాన్ని ముందు ముందు ఉదాహరణలతో వివరించు కుందాం.

## సాధారణత్వం:

మాకేమైనా బోధించండి స్వామీ అని అడిగిన సేవకులతో సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ సాధించండి అని సెలవిచ్చారు.

సాధారణత్వమంటే ఏమిటో వారిలోనే చూడగలము. సహజసిద్ధంగా నరనరాలలో ఎన్నో జన్మలుగా జీర్ణించుకుపోయిన నిరాడంబరమైన నమ్రత, పరిపూర్ణ అహంకారరహితస్థితి, భగవంతుడే యజమాని అనే సహజసిద్ధమైన నిరంతర ఎరుక. పంచభూతాల నడుపుచేయగల్గినా, సంకల్ప మాత్రంచేత ఎంతటి వ్యాధులనైనా నయం చేయగల్గినా, అంతటా నిండియున్న పరబ్రహ్మమే తానైన స్థితిలో ఉండి సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు స్వామి అని అనుక్షణము వారి దివ్యమహిమల ద్వారా మనకు తెలుస్తున్నప్పటికి స్వామివారు మాత్రం "పైవాళ్ళు వప్పుకోరయ్యా" అనేవారు. మీకంటే పైవాళ్ళెవరు స్వామీ అంటేనవ్వి మౌనం దాల్చేవారు. భగవంతుడే యజమాని. ఆయనే-పైవాడు-అని స్వామివారి భావం. ఎవరికి వ్యాధి నయంచేసినా సరే-కష్టాలు తీర్చినా ఆ అధికృత గోరంత కూడా తనపై నుంచు కోకుండా తిరువళ్ళూరు వీరరాఘవస్వామి, కంచి వరదరాజస్వామి, పెంచలు నరసింహస్వామి, నెల్లూరు రంగనాయకులస్వామి పైపెట్టి అక్కడకెళ్ళి టెంకాయ కొట్టిరమ్మనో, నిద్రచేసి, భజనచేసి రమ్మనో, పూజ చేయించి రమ్మనో చెప్పేవారు. వీసమంతైనా తన ప్రమేయమున్నట్లు తెలియనిచ్చేవారు కాదు.

అంతటి మహోన్నత స్థితిలో నున్న స్వామివారిని "నీవెవరు" అని అడిగిన ఇల్లాలుతో నన్నందరూ వెంకయ్యస్వామి అంటారు అని అందరూ పిలిచే పేరు చెప్పలేదు. "పిచ్చోణ్ణమ్మా" అంత ముద్దేస్తావని వచ్చాను అని వీధి గుమ్మలంలో నిలబడి సంగట్టిముద్ద కోసం కొంగుపట్టి అనామక బిక్షకునిలాగ గృహస్థుల దయా దాక్షిణ్యాల కొరకు ఎదురుచూచిన సాధారణత్వమది. తన ద్వారా మేలుపొందిన భక్తులే తనకు సగౌరవంగా షడ్రసోపేతమైన బిక్షనివ్వాలని ఏనాడు ఎదురుచూడలేదు. శ్రీమంతులొచ్చి తనదగ్గర అన్న సంతర్పణలు చేసినప్పటికీ



చిట్టచివరివరకు గ్రామంలోకి వెళ్ళితెచ్చిన భిక్షాన్నముమీదనే ఆధారపడి జీవిస్తూ ఆశ్రమవానులందరికీ ఆదర్శప్రాయుడైనారు. అంతటి మహోన్నత స్థితిలోనున్న ఆ మహనీయుడంతటినమ్రత చూపితే మరి వారి పాదదాసులమైన మనమెలా ఉండాలో ఆలోచించుకోవాలి. గొలగమూడి ఆశ్రమంలో త్రవ్వేటప్పుడు మామూలు కూలివాని వలె పంచె ఎగగట్టి స్వహస్తాలతో మట్టి త్రవ్వి గంపకెత్తి బయటపోశారు. అంతేగానీ మీరు త్రవ్వండి నేను అభయహస్తం చూపిస్తాననలేదు.

అగ్నిగుండానికి సేవకులు కట్టెలు కొడుతుంటే వాళ్ళతోటి అడవికెళ్ళి వాళ్ళల్లో తాను ఒకడుగా తనవంతు సహకరించేవారు.

భక్తులెవరో పదికిలోల కలకండిస్తే, దాన్ని దుప్పట్లో మూట గట్టుకొని నెత్తిన బెట్టుకొని స్వయంగా మోసుకెళ్ళి అడవిలో కట్టెలు కొట్టే సేవకులకిచ్చి "సమానంగా పంచుకొండయ్యా" అని చెప్పారు. అంతేగానీ ఆపని ఇతరుల కప్పచెప్పలేదు. స్వాములమని వేషాలేసే కలియుగ స్వాములెన్ని జన్మలెత్తినా కట్టెలుకొట్టే వారికోసం కలకండ మోయగలరా? అమ్మోయ్! అలా మోస్తేవారి దృష్టిలో అదెంత గొప్ప నామోషీ!

## దివ్యప్రేమ:

సాధారణ మానవులవలె తన భక్తులపై అప్యాయత, ఆదరణ, మమతానురాగాలు గల్గియుండేవారు. ఒకప్పుడు ఎనిమిది సంవత్సరములు పర్యటనార్థం ఏగ్రామమూ వెళ్ళకుండా గొలగమూడిలోనే ఉండి నిరంతరం అగ్నిహోత్రం సాగించారు. ఆ కార్యక్రమం పరిసమాప్తమయ్యాక మొదటిసారి పర్యటనార్థం శ్రీ స్వామివారు తన బృందంతో కారులో బయలుదేరుతున్నారు. గొలగమూడిలోని అనేకమంది భక్తులు వారికి వీడ్కోలు చెప్పేందుకు కారుచుట్టూ చేరారు. కారు కదలబోయేటప్పుడు శ్రీ స్వామివారిని చూసే భాగ్యమింకెన్నాళ్ళకు కల్గుతుందోనని ఆత్మీయులందరూ కంటతడిపెట్టి బావురుమన్నారు. వారి దు:ఖంచూచి స్వామివారు కూడా సామాన్య మానవునివలె కంటతడిపెట్టారు. ఆ సన్నివేశం కణ్వమహర్షి శకుంతలను అత్తగారింటికంపే సన్నివేశాన్ని గుర్తుకు తెచ్చింది.

నమ్రత :

శ్రీ స్వామివారి నమ్రత, వినయము మాటలలో మాత్రమేగాక ప్రతికదలికలోను కనిపించేది. సంకల్ప మాత్రంచేత చనిపోయినవారిని బ్రతికించగల స్థితిలో ఉండి కూడా శ్రీ స్వామి త్రోవ నడిచేటప్పుడెంత నమ్రతగా నడిచేవారో చెప్పలేము. తన వెనకాల ఎవరైనా వస్తున్నట్లు పసిగట్టారంటే వెంటనే రెండడుగులు త్రోవ ప్రక్కకు తొలగివారికి దారి యిచ్చేవారు.

గృహస్థుల కంటే తానే గొప్పవాడననే తలంపు వారి కలలో గూడా మెదలి ఎరుగనంతటి సహజసిద్ధమైన నమ్రత అది. భగవంతుడే యజమాని (పైవాళ్ళు) అనే స్వతస్సిద్ధమైన నమ్రత అది. చల్లా శంకరరెడ్డితో అన్నారు. "అయ్యోమాకంటే మీరెంతో గొప్పవాళ్ళయ్యో, మీ చేతులపైన మా చేతులు క్రింద ఉండేటట్లు అంత ముద్దగెలికేస్తే (సంగటిముద్ద పెడితే) అదెంత గొప్పనుకున్నావు ఏమి సంగతి అని సెలవిచ్చారు అంతేగానీ నీవు సంసార లంపటంలో పడ్డ చీడపురుగులాంటి వాడవు, నీకు మోక్షమార్గం బోధిస్తాను, నన్ను గురువుగా చేసుకోమన్నారా? లేదు అదే వారి గొప్పతనం, మనకు తారసిల్లే ఏ గురువుగానీ సన్యాసిగాని ఈ మాటలనగలడా!

కార్యదీక్ష :

కార్యదీక్షంటే ఎలా ఉండాలో ఆచరించి చూపారు శ్రీ స్వామి. "వర్షాలు లేక గొడ్డు పిల్లా మర్షంగా చచ్చేటట్టున్నారు స్వామి" అని మొరపెట్టుకున్న భక్తులతో "అట్లాగయితే మనమన్నా కష్టపడి కురిపించుకోవద్దాయ్యా అన్నారు. ఒక అరగంట తర్వాత గంజి త్రాగండి స్వామీ అంటే "అనుకున్న పని అయితే గదయ్యా అన్నం తినాల్సింది" అని శెలవిచ్చారు. వర్షం కురిసేంతవరకు మూడు రాత్రులు మూడు పగళ్ళు నిద్రాహారాలు లేకుండా అసనమైనా మార్చకుండా కూర్చోనుండి పోయారు. కార్యదీక్షంటే ఎలా ఉండాలో స్వామివారిని చూచి నేర్చుకోవాలి.

మనకేదైనా సమస్య వచ్చినప్పుడు అంటీ అంటనట్లు పట్టీ పట్టనట్లు శ్రీ స్వామి వారి సమాధి దర్శించి ఒక టెంకాయ అగ్ని గుండంలో పడేసి వెళ్ళిపోతాము.



కానీ మన పూర్వజన్మ చెడుకర్మల ఫలితంగానే ప్రస్తుత సమస్య తటస్థించిందని దాన్ని క్షాళన చేసేందుకు తగు విధంగా నామ జపము-ప్రదక్షిణలు, పారాయణ వగైరా సాధనలు పట్టుదలగా చేయకుండానే శ్రీ స్వామివారు ఇంకా నాసమస్య పరిష్కరించలేదు, వారికి నాపైదయ గల్గలేదని వాపోతాము.

కానీ శ్రీ స్వామివారు సంకల్ప మాత్రంచేత వర్షం కురిపించగలిగి యుండి కూడా అలా చేయడంలేదు. ఎందువలన? ప్రజల సామూహిక పాపకర్మల ఫలితమే అనావృష్టి రూపంలో అనుభవమౌతుంది. అట్టి పాపకర్మలను రెండు మూడురోజులపాటు రేయింబవళ్లు చేసిన తపోశక్తితో భస్మం చేసాకనే వర్షం కురుపిస్తున్నారు. కనుక మన సమస్యలు తీరాలంటే ఎంత పట్టుదలగా సాధన చేయాలో యోచించండి. అందుకే స్వామి "మైసూరు మహారాజ కనిపిస్తే మాత్రం ఎంలాభం-మనం చేసుకున్నదేగదా మనకు" అని అన్నారు. కొద్దిపాటి శ్రద్ధ పట్టుదల లేకుండా కేవలం శ్రీ స్వామివారికి విన్న వించినంత మాత్రాన మన చెడ్డకర్మలను శ్రీ స్వామివారు తీసెయ్యాలనుకోవడం ఎంత అధర్మమో యోచించాలి. గనుక మన బాధలు తీరేందుకు సాధనచేసే శక్తి పట్టుదల శ్రద్ధ ప్రసాదించమని శ్రీ స్వామివారిని హృదయపూర్వకంగా ప్రార్థించి శ్రీ స్వామివారివలె పని అయితేనే అన్నం తినాలనే పట్టుదలతో ముందుకు సాగుదాం.

శ్రీ స్వామివారి ప్రతి కదలిక, ప్రతి చిన్నమాట మానవాళికేదో ఒక గొప్పసత్యాన్ని బోధించేవిగానే ఉండేవి. మరొక పర్యాయం నిష్కామకర్మ కార్యదీక్ష అంటే ఏమిటో వారు బోధించకుండానే తన చేతలతోనే బోధించారు. శ్రీ స్వామివారు బొంతచెట్టు క్రింద అగ్ని వ్రేలుస్తుంటే వర్షం వలన అది ఆరిపోతుంది. కానీ స్వామివారు ఎంతో ఓర్పుతో పట్టుదలతో చిదుగులు పెట్టి మంటేసే ప్రయత్నం మాత్రం మానలేదు. "అంత శ్రమెందుకుస్వామీ దేవాలయం వరండాలోకి అగ్నిని మార్చుకొండని" సేవకులు సలహా ఇచ్చారు. " బొక్కపడుతుందయ్యా" అని క్లుప్తంగా చెప్పితన పనిలో నిమగ్నమయ్యారు.

తన అగ్ని సేవనానికి ఆటంకం జరగడమే దైవనిర్ణయమైతే అగ్నిని దేవాలయ వరండాలోకి మార్చినా-వరండా కప్పుకు బొక్కపడైనా అగ్ని సేవనానికి అటంకం జరుగుతుందని తెల్పారు. గనుక మనం చేయదగినదల్లా ఒక్కటే. పట్టుదల వదలకుండా దైవంపై భారంవేసి ఓర్పుతో ఫలితమాశించకుండా పని సాగించడమే. శ్రమకు వెరచినట్లయితే రానున్న ఆటంకం ఎచ్చటనైనా వచ్చి తీరు తుందని గనుక ఆ సన్నివేశం మన ఓర్పు శ్రద్ధలకే పరీక్షని భావించి కార్యం నిలపకుండా కొనసాగించడం మాత్రమే మన కర్తవ్యమని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు.

దేవాలయ వరండాలో అగ్ని వ్రేల్చడం సులభం. వర్షం వస్తుంది గనుక చెట్టు క్రిందైతే కష్టం. సుఖేచ్ఛతో స్థానం మారిస్తే వచ్చే కష్టం రాక మానుతుందా? ఒక్క ఇతరులను విమర్శించడంలో తప్ప సాధనలో చింతాకంత అవరోధం ఎదురైనా దాన్ని సాకుగా తీసుకొని నియమభంగం చేసుకోవడం మనకు సహజలక్షణం. ఈ సాకు వెనుక సోమరితనం, సుఖేచ్ఛ అనే హీనజాతివారు మనలో పొంచి దాగి యున్నారని వారిని మనలో నుండి వెళ్ళగొట్టనిదే అటు లౌకికంగాగానీ ఇటు ఆధ్యాత్మికంగాగానీ ప్రగతి సాధించలేమని శ్రీ స్వామివారీ చర్యద్వారా బోధిస్తున్నారు.

అందుకే శ్రీ స్వామివారు రోశిరెడ్డితో "అయ్యా నీది భీష్మని పట్టుదల అని వ్రాసుకోమని, కాటంరెడ్డి సుబ్బరామిరెడ్డిగారితో" అయ్యా నీది దుర్యోధనుని పుట్టదల అని వ్రాసుకోమని శెలవిచ్చారు. మిగిలిన వారికి కూడా చెప్పారుగానీ గుర్తులేదు. అలాంటి గొప్ప కార్యదీక్ష పట్టుదల లేకుంటే మానవుడేమీ సాధించలేడని కూడా బోధించారు. ఈవిషయాన్నే షిర్డిసాయి "శక్తినంతా వినియోగించి కృషిచేస్తేనేగానీ ఆధ్యాత్మిక పథంలో ఫలితముండదు" అని శలవిచ్చారు.

## నిష్కామకర్మ:

ఎవరి ప్రార్థనలతోనూ నిమిత్తంలేకుండానే మేఘుడు వర్షిస్తున్నాడు. సూర్యుడు వెలుగునిస్తున్నాడు. ఆపదలో నున్నవారికి సహాయం చేయడం కూడా



అలాగే ఉండాలని పెద్దల వాక్యం. మంగుపల్లెలో కలరాదేవత స్వైరవిహారం చేస్తుంది. మనుషులు గుంపులుగుంపులుగా చనిపోతున్నారు. ఆ గ్రామస్తులు శ్రీ స్వామివారికి మొరపెట్టుకొనేందుకు వీలులేకుండా పెన్నానది గట్లు తన్నుకొని పారుతుంది. నది ఆవలి గట్టునున్న స్వామివారు చెలమానాయుడి చేతికొక కాగడా వెలిగించి ఇచ్చి "అయ్యా! నీ చూపు కాగడామీద నిల్పి అటూ ఇటూ చూడకుండా నదిలోకిదిగి నడుపు. నేను నీ వెనకాలే వస్తుంటాను" అని ఆజ్ఞాపించారు స్వామి. నదిలో నీరు మోకాళ్ళవరకే ఉండడం చలమనాయుణ్ణి దిగ్భ్రమ గొల్పింది. ఆవిధంగా స్వామి నదిదాటి మంగుపల్లి పొలిమేరలో ఒక కర్రనాటి దానికొక దారం కట్టివచ్చారు. అది మొదలు ఒక్కరు కూడా ఆగ్రామంలో మరణించలేదు. క్రమంగా కలరా అదృశ్యమైంది. శ్రీ స్వామిపై మనకు సంపూర్ణ విశ్వాసముండాలే గానీ వారు మనలను సప్తసముద్రాల కావల ఉన్నా ఆపద సమయంలో వెంటనే ఆదుకుంటారని మన ప్రార్థనలతో అవసరమే లేదని ఈ లీల నిరూపిస్తుంది.

గనుక అవసరాన్నిబట్టి ఆర్తుల అభ్యర్థన లేకుండా ఆదుకోవడమే నిష్కామ కర్మని, అట్టి సేవద్వారా మాత్రమే చిత్తశుద్ధి గల్గి దైవకృప పొందవీలౌతుందని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు. ప్రతిఫలాపేక్ష లేకుండా చేసేదే నిష్కామకర్మ. అరచేతిలో రోమాలు మొలవకపోవడం ఎంత సహజసిద్ధమో ప్రతిఫలాపేక్ష లేకుండా కర్మ ఆచరించడం అంత సహజసిద్ధంగా ఉండాలంటారు జ్ఞానేశ్వర మహారాజ్. కార్యము సఫలమైనా, విఫలమైనా మనసులో సంతోషంగాని బాధగాని లేకుండా జీవించడమే నిష్కామకర్మ. యజమాని భగవంతుడు. నీవు తెడ్డులాంటివాడవు. నీకు సంతోషంగాని బాధగాని ఎందుకు. అదే అల్లామాలిక్ లోని అర్థం అంటారు శ్రీ భరద్వాజగారు.

## ప్రేమ-త్యాగము :

"ఏమైనా బోధించండి స్వామీ" అని సేవకులడిగినప్పుడు శ్రీ స్వామివారు "చూసి నేర్చుకోండయ్యా" అని ముక్తసరిగా బోధించారు. ఈ మహనీయమూర్తి

ఒకవంక పరబ్రహ్మ స్వరూపులుగా అనంతమైన ఆధ్యాత్మిక శక్తి విరజిమ్ముతూనే మరొక వంక ఉత్తమమైన ఆదర్శ ప్రాయుడైన సాదువుంగవుడుగా గూడా ప్రతిచిన్న విషయములోనూ తన ఆచరణను అందరికీ ఆదర్శప్రాయంగా ఉండేటట్లు అనుక్షణము ఆచరించి చూపారు. వారి జీవిత విధానాన్ని జాగ్రత్తగా విమర్శనాదృష్టితో గమనించినట్లయితే ప్రతి చిన్న విషయంలో గూడా వారి ఆచరణ మనకు శిరోధార్యమై నిలుస్తుంది.

సర్వజీవులను తన ప్రతిరూపాలుగా చూచుకోగల్గినప్పుడే భగవంతుని కృపకు పాత్రులు కాగలము. అన్ని జీవుల రూపంలోను విశ్వరూపుడైన తన గురువే ఉన్నారని వారిని సేవించడంలో "శరీరం, ఇంద్రియం, ప్రాణం, అర్థ. స్వజన బాంధవాన్ అత్మధారాధికం సర్వం సద్గురుభ్యోన్నివేదయేత్ అన్నట్లు ఆచరించాలని మహనీయులు తలుస్తారు. అలా ఆచరించినవారే దైవస్వరూపులు, మనలను గూడా అలా ఆచరించి దైవకృప పొందమని వారి ఆచరణ ప్రబోధిస్తుంది.

శ్రీ స్వామివారు కుష్ఠు, ఆయాసం వంటి బయంకర రోగపీడితులు తన్నాశ్రయించినప్పుడు అపారమైన కృపతో వారి బాధను శ్రీ స్వామివారే భరించేవారు. వృద్ధాప్యంలో ఎంతో శ్రమకోర్చి తన గృహస్తు భక్తులకు తన దర్శనసేవా భాగ్యాలు కల్గించాలని ఆయా గ్రామాలలో విధిగా పర్యటించేవారు. అట్టి పర్యటనలలో అన్న పానీయాల కెంతటి అసౌకర్యమైన సంతోషంగా భరించేవారు. ఎండ వానలవంటి ప్రకృతి వైపరీత్యాలను గూడా లెక్క చేసేవారుకాదు. ధన, కనక, వస్తువాహనములు ఎవరైనా దానం చేయవచ్చు. కానీ సాటి జీవుల ఉద్దరణ కొరకు తన శరీరాన్నే త్యాగం చేయడంలో శ్రీ స్వామివారు శిబిచక్రవర్తిని గూడా మించారు. కారణం శిబిచక్రవర్తి ఒక్కపర్యాయమే తన మాంసం త్యాగం చేశారు. కానీ శ్రీ స్వామివారు ఎన్ని పర్యాయాలు తన భక్తుల యొక్క భయంకర వ్యాధులను తాను స్వయంగా అనుభవించి వారి బాధలు బాపితద్వారా వారికి భక్తి విశ్వాసాలు పెంపొందజేశారో లెక్కింప సాధ్యముగాదు. అట్టి నిస్వార్థమైన



త్యాగమే భగవత్ కృప కల్గేందుకు మార్గమని శ్రీ స్వామివారు నోటితో చెప్పకుండా తన ఆచరణ ద్వారా బోధించారు.

ఈ విధంగా మంచివారు చెడువారు అనే విచక్షణ లేకుండా సహాయం చేయడం అపాత్రదానమౌతుందని భాష్యం చెప్పే ప్రబుద్ధులు కూడా లేకపోలేదు. కానీ మంచి, చెడు విచక్షణ లేకుండా వరుణుడు, వాయువు, సూర్యచంద్రులు అందరికీ సమానంగానే తమ సేవనుఅందించినట్లుగా మనం కూడా సహాయం చేయాలని శ్రీ స్వామివారి అభిమతం.

శ్రీ స్వామివారి అగ్నిగుండం యొక్క పవిత్రత నెరుగని పామరుడు చలిలో బీడికాల్చుకోవాలని తపనపడుతుంటే నిప్పందించిన ప్రేమమూర్తి. స్వామి ఎదుటి వారి భావాన్ని అనుసరించి నడుచుకునేవారు. చిన్ననాటి నుండి పశుపక్ష్యాదులకు ఎంతో సమృద్ధిగా ఆహార మిచ్చేవారు. ఇంటికి తెస్తున్న పచ్చిగడ్డి మోపును దిక్కులేని బక్క పశువుల ముందుంచి వచ్చే పుణ్యాత్ముడు. గనుకనే పిచ్చెంకయ్య అనే సార్థక నామధేయుడైనాడు. ప్రతినిత్యం తులసమ్మగారి చేత చీమలకు విధిగా నూకలు పోయించిన త్యాగధనుడు. చివరి రోజులలో గూడా బాహ్య ప్రజ్ఞ ఉన్నప్పుడు కొంత గంజి భూదేవికి నర్పించాకనే త్రాగేవారు. అన్ని జీవులలో ఉన్న పరమాత్మను నిరంతరం గుర్తిస్తూ ఆ జీవులలోని పరమాత్మకు నివేదించాకనే మనం ఆహారం తీసుకోవడమే ఉత్తమమైన దైవారాధనన్న గీతా వాక్యాన్ని తన ఆచరణ ద్వారా మనకు బోధించారు స్వామి. తన సేవకులు, దర్శనార్థం వచ్చిన భక్తులు, అందరూ తృప్తిగా భోంచేశాకనే శ్రీ స్వామివారు ఆహారం తీసుకునేవారు.

మానవునకు, పశుపక్ష్యాదులకు గల ముఖ్యభేదం కృతజ్ఞతాభావం, పచ్చిరక్తం త్రాగే సింహం కూడా అండ్రోక్లేనుపట్ల తన కృతజ్ఞత చూపడం మనకు తెలుసు. మన తండ్రియైన భగవంతుడు మనకు సర్వం ప్రసాదించారు. వారిపట్ల మనమెంత కృతజ్ఞతతో వ్యవహరించాలో, వారికి సమర్పించే నివేదనలలో మన భావమెలా ఉండాలో మనం యోచించుకోవాలి.

కృతజ్ఞతంటే ఎలా ఉండాలో శ్రీ స్వామివారు ఆచరించి చూపాడు. చెర్లోపల్లి శేషయ్యనాయుడి తల్లిగారు అర్థరాత్రి వేళ వచ్చినాగాని శ్రీ స్వామివారికి కడుపునిండా అన్నం పెట్టేవారు. ముప్పై సం॥ తర్వాత కూడా శ్రీ స్వామి వారామె సేవను మరచిపోలేదు. ఆమె కుమారుడు శేషయ్యనాయుడుగారు రోడ్డున పోతుంటే పిలచి "ఒక సం॥రెండు నెలలకు నీకు ప్రాణగండముందని" తెల్పడమేగాక ఆగండం నుండి రక్షింపబడేటట్లు తన ఆశీర్వాదంతో ఒక చీటి వ్రాసి ప్రసాదించారు. అక్షరాలా అదేవిధంగా జరిగింది. రొంపిదుక్కి దున్నుతూ కరెంటు ఎర్తయి ఆ ప్రమాదంలో ఎద్దుమాత్రం చనిపోయితాను మాత్రం క్షేమంగా కాపాడబడ్డాడు. ఆ మహనీయునకు బిక్షనిఛ్ఛ మనం మరచిపోవచ్చు కానీ వారు మాత్రం ఆ స్వల్పమైన సేవకు మనలను మాత్రమేగాక మనవారందరినీ కంటికి రెప్పవలె కాపాడడం తథ్యం.

"వెంకయ్య పేరు మీద పిడికెడు మెతుకులు పెట్టినవారి మంచి చెడ్డలన్నీ మనమే చూడొద్దయ్యా అన్నారు గదా!"

ప్రతి చిన్నవిషయలో గూడా మనం వారివలె కృతజ్ఞతాభావంతో జీవిస్తే కర్మబంధాలనుండి విడివడి మోక్షసామ్రాజ్యానికి అర్హులమౌతామని శ్రీ స్వామివారీ లీలలద్వారా బోధిస్తున్నారు.

"భగవంతుని సన్నిధిలో అందరూ సమానులే" అనే మాటకు శ్రీ స్వామివారు తన ఆచరణ ద్వారా చక్కని వివరణ బోధించారు. ధర్మం వేరు ధర్మసూక్ష్మం వేరనే వేదవాక్యాన్ని వివరించారు.

"మైసూరు మహారాజా కనిపించినా మనకే మొస్తుంది. మనం చేసుకున్నదే గదయ్యా మనకు" అని సెలవిచ్చారు. మైసూరు మహారాజా లాంటి భగవంతుడు మన సాధన ననుసరించి మనలను అనుగ్రహిస్తారని అర్థం అంతేగానీ అందరినీ ఒకేగాట కట్టివేయరన్నమాట. అందుకే స్వామివారు తనను స్త్రీలు తాకేందుకు ఏనాడూ అంగీకరించనప్పటికీ ఎన్నో రోజులుగా పారాయణ నామజపం ధ్యానం



మొదలయిన భక్తిసాధనలు చేసిన స్త్రీలు వచ్చినప్పుడు వారి మనోవాంఛ ననుసరించి తన వ్రేలిక్రింద కాగితాలు పెట్టే మిషతో వారికి తమ స్పర్శన భాగ్యం కలిగించి వ్రేలిముద్రలు వేసిన కాగితాలు వారికి ప్రసాదించారు.

అప్పుడే ఆహారం తీసుకోవడం పూర్తిచేసి యున్నప్పటికీ నామజపం చేస్తూ తయారుచేసి తెచ్చిన ఇడ్లీలన్నీ పూర్తిగా ఆరగించారు.

ఏనాడు ఎవరింటికి వెళ్ళని శ్రీ స్వామి నామజపం పారాయణ సత్‌సంగం జరిగే వారి గృహానికేతెంచి వారి అతిథ్యం స్వీకరించి ఆశీర్వదించారు.

రాత్రింబవళ్ళు ఎంతో ప్రేమతో తనను సేవించే సేవకులకు కొన్ని తినుబండారాలు మిఠాయిలు దాచి ఉంచి అర్థరాత్రివేళ తినమని యిచ్చేవారు. మరి అందరికీ సమానంగా పంచరేమి? మనముండే దాన్నిబట్టి వారు మనయెడల ప్రత్యేక శ్రద్ధ చూపడం తథ్యం. గనుక శ్రీ స్వామివారిని ప్రత్యక్షంగా సేవించిన సేవకులను ప్రత్యేకంగా ఆదరించడం మన ధర్మం. అదే స్వామివారి ధర్మ సూక్ష్మమయిన పద్ధతి. మనం ప్రత్యేక స్థానమిచ్చామని వారు గర్వించి అడ్డదోవలు త్రొక్కితే వారి కర్మేవారిని దండిస్తుంది.

**ధర్మసూక్ష్మం :**

అందరూ సమానమే - గనుక ప్రసాదం అందరికీ సమానంగానే అందాలి అనే పిచ్చిమాటలు మాట్లాడలేదు. నిరంతరం రాత్రింబవళ్ళు కంటికిరెప్పవలె కాచుకొని తనను సేవించే రోశిరెడ్డిలాంటి సేవకులకు కొన్ని మిఠాయిలు తన అసనం క్రింద దాచిపెట్టి అర్ధరాత్రివేళ వారి చేతిలోవేసి "ఆసాల వెనక్కుపోయితిని రాయ్యా" అని ప్రేమగా పలికేవారు.

అందరిలాగ సంగటి మిరప్పొడి తినలేని కాటంరెడ్డి సుబ్బరామిరెడ్డిలాంటి వారికి "అమ్మా అన్ని రెళ్లలుంటే ఆయనకు పెట్టమ్మా-సంగటి తినలేడు పాపం' ' అని వరి అన్నం ప్రత్యేకంగా పెట్టించేవారు శారీరక అవసరాలు అందరికీ ఒకటిగా వుండవు. వారి వారి అవసరాలకు తగినట్లు వారికి ఆహారం సమకూర్చే

దయామయుడు. ఇదేవిధంగా ఎక్కువగా కష్టం చేసేవారికి పై ఖర్చులకుగాను అందరికంటె ఎక్కువగా డబ్బులిచ్చేవారు. కానీ నేడీ ధర్మసూక్ష్మము నెరుగక అందరినీ సమానంగా చూడాలనే నినాదాలు చేసేవారు తమ తప్పు గుర్తించి సవరించుకొనే సద్బుద్ధిని శ్రీ స్వామివారు ప్రసాదించాలని ప్రార్థిద్దాం.

### వైరాగ్యముః

వైరాగ్యమంటే ఎలా ఉండాలో సాధకులకు నేర్పేందుకే శ్రీ స్వామివారవతరించారా! అన్నట్లుండేది వారి నడవడి నూతన. వస్త్రాల నెన్నడూ శరీరానికి తగల నిచ్చేవారుకాదు. "రోశిరెడ్డీ వూళ్లోకి పొయ్యి ఎవరినయినా అడిగి పాతగుడ్డలు తీసుకరాయ్యా. ఇచ్చిన వాళ్లకు జబ్బులు పోతాయి. మనకు పనికొస్తాయి" అని సెలవిచ్చేవారు చినుగుపట్టని మంచి పంచలిస్తే "అయ్యో! ఇట్లాటి వెందుకు తెచ్చావయ్యా" అని వాటినక్కడ పడేసేవారు. తెచ్చిన వాటిల్లో చినుగుపట్టిన వాటినే కౌపీనంగాను తల గుడ్డగాను వాడుకునే వైరాగ్యమది. బలవంతాన యిచ్చిపోయిన ఖరీదయిన జిప్‌బ్యాగును అందరినీ నిద్రపోనిచ్చి అగ్నిగుండములో కాల్చేసిన వైరాగ్యమది. వద్దన్నా వినకుండా ఖరీదైన క్రొత్త దుప్పటిని తీసుకున్న సేపకుల చేత మిడిమిడికాలే ఎండలో ఆ దుప్పటిని రాళ్ళతో తెగ్గొట్టించి జానెడు జానెడు పేలికలు చేసి అందరికి పంచిపెట్టిన వైరాగ్యమూర్తి స్వామి. బాహ్యప్రజ్ఞ ఉన్నన్ని రోజులు తాటి మట్టలు చినిగిపోయిన గోతాలే పట్టుపాన్పులుగా స్వీకరించిన మహనీయుడు శ్రీ స్వామి. అలాంటి వైరాగ్యం లేనిదే దైవరాజ్యానికి ప్రవేశములేదని సాదకులందరికీ ప్రత్యక్షంగా బోధించారు. తమకు నిండా ఆకలిగా ఉన్నప్పుడు లడ్డులాంటి మిఠాయి పెట్టినా తింటారు. కానీ ఆ మిఠాయిలో కారం పొడికలిపి దానిరుచిచంపితినే వారు. ఆకలినమయానికి భగవంతుడిచ్చిన దానిని నిరాకరించలేక తన వైరాగ్యనియమాన్నివదలలేక అలాచేసేవారు.



### సత్ సంగముః

"వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది" అని శ్రీ స్వామివారు అభయ మిచ్చారు. మన భక్తి విశ్వాసాలు ఎంత తీవ్రంగా వుంటే అంతకు వెయ్యిరెట్లధికంగా శ్రీ స్వామివారు అనుభవాలు ప్రసాదిస్తారు. మరి మన కట్టిభక్తి విశ్వాసాలు కలగడ మెట్ల? నారద మహర్షుల వారికి సత్‌సంగము (అంటే మహాత్ముల సన్నిధి) సేవల వలన మాత్రమే అంతటి తీవ్రమైన భక్తి విశ్వాసాలు కలిగాయని వారు చెబుతారు. అలాంటి మహనీయుల ప్రత్యక్ష సన్నిధి సేవలు లభించనప్పుడు వారి జీవిత చరిత్ర పారాయణ, వారి చిత్రపటాలను భావయుక్తంగా పూజించడం కూడా వారి ప్రత్యక్ష సన్నిధితో సమానమైన ఫలితాన్నిస్తుందని శ్రీ రమణమహర్షి చెప్పారు. అది అక్షరాల నిజమని మహాత్ముల చరిత్ర పారాయణ చేసిన భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నవి. అలాంటి భక్తులు కొందరొక చోటచేరి చేసే సమూహిక పారాయణ, నామజపం. భజనలు ఆయా గ్రామస్తులందరికీ అద్భుత ఫలితాలివ్వడం చూస్తాము. గనుక ఈ రోజు మనం చేసే పారాయణ, నామజపము, భజనలే రేపటి మన తీవ్రభక్తి విశ్వాసాలకు పునాదులు కనుకనే భగవద్గీతలో "దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞ పూజనం" నిత్యం విడవకుండా అందరూ చేయవలసిన పుణ్యకర్మలుగా చెప్పబడ్డాయి. అందుకే స్వామి వారు తన సేవకులు ప్రతినిత్యం భజన నామ సంకీర్తన చేసుకొనేటట్లు ప్రోత్సహించేవారు. భక్తులు రకరకాల తత్వాలు పాడుతుంటే వాటిని ఆపి "ఓం నారాయణ ఆదినారాయణ" అనే మహామంత్రాన్ని సంకీర్తన చేయించేవారు. ఈ మంత్రాన్ని నాదం మీటుతూ శ్రీ స్వామివారు తన్మయత్వంతో సంకీర్తన చేస్తుంటే వినేవారికి కూడా తన్మయత్వం కలిగేదట. గనుక అతి శీఘ్రంగా స్వామివారి అనుగ్రహం కలగాలంటే ప్రతి గ్రామంలోను కనీసం ఒకరిద్దరితోనైనా భజన బృందం ఏర్పడాలి. అందరికీ అందుబాటులో ఉండే సమయము, స్థలములో కూర్చొని స్వామివారి పటం ముందు కడ్డీలు వెలిగించి ఆ మహనీయుని దివ్యచరిత్ర కొంతసేపు ఒకరు చదువుతుంటే మిగిలిన వారు వినడం, తర్వాత కొంతసేపు ఓం నారాయణ

అదినారాయణ మంత్రం సంకీర్తన చేశాక మనస్సు ఏకాగ్రమయ్యే తేలికయిన నామాలతో శ్రీ స్వామివారు ఎదురుగా పటం రూపంలో ఉన్నారు అనే భావంతో భజన చేసుకోవడం, శక్తికొద్దీ నైవేద్యం పెట్టి ప్రసాదం తీసుకోవడం, భజనకు ముందుగానీ తరువాతగానీ ఇంటికి చేరేంతవరకు లోకాభిరామాయణము, రకరకాల విమర్శలు తప్పని సరిగా మాననిదే భజన చేసినందుకు ఫలితముండనే ఉండదని బాగా గుర్తించుకోవాలి. ఎందుకంటే అలాంటి వ్యర్థ సంభాషణలు చేసి వచ్చిన సేవకుల సేవలను శ్రీ స్వామివారు వెంటనే నిరాకరించేవారు. "ఆయన మనుషుల్లోకి పోయి వచ్చాడు. ఆయన వద్దుగంజి నీవు పోయ్" మని మరొకరి చేత గంజి పోయించుకొనేవారు. నేటి సత్‌సంగాలలో ఎక్కువ మంది ఈ జాగ్రత్త తీసుకోరు గనుకనే వారికి సత్‌సంగము వలన సత్వర సత్‌ఫలితాలు రావడం లేదని. అందలి సభ్యులు ఆధ్యాత్మికంగా ఎలాంటి అభివృద్ధి సాధించలేకున్నారని బాగా గుర్తించాలి. ఈ జాగ్రత్త తీసుకోకుండా సత్‌సంగాలు చేయడం భాండ శుద్ధిలేని పాకం చేయడం వంటిదే.

శ్రీ స్వామివారి చరిత్రమూడు ఆవర్తాలు చదివాక ఎక్కువ మంది సభ్యులు ఇష్టపడే మరే ఇతర మహాత్ముని చరిత్రయినా పారాయణచేస్తే బుద్ధివికాసం కలుగుతుంది. బుద్ధి వికాసం చెందకుండా ఎన్నాళ్ళు భజన చేసుకున్నా మనసుకు శాంతి తృప్తి వుండదు.

పూర్వజన్మ చెడ్డకర్మల ఫలితంగా కష్టాలు సంప్రాప్తిస్తుంటే వాటిని సంతోషంగా అనుభవించే బదులు ఎంతోబాధతో అనుభవిస్తాం అంటే బుద్ధి వికసించినవాడు కష్టాలలో గూడా హాయిగా సంతోషంగా ఉండగల్గుతాడు గురువు, దైవం మీద విశ్వాసంవీడడు. రెండవది మహాత్ముల చరిత్రలు వారి బోధలు, సూక్తులు హృదయగత మయ్యేటట్టు నిత్యం మననం చేయడం ద్వారా అనేక జన్మలుగా మనలో పేరుకొన్న దుర్గుణాలు పోగొట్టుకోవాలి లేకుంటే గురుకృప మనపై ప్రసరించదు. శ్రమ మాత్రమే మిగులుతుంది. ఆధ్యాత్మికంగా బుద్ధి వికసించాలంటే భజనతోపాటు నిత్య పారాయణ కూడా చాలా అవసరము. మహాత్ముల చరిత్ర



పారాయణ శ్రవణం చేసేటప్పుడు మనలోని చెడ్డగుణాల ప్రస్తావన వచ్చినప్పుడంతా హృదయంలో కలుక్కుమని భాదేస్తుంది. కొన్నాళ్ళకు పట్టుదలతో ఆదుర్గుణం విడనాడ గల్గుతాము. మహాత్ముల చరిత్ర పారాయణ శ్రవణం లేనివారికి అలాంటి చెడ్డగుణాలు తమలో ఉన్నాయనే విషయమే తెలియదు. అలాంటప్పుడు వాటిని పోగొట్టుకునేదేముంది. ఆవిధంగా చెడుగుణాల నుండి బయటపడనిదే దైవకృప పొందేందుకు వీలేలేదుగదా!

గనుకనే శ్రీ స్వామివారు దైవదర్శన మెలా అవుతుందని అడిగిన వారితో వీరబ్రహ్మంగారి చరిత్ర చదవమని చెప్పారు. అంటే దైవదర్శనానికి మహాత్ముల చరిత్ర పారాయణ ఎంత గొప్ప సాధనమో తెలియబట్టే అరవ దేశంలో, పెరియపురాణం, ఆళ్వారుల చరిత్ర మహారాష్ట్రలో గురుచరిత్ర సాధకులు శ్రద్ధగా పారాయణ చేసే సాంప్రదాయం ఏర్పడింది మనలను దీన్ని గుర్తించమనే శ్రీ స్వామివారు వాచా బోధించడమే గాక చివరి రోజులలో గురవయ్యను ప్రేరేపించి మాధవదాను చరిత్ర చదివించుకున్నారు. మహనీయుల చరిత్ర పారాయణ చేసే వాళ్ళు వస్తే వాళ్లుకోరిన కోరికలన్నీ తీర్చారు స్వామి. చివరకు స్త్రీలు గూడా తనను తాకి నమస్కరించుకునే భాగ్యం కల్గించి మహాత్ముల చరిత్ర పారాయణ యొక్క గొప్పదనాన్ని తెలుసుకోమని బోధించారు. వారి బోధను ఆచరించకుండానే వారి కృపకు ప్రాకులాడితే ప్రయోజన మేముంటుందో మనమే యోచించుకోవాలి. గనుక శ్రీ స్వామివారి కృప పొందాలంటే సత్‌సంగాలేర్పడాలి. మహాత్ముల చరిత్రలు బోధలు పారాయణ చేయాలి. సత్‌సంగమునకు ముందు తర్వాత కూడా వ్యర్థ సంభాషణలు తప్పనిసరిగా మానాలి-మనలోని మాల మాదిగ జోగిజంగం అనే దుర్గుణాలపై పోరాటం ప్రకటించి వాటిని వెళ్ళగొట్టాలి. మనవల్ల గాకుంటే కన్నీటితో స్వామికి విన్నవించుకొని తగిన ప్రాయాశ్చిత్తాలు శిక్షలు విధించుకోవాలి. నామ సంకీర్తన, భజన ఆర్తితో హృదయపూర్వకంగా చేయాలి. ప్రేక్షకులు శ్రోతలు మెచ్చుకునేటట్లు ఒకరికంటే మిన్నగ పాడాలనే భావం ఏ కొంచెం ఉన్నా మన శ్రమంతా బూడిదపాలైన పన్నీరేనని బాగా గుర్తించాలి.

అలాంటి పటిష్టమైన శ్రద్ధాభక్తులుగల సభ్యులతో కూడిన సత్‌సంగాలు మన పల్లెసీమ లన్నింటికి శ్రీ స్వామివారు ప్రసాదించి వారు కోరినుట్ల ఊరూరా వెలవబోయేవారి మందిరాలు అన్ని మందిరాలవలె గాకుండా సభ్యులకు జీవితంలో తృప్తి, శాంతి, ఆనందము ప్రసాదించే పాఠశాలలుగా వాటిని స్వామివారే తీర్చి దిద్దాలని మనందరము ఆర్తితో స్వామివారిని ప్రార్దిద్దాం. జై స్వామిని సమర్థ.

పై విదంగా చక్కని సత్‌సంగాలు హృదయ పూర్వకంగా కోరేవాళ్లుంటే కుంటి సాకులు చెప్పకుండా మొదటి మెట్టుగా ముందు మన ఇంట్లోని సభ్యులందరినీ ఒక అరగంట కూర్చోపెట్టి మహాత్ముల చరిత్ర శ్రవణం చేయిస్తే ఆ చిన్న సత్‌సంగ బలమే ఆయా గ్రామాలలో గ్రామస్తులందరితో కలిసిన సత్‌సంగ మేర్పరచగలదని నా స్వానుభవం నిరూపిస్తుంది.

కొందరు భక్తులు తమ ఇండ్లకు ఆహ్వానిస్తే "దోవలో ముండ్ల మండలున్నాయి. వచ్చేందుకు పైవాళ్ళ ఒప్పుకొనడంలేదు" అనేవారు. మనం చేసే అధర్మ పనులే ఆముండ్లమండలు ఇతరులు మనకేది చేయాలని తలుస్తామో. అది మనం ఇతరులకు చేయడం, ఇతరలుమనకేధిచేయరాదని తలుస్తామో అది మనం ఇతరులకు చేయకుండుటయే ధర్మము.

**ఆహార నియమం:**

దైవకృప పొందాలని సాధనచేసే ఆత్మీయులందరికి శ్రీ స్వామివారి ఆచరణ అద్భుతమైన బోధ. జిహ్వను జయిస్తే సర్వం జయించినట్లేనని శాస్త్రాలన్నీ ముక్తకంఠంగా ఘోషిస్తున్నాయి. గనుక సాధనలో మొదటిది-చివరిది కడు దుర్భేద్యమయినది జిహ్వే. దీనిని నిగ్రహించనిదే మిగిలిన సాధనలన్నీ సఫలంకావు కొంచెం రుచిగా ఉంటే మరికాస్త తినకుండా ఉండడం అందరికీ సాధ్యంకాదు. కానీ అది జిహ్వాచాపల్యమని సాధారణ సాధకు లెవ్వరూ గుర్తించరు. ఆహారం తినే విషయమై

"ఆశనం ఔషదంవత్" అన్నారు.



ఆకలి అనే వ్యాధికి ఆహారాన్ని ఔషదంవలె ఉపయోగించాలని యోగ శాస్త్రం చెబుతుంది. ఔషధాన్ని ఎక్కువ తక్కువలు లేకుండా సరైన మోతాదులో వాడినప్పుడు మాత్రమే సత్ఫలితాలనిస్తుంది. అట్లాగాక అజాగ్రత్త వలన సరైన మోతాదులో వాడకుంటే ప్రాణాన్ని రక్షించే ఔషధం ప్రాణాన్ని భక్షిస్తుంది. గనుక ఆహారం కూడా సరైన విధంగా తీసుకోకుంటే దుష్ఫలితాలనిస్తుంది. అది మన ప్రజ్ఞను హరిస్తుంది.

ఇంద్రియాణాంహి చరతాం యన్మనో నువిధీయతే

తదస్య హరతిప్రజ్ఞాం వాయర్నావ మివాంబసీ

అని భగవద్గీత చెపుతుంది. అంటే "గాలిచేత నావయొక్క వేగము హరించబడినట్లు ఇంద్రి యార్థములలో చరించు మానవునియొక్క మనస్సు స్వాధీనము తప్పివాని ప్రజ్ఞను హరించును" గనుక ఇంద్రియాలలో జిహ్వేంద్రయము ఎంత దుర్భేద్యమైనదో దాని ఎడల మనమెంత జాగరూకులమై మెలగాలో శ్రీస్వామివారు తన ఆచరణ ద్వారా అమరబోద చేసేవారు.

శ్రీ స్వామివారికి అరోరూట్ బిసికెట్స్ పొడి చక్కెర పాలలో కలిపి పొగలుపోతూ ఉండేటట్లు తాటాకు దొన్నె (రేక) లో పోస్తేత్రాగేవారు. మొదలు కొంచెం భూదేవికి. అగ్నిగుండానికి సమర్పించి త్రాగేవారు. అజావ ఎంత త్రాగాలో అనేమితం యోగనాధుడైన శ్రీ స్వామివారికే ఎరుక. ఒక్కొక్కప్పుడు రేకలోని జావంతా పూర్తిగా త్రాగేవారు. మరొకప్పుడు అడుగున మిగిలిన చిక్కని జావను కొద్దిగా వదిలేసేవారు. ఎంత బ్రతిమాలినా ఒక్క చుక్కైనా త్రాగేవారుకాదు. "అంతే, అంతే పైవాళ్ళు ఒప్పుకోరు." అంటూ రేక అడుగున మిగిలివున్న ఆకొంచెం చిక్కని జావను క్రింద పోసేసేవారు. కొద్దిగానన్నా త్రాగించాలని అనేకమార్లు సేవకులు చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైనాయి. బలవంతంగా నోటిదగ్గర పెట్టినా సరే ముట్టేవారు కాదు. కానీ మనమైతే మధుర మైన ఆ చిక్కని జావను ఒక్క బొట్టయినా వదలలేము. నిజానికి మోతాదు మించాక అది

అమృతమైన విషతుల్యమేనని తప్పక వర్జనీయమని శ్రీ స్వామివారు తన ఆచరణ ద్వారా బోధించారు. అలా వర్జించకుంటే జిహ్వేంద్రియానికి బానిసలమన్న మాటే. మన ప్రజ్ఞకూడా అంత మేరకు హరించబడుతుందని శ్రీ స్వామివారు తన ఆచరణ ద్వారా బోధించారు. దీన్ని అనుక్షణం గుర్తుంచుకొని ఆచరించి తరించడం మనవిధి.

కేవలం మనకీ విషయం బోధించేందుకే అలా చేశారు గానీ లేకుంటే యోగనాదుడైన శ్రీ స్వామివారికి ఆకాస్తజావ త్రాగినంత మాత్రాన ఎలాంటి ఇబ్బంది ఉండదు. కారణం పావులీటరు మిరప్పొడి తినిన స్వామికి, ముప్పై కిలోల బియ్యపు అన్నం ఐదు నిమిషాల్లో స్వాహాచేసిన స్వామికి, ఈ కాస్తజావ ఒక లెక్కకాదు. జిహ్వ విషయంలో మనమెంత జాగ్రత్తగా ఉండాలో మనకు బోధించేందుకే శ్రీ స్వామివారు అలా చేశారు. అదే వారి అమరబోధ.

**అనుగ్రహరూప బోధ-శరణాగతిః-**

సద్గురువును భుక్తిముక్తి ప్రధాతని గురుగీత కీర్తిస్తుంది. అట్టి కృపను అర్హులైనవారే పొందగలరు. ఆత్మలో సర్వస్యశరణాగతి చేసి నిశ్చల భక్తితో త్రిమూర్త్యాత్మకుడైన పరబ్రహ్మ స్వరూపునిగా సద్గురుని గుర్తించి, గురుసేవే జీవిత పరమావధిగా భావించి "శరీరం, ఇంద్రియం, ప్రాణం, అర్థస్వజన బాంధవాన్ ఆత్మదారాధికం సర్వం సద్గురు భ్యోన్నివేదయేత్" అన్న గురుగీతా వాక్యాన్ని హృదయ పూర్వకమైన ప్రేమతో ఆచరిస్తూ సద్గురుని సేవిస్తుంటే సద్గురువు మనకేగాక మనపై ఆధారపడినవారికి గూడా భుక్తిముక్తులు ప్రసాదిస్తారనే శాస్త్రవాక్యం స్వామి సేవకుడు రోశిరెడ్డిగారి విషయంలో" అక్షరాలా సత్యమైంది.

అనన్య శరణాగతి అంటే ఏమిటో రమణమహర్షి బోధించారు. దానిని శ్రీ స్వామివారి సేవకుడు రోశిరెడ్డి ఆచరించి చూపారు. రమణులు అంటారు. "నేను చేస్తాను, చెయ్యను ఇది నీకు సంబంధించింది కాదు, నీవు చేయవలసిందల్లా శరణాగతి. ఇది అది అని తలంచకుండా మౌనంగా ఉండటం" రోశి రెడ్డి



చెబుతారు. "అయ్యా! స్వామివారు ఒక్కమాటే చెబుతారు క్లుప్తంగా. ఆ ఒక్కమాటే చాలు, ఆమాట అర్థం కాలేదని స్వామివారిని ప్రశ్నించ మొదలుపెడితే శతకోటి సందేహాలు, అనంతకోటి అనుమానాలు చివరకు అసంతృప్తికరమైన ఆచరణ. ఈ గందరగోళమంతా లేకుండా సంపూర్ణ శరణాగతిచేసి "స్వామి నేనేమీ తెలియని మూర్ఖడను, మీరు సర్వసమర్థులు, సర్వప్రేరణాధికారులు, గనుక నా ఆత్మలో తగు విధంగా ప్రేరణపెట్టి మీకు సంతృప్తికరంగా మీ అజ్ఞను ఆచరించేటట్లు చేయండి" అని మానసికంగా ప్రార్థిస్తే తగు విధంగా మన బుద్ధిని ప్రేరేపించి మనలను నడిపిస్తారు. అలాగాక స్వశక్తిపైననూ మన బుద్ధి కుశలతపైననూ ఆధారపడి ప్రశ్నించామా గోతిలోపడ్డట్టే. ఒకరోజు స్వామివారు నెల్లూరులో ఉన్నారు "రోశిరెడ్డీ! నేరుగా దోవ పట్టుకొని పోవయ్యా!" అని అజ్ఞాపించారు. నాకు కండ్లు కనబడవు దోవపట్టుకొని ఎక్కడికిపోవాలో తెలియదు. పైన నేను వివరించిన ప్రార్థన మానసికంగా చేసుకొని ఒక్కక్షణం ఆగకుండా మారు మాట్లాడకుండా ఎలానడిచి వచ్చానో తెలియదు. గొలగమూడి చేరాను. నేను మాత్రం ఎదురు ప్రశ్నలు వేస్తూ, కుయుక్తులు పన్ని అక్కడక్కడ తిరిగి మరలా స్వామి దగ్గరకు వచ్చి ఉంటే అది పనిగా వచ్చిన మా అల్లుడు, కొడుకు నన్ను మాస్వగ్రామం తీసుకపోయి ఉండేవారే. అది తప్పించేందుకే స్వామి ఇలా చేశారు అని తరువాత తెలిసింది. లేకుంటే పంటచేను వదలి పరిగేరుకునే కర్మ పట్టివుండేది.

ఒకరోజు రోశిరెడ్డిగారిని వారి గ్రామం వెళ్ళి నిమ్మచెట్లు గుచ్చి పెట్టిరమ్మని స్వామివారు అజ్ఞాపించారు. చెట్లునాటి తన త్రోవన తాను స్వామి దగ్గరకు వెళ్ళిపోతే చెట్లకు కంచె వేయడం నీళ్ళు పోయడం కాపలా కాయడం తమ శక్తికి మించిన పని అని గనుక నిమ్మచెట్లు నాటవద్దని భార్యా,బిడ్డలు ఏకగ్రీవంగా అడ్డుచెప్పారు. సద్గురునికి సంపూర్ణ శరణాగతి చేశాక కష్టనష్టాలను లెక్కచేయకుండా వారి మాటను తూచ తప్పక పాటించడమే తన కర్తవ్యమని తలచాడు రోశిరెడ్డి. అనన్యశరణాగతి చేశాక శ్రీ స్వామివారిని ఎదురుప్రశ్నలు వేయకూడదు. సర్వప్రేరణాధికారి. సర్వసమర్థులైన శ్రీ స్వామివారే మన హృదయాన్ని తగు

విధంగా ప్రేరేపించి ఆకార్యాన్ని నెరవేర్చాలి. అంతేగాని ఎన్ని చెట్లు నాటమంటారు? ఏచేలో నాటమంటారు? మొలకలెక్కడ కొనమంటారు? ఏ రేటున, ఎవరి దగ్గర అప్పు తెమ్మంటారు వంటి చొప్పదంటు ప్రశ్నలు వేయకూడదు అంటారు రోశిరెడ్డిగారు. భార్యా బిడ్డలు మాటకాదని నేను నిమ్మచెట్లు నాటే ప్రయత్నం చేస్తే అన్నీ క్షణంలో సమకూడడమే చిత్రం. నిమ్మ మొలకలు అమ్మేలారీ కూడా సమయానికి ఊర్లోకే వచ్చింది మొలకలు నాటి స్వామి దగ్గర కొచ్చేశాను. నా భార్యాబిడ్డలను తగువిధంగా ప్రేరేపించి కంచెవేయడం, బావిత్రవ్వడం లాంటి అన్ని పనులూ స్వామివారే చేయించారు. నేడా తోటలోని ఫలితమే సంవత్సరానికి లక్షరూ॥ పైగా వస్తుంది. హృదయపూర్వకంగా శరణాగతి చేసి స్వామివారిని సేవించిన వారికి వారికృప ఎంత అపారమో, అద్భుతమో, మధురాతి మధురంగా ఉంటుందో తెలిపేదే ఈ నిమ్మతోట వృత్తాంతము.

నిమ్మతోట పెంచడం సామాన్యమైన పనిగాదు.

నిమ్మతోటకు సరిపడే నేల ఉండాలి సమయానికి డబ్బు చేతిలో ఉండాలి లేకుంటే అప్పు పుట్టాలి. మనం వెళ్ళిన సమయానికి సరైన చెట్లు దొరకాలి. అవి తెచ్చేందుకు లారీ దొరకాలి గుంటలు త్రవ్వేకూలీలు సమయానికి దొరకాలి. ఇవన్నీ చేశాక చేలో బావి త్రవ్వితే నీరు పడాలి. చెట్లు ఎదిగాక తెగుళ్ళు రాకుండా ఉండాలి. వీటన్నిటినీ శ్రీ స్వామివారే చిటికెలో ఒనగూర్చడమే చిత్రం. సమయానికి నిమ్మచెట్లు అమ్మేలారీ రెడ్డిగారి గ్రామానికే వచ్చింది. బావి త్రవ్వితే దివ్యమైన నీరు పడడం చుట్టు ప్రక్కల తోటలకంటే మిన్నగా చెట్లు పంట నివ్వడం అంతా శ్రీ స్వామివారి అనుగ్రహం గాక మరేముంది. హృదయ పూర్వకమైన సేవకు అనుగ్రహరూపంలో ఫలితమిలాగే ఉంటుంది.

ప్రతిసేవ గూడా రెండు విధములుగా చేసే అవకాశముందంటారు పెద్దలు. (1) దిల్‌కేకామ్ (2) దిమాక్ కేకామ్.

హృదయాంతరాళమునుండి పెల్లుబికే ప్రేమతో చేసేది దిల్‌కేకామ్.



మెప్పుకొరకు లెక్కకొరకు చేయబడేది దిమాక్‌కేకామ్. ఫలితాలు గూడా అలాగే ఉంటాయిగదా!

ఇదేవిధంగా రెడ్డిగారి కుమారుడు తోలుతున్న మామిడి కాయల బండి, ఎద్దులు, మనిషి 40 అ॥లోతు కొండ చరియలో పడినప్పటికి బండికిగానీ ఎద్దులకు గానీ మనిషికిగానీ ఏమాత్రం దెబ్బతగులలేదంటే అదంతా శ్రీ స్వామివారి కృపేగదా! ఈ విషయం నమ్మలేని వారికొరకే ఎంతో దూరాననున్న శ్రీ స్వామివారు బండి పడేసమయంలోనే ఎంతో తొందరచేసి రెడ్డిగారి కుమారుని పేరుతో ఒక చీటీ వ్రాయించి తన తొడ క్రింద పెట్టుకున్నారు. దీనివలన స్వామి కృపవలన మాత్రమే గండం గడిచిందని అందరికీ బోధపడింది. ఈ లీలద్వారా మానవాళికి శ్రీ స్వామి వారు ఎంతో గొప్పబోధ చేశారు. భగవద్గీతలో "అనన్యాశ్చింతయంతోమాం ఏజనా: పర్యుపాసతే" అన్నశ్లోకానికి ఈ లీల ప్రత్యక్ష నిదర్శనమన్నమాట. త్రికరణ శుద్ధిగా ఆశాపాశాలు, రాగద్వేషాలు లేకుండా సద్గురుని సేవిస్తుంటే మనం ప్రార్థించని సమయాల్లో గూడా మనలనేగాక మనవారందరినీ దైవం అన్నివేళలా కాపాడుతారనే దానికీలీల ప్రత్యక్ష సాక్ష్యమన్నమాట.

ఈలీల మరొక గొప్పసత్యాన్ని గూడా బోధిస్తుంది. బ్రహ్మ వ్రాతలేక ప్రారబ్దకర్మ అనుభవించక తప్పదనడం లోకంలో పరిపాటి,కానీ ఆ సద్గురు నాశ్రయించిన సద్భక్తుల విషయంలో పొసగదు. అవసరమైతే బ్రహ్మవ్రాతను గూడా మార్చగల్గినదే మహామహిమన్వితమైన సద్గురుని సామర్థ్యం. రోశిరెడ్డి కుమారుని ప్రారబ్ధంలో బండి గండము ద్వారా అనేక కష్టనష్టములు. శారీరక బాధలు అనుభవించవలసి యున్నప్పటికి ఆ ప్రారబ్దాన్ని మరొక జన్మకు మార్చారా లేక తన తపోశక్తిచే దహించారా లేక కొండంత బాధను గోరంతగా తగ్గించారా అన్నది ఆ సద్గురుమూర్తికే ఎరుక. ప్రారబ్దవశాత్తు జరుగవలసిన ప్రమాదం మాత్రం జరిగింది. కానీ దాని ఫలితంగా అనుభవించవలసిన బాధలు మాత్రం తప్పించారు.

ఇదేవిధంగా మరొక భక్తురాలు 8సం॥ నుండి సంతానంలేక స్వామి నర్థిస్తే "అమ్మా కులంగానీ కులం వాళ్ళు వస్తుంటే ఆపుచేశాను. గూడూరు కరణం కొడుకును వదులుతున్నాను" అని సెలవచ్చారు. కులంగాని కులం వారంటే గుణహీనులు, అల్పాయుష్కులని స్వామివారి బావం. శ్రీ స్వామివారు చెప్పినట్లే ఆమెకు ఆనతి కాలంలో మగసంతానం కలిగింది. గుణహీనులు, అల్పాయుష్కులు కల్గితే ఆ ద:ఖాన్ని ఆ భక్తురాలు భరించలేదని అట్టి సంతానం కల్గకుండా చేశారు స్వామి. అంటే బ్రహ్మవ్రాతను మార్చారని అర్థంగదా.

గనుక పైలీల లన్నింటి ద్వారా శ్రీ స్వామివారు మనకొక గొప్ప సత్యాన్ని బోధిస్తున్నారు. సద్గురునికి సర్వస్వ శరణాగతి చేసి హృదయపూర్వకంగా సేవిస్తుంటే అవసరమైతే మన ప్రారబ్దాన్ని గూడా మార్చి మనకు శ్రేయస్సు చేకూర్చగలరని- మనకేగాక మనపై ఆధారపడినవారి భుక్తిముక్తులకు కూడా డోకాలేదని ఘంటాపథంగా చాటుచున్నారు.

## స్వామివారు కోరిన దక్షిణ

### మహాత్ముల చరిత్ర పారాయణ :

దైవం మానవరూపంలో అవతరించి మానవాళిని ఉద్ధరిస్తారనేది శాస్త్రవాక్యము. అట్టి అవతార మూర్తుల దివ్య లీలలను చదవడం, వినడం వలన మానవుల పాపకర్మలు నశించి మోక్షార్హులను చేస్తుందని ఋషివాక్యం. అందుకే వారం రోజులలో మరణించనున్న పరీక్షిన్మహారాజునకు మహాత్ముల చరిత్రలతో నిండియున్న భాగవతం వినిపించి తరింపజేశారు శుఖ మహర్షులవారు.

అందుకే షిర్డిసాయినాధుడు నా దివ్యలీలలు గానం చేసే వారికి వినిన వారికి వారి కర్మ నశిస్తుంది. జ్ఞానధనం లభిస్తుందని అభయమిచ్చారు. అందరు మహాత్ములూ ఈ సూత్రాన్నే నొక్కి చెప్పడం గమనార్హము. శ్రీ వెంకయ్యస్వామివారు కూడా దేవుడెలా కనబడతాడని అడిగిన భక్తునితో బ్రహ్మంగారి చరిత్ర చదవమని



సెలవిచ్చారు. అంటే మహాత్ముల చరిత్ర పారాయణ, శ్రవణంవలన మన పాపకర్మ నశించి దైవసాక్షాత్కారం లభిస్తుందని సెలవిచ్చారన్నమాట.

మహాత్ముల చరిత్ర పారాయణ, శ్రవణమననాల వలన మన పాపకర్మలు నశిస్తాయని, మన అధర్మప్రవవర్తనవలన మన పుణ్యఫలం నశిస్తుందని తెలిపేటటు వంటి ఒక చక్కని సన్నివేశం శ్రీ గురునానక్ గారి జీవిత చరిత్రలో చూడవచ్చు.

ప్రతినిత్యం శ్రీ గురునానక్‌గారి సత్‌సంగానికి వెళ్ళే భక్తునికి ఒకరోజు కాలిలో ముల్లు గుచ్చుకొని నొప్పి చేసింది. ప్రతినిత్యం వేశ్య దగ్గరకు వెళ్ళే ఇతని స్నేహితుడు ఆరోజు వేశ్య లేనందున ఆమెకొరకు తోటలో నిరీక్షిస్తున్నాడు. ఊసుబోక పుల్లతో నేలపై గెలుకుతుంటే అతనికి బొగ్గులతో నిండిన లంకెబిందె అందులో ఒకే ఒక బంగారు నాణెము దొరికాయి. భక్తునకు ముల్లు గుచ్చుకోవటమేమిటి వేశ్యా సాంగత్యం చేయువానికి బంగారు నాణెం దొరకడమేమిటని వారిద్దరూ నానక్ గానిరడిగారు. వారిలా వివరించారు. "ఈ రామదాసు గతజన్మలో దానంచేసిన ఒక బంగారు నాణెమునకు బదులుగా ఈ జన్మలో బిందెడు బంగారు నాణెములు దొరుకవలసి యున్నది. కానీ ఈ జన్మలో ధర్మం తప్పి వేశ్యతో కూడినందున ఆ నాణాలన్నీ బొగ్గులుగా మారాయి. ఈరోజు వేశ్యతో కూడలేదు గనుక ఆ ఒక్క నాణెం లభించింది. ఈతని మిత్రుడు గతజన్మలో క్రూరుడైనరాజు. ఎందరినో యుద్ధంలోను, ద్వేషంతోను చంపాడు. ఆపాప ఫలితంగా ఈ జన్మలో చిత్రహింస ఉరిశిక్ష అనుభవించవలసి యున్నది. కానీ సద్గురుని చెంత సత్‌సంగానికి హాజరవుతున్నందున పాపాలన్నీ నశించి చివరకు ఈ ముల్లు గుచ్చుకోవడం ద్వారా మిగిలిన ఆ కొద్దిపాటి పాపం కూడా క్షాళనమైంది." అని శెలవిచ్చారు.

గనుక మహాత్ముల చరిత్ర పారాయణ పాపప్రక్షాళనకు ఎంత మహిమాన్విత మైనదో అందరము గుర్తించాలి. అందునా శ్రీ స్వామివారి వంటి ఉత్తమోత్తమ సద్గురుని నిరంతరం ప్రత్యక్షంగా సేవించేవారికి గూడా భగవత్ సాక్షాత్కారానికి మహాత్ముల చరిత్ర పారాయణే సాధనగా శ్రీ వెంకయ్యస్వామివారు విధించడం

గమనించదగిన విషయం. శ్రీ స్వామివారి చరిత్ర పారాయణ కెంత గొప్పగా విలువనిచ్చేవారో మరికొన్ని ఉదాహరణలు చూస్తాము.

నేను (రచయిత) మా ఆతిథ్యము స్వీకరించి మా గృహాన్ని పావనం చేయమని ఎన్నిమార్లు అర్థించినా స్వామివారు వాయిదావేస్తూ వచ్చారు. ఒకప్పుడు శ్రీ సాయిలీలామృతం దీక్షగా పారాయణ చేస్తూ శ్రీ స్వామివారిని ఆహ్వానించగా వెంటనే అంగీకరించి మా గృహాన్ని పావనం చేశారు.

మరొకప్పుడు శ్రీ భరద్వాజ మాష్టరుగారి అత్తగారు, మరదలు, వారి స్నేహితులు అందరూ ఐదారుగురు శ్రీ స్వామివారి దర్శనార్థం కలిచేడు వచ్చారు క్రొత్తవారిని శ్రీ స్వామివారు తన పాదాలను తాకి నమస్కరించనీయరని అందరికీ తెలిసిన విషయమే. కానీ క్రొత్తగా వచ్చినవారికి శ్రీ స్వామివారిని తాకి నమస్కరించుకోవాలని చాలా ఆత్రుతగా ఉంటుంది. చాలాకాలంగా వేలిముద్రలు వేయడం మానవేసిన స్వామి ఆనాడు శ్రీ సాయి చరిత్ర నిత్యపారాయణ చేసే ఈ బక్త బృందం వచ్చేసరికి వేలిముద్రలు వేస్తున్నారు. వీళ్ళందరినీ తన చేతి క్రింద త్వరత్వరగా కాగితాలు పెట్టమని తాను వేలిమ్ముద్రలు వేయసాగారు. ఆపనిలో నిమగ్నమైన స్వామి ఈ ఆడవాళ్ళ చేతులు తనకు తగులుతున్నాగానీ తన్మయంగా వేలిముద్రలు వేస్తున్నారేగానీ వారిని దూరంగా పొమ్మనలేదు. ఆవిధంగా వారికి శ్రీ స్వామివారి దివ్యస్పర్శన భాగ్యం కల్గించింది వారు చేసిన సాయిచరిత్ర శ్రీ గురు చరిత్రల పారాయణ ఫలితమేనని భక్తులు గుర్తింతురుగాక !

నిరంతరం చరిత్ర పారాయణ, సత్సంగం చేస్తూ అనేక వేలమందిని బక్తి మార్గములో నడుపుతున్న ఆచార్య భరద్వాజ మాష్టగుగారు శ్రీ స్వామివారి దర్శనార్థం గొలగమూడి వచ్చారు. పదిరోజులు నెల్లూరులో ఉండాలనుకున్న స్వామివారు ఆ కార్యక్రమం మానుకొని గొలగమూడికి వచ్చి మాష్టరుగారికి దర్శన మిచ్చారు. అంతటి ప్రత్యేక అనుగ్రహానికి కారణం వారు పరిశోధించే సాయిచరిత్రేకారణము.



విద్యానగర్‌లో శ్రీ షిరిడిసాయి మందిరం నిర్మించారు. కుంభాభిషేకమునకు సిద్ధంగా యున్నది. ఆ మందిరంలో నిత్యసత్సంగాలు జరుగుతూ అనేకమంది భక్తులు శ్రద్ధాభక్తులతో మహనీయుల చరిత్రలు పారాయణలు చేస్తున్నారు. ఒక శుభముహుర్తంలో శ్రీ వెంకయ్యస్వామివారు ఎవరి ఆహ్వానం లేకుండానే ఆ మందిరమునకు వెళ్ళి ఐదు రోజులపాటు మందిరంలోని వేదిక మీద తమ పరమ పవిత్రమైన అగ్నిహోత్రము నిర్వహించారు ఆ ప్రాంతమందలి భక్తులందరినీ అనుగ్రహించి ఆ మందిరమునకు తమ లక్షల తపోధనం జమ కట్టామని చెప్పారు. గనుక దైవకృప పొందుటకు మహాత్ములచరిత్ర పారాయణ ఎంతటి అద్వితీయ సాధనమో శ్రీ స్వామివారు బోధించారు.

భగవత్‌సాక్షాత్కారానికి శ్రీ స్వామివారు బ్రహ్మంగారిచరిత్ర చదవమనడంలో మరొక ముఖ్యకారణం గూడా ఉంది. ఈ చరిత్రలో బ్రహ్మంగారితోపాటు శిష్యుడు సిద్ధయ్యగారుకూడా అంతే ప్రాముఖ్యం వహిస్తాడు. మర్కట కిశోరన్యాయంగా సిద్ధయ్య తన గురువును సేవించారు. వీరికి గురుధ్యాస తప్ప అన్యచింతలు, లోక వ్యవహారాలు శరీరం పోషణాది ఏ ఆలోచనా లేదు. శరీర అవసరాలకంటే తన గురుసేవకే ఎక్కువ ప్రధాన్యత నిచ్చేవారు. గురువాక్య పాలనమే తన ఏకైక జీవిత లక్ష్యంగా జీవించిన ధన్యజీవి. అన్యన్య శరణాగతికి పెట్టిన పేరు సిద్ధయ్య-కృళ్ళి దుర్గంధంగా ఉన్నకుక్క కళేబరంలోని పురుగుల నీరు త్రాగమన్నపుడు గురువాజ్ఞను పరమ సంతోషంగా నెరవేర్చిన మేటి శిష్యశిఖామణి సిద్ధయ్య. వారివలె గురువును ఏక నిష్టతో సేవించడమె నిజమైన ముముక్షువుల కర్తవ్యమని స్వామి బోధించారు. సిద్ధయ్యలాగా మనం గురువును సేవిస్తే మార్జాల కిశోరన్యాయాన్ననుసరించి పిల్లి తన పిల్లను పట్టుకున్నట్లు గురువు మనలను తప్పక ఉద్ధరిస్తారని. తగు విధంగా సేవించటమే మన బాధ్యత అని శ్రీ స్వామివారు బోధించారు.

## దేవాలయాలు:

మనమీనాడు సంవత్సరమున కొకసారి శ్రీరామునకు, శ్రీ కృష్ణునకు ఎంత వైభవంగా తిరునాళ్ళ ఊరేగింపు చేస్తున్నామో, 1909 సం॥ నుండి శ్రీసాయినాధుని ప్రతిదినమూ అలాగే ఎంతో వైభవంతో పారవశ్యంతో ఊరేగించేవారు. ఆ ఉత్సవాలలో జడ్జీలు, కలెక్టర్లు, న్యాయవాదులు మొదలగు ప్రభుత్వోద్యోగులే గాక బూటీవంటి కోటీశ్వర్లు ప్రతినిత్యం వారి పాదాల చెంత అడుగులకు మడుపులెత్తుచూ వారి అజ్ఞల కొరకు పడిగాపులు కాస్తూ సేవించారు.

శ్రీ సాయినాధుడు తన భక్తుల కెన్ని రకాల అనుభవాల నిచ్చారో, ఉదా:- నీటితోదీపాలు వెలిగించడం, కుష్టువంటి భయంకర వ్యాధులు మాన్పడం, ప్రకృతిశక్తుల నాదేశించడం, ఆయా దేవతల రూపాలతో దర్శనాలివ్వడం మొ॥ లీలలన్ని అన్ని తరగతులవారికి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు కూడా అనుగ్రహించారు. అఖిలాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షుడు మొదలు హృషికేశ్ చిదానందస్వామివారి వరకు అందరూ శ్రీ స్వామివారిని దర్శించారు. కానీ దురదృష్టమేమంటే సాయినాధుని అలనాటి భక్తులు భక్త్యావేశముతో ఆరాధించినట్లు స్వామివారి భక్తులు శ్రీ స్వామివారిని ఆరాధించలేదు. కనీసం స్వామివారు విడిదిచేసే స్థలాలనైన ఆయా గ్రామస్థులు పరిశుభ్రంగా ఉంచేవారుగాదు. శ్రీ స్వామి వారు అనామకంగా ఏ చెట్టునీడనో, పాడుబడ్డ దేవాలయంలోనో కాలం గడిపేవారు. ఎంతో మహత్తరమైన దివ్యలీలలు చవిచూచిన భక్తుల హృదయాలు కూడా తగుస్థాయిలో స్పందించనందున ఎప్పుడో మరలా కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే స్వామివారిని దర్శించేవారు. తులశమ్మ వంటి చాలా కొద్దిమంది తప్ప మిగిలినవారు బయజామాయిలాగా, బూటి, మహల్సాపతిలాగ నిరంతరం సేవించలేదు. కారణం? పూర్వపుణ్యం లేకపోవడమే. దీన్నే గీతలో ఎతాంత్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణాం అన్న శ్లోకంలో వివరిస్తారు. అంటే పాపకర్మకంటే పుణ్యఫలం ఎక్కువగా ఉన్నప్పుడే భగవంతుని దృఢవ్రతులై సేవించగల్గుతారు అని అర్థం.



అలాంటి పుణ్యకర్మలలో భగవద్గీత మనకు "దేవ,ద్విజ, గురు, ప్రాజ్ఞ పూజనం" మొదట చేయదగ్గ శారీరక తపస్సుగా చెప్పియున్నది. ఇష్టదైవాన్ని, బ్రహ్మజ్ఞానముకొరకు పాటుపడు ద్విజులను, సద్గురువులను, శాస్త్రజ్ఞానముగల సత్పురుషులను నిస్వార్థంగా పూజించుట శారీరక తపస్సు. గనుకనే మన పెద్దలు మనకు తెలియకుండానే పుణ్యకర్మలు చేసే అలవాటు మనకు నేర్పించాలని దేవాలయాలు నిర్మించి-పూజలువాటిలో మహనీయులచేత సద్గోష్టులు. భజన, నామసంకీర్తన, అన్నదానం, విద్యాదానం వంటి పుణ్యకర్మలు చేసుకొనేటట్లు ప్రోత్సహించారు. పై భగవద్గీతా వాక్యాన్ని మనచేత ఆచరింపజేసేందుకు శ్రీ స్వామివారు భజన, నామసంకీర్తన తన భక్తులచేత చేయించేవారు తానాచరించి మనకు నేర్పాలనే తలంపుతో శ్రీ స్వామివారు దేవాలయాలకు వెళ్ళి తానే స్వయంగా టెంకాయ కొట్టి కర్పూరం వెలిగించేవారు. దేవాలయాలకు వెళ్ళడం వ్యర్థమని, భగవంతుడు సర్వవ్యాపిగనుక ఇంటిలోనే పూజించుకొంటే చాలని తలచే వారందరూ శ్రీ స్వామి వారికంటే గొప్ప మేధావులని తలంచవలసి యుంటుంది.

ఇంట్లో చేసే సాధనలకంటే దేవాలయంలో చేసే సాధనలు ఎక్కువగా ఫలవంతము లౌతాయని దేవాలయాలకంటే శ్రీశైలం, కాశి వంటి మహాక్షేత్రాలలో ఇంకా అధికంగాను, భగవాన్ శ్రీ వేంకయ్యస్వామివంటి సద్గురు సాన్నిధ్యంలో చేసే సాధనలు వెయ్యిరెట్లధికంగా ఫలవంతము లౌతాయని పెద్దలవాక్యం. ఆయా స్థలాలలో అంతకుముందు ఎందరో మహనీయులు చేసిన తపః ప్రభావం ఆ స్థలంలో తప్పక నిక్షిప్తమై ఉంటుందని ఎందరో మహనీయులు తమ శిష్యులకు తెలిపియున్నారు. అందుకే ఇంటికి వెళ్ళి సాధన చేసుకుంటానన్న రోశిరెడ్డితో స్వామి "పంటచేను వదిలిపెట్టి పరిగేరు కుంటావ్యా" అని మందలించారు.

పరిపూర్ణ జ్ఞానస్వరూపులైన శ్రీ స్వామివారి కంటె మానవ కర్తవ్యం గూర్చి బోధించగలవారెవరు? పరిపూర్ణ జ్ఞానస్వరూపులైన శ్రీ స్వామివారికి దేవునికి

టెంకాయ కొట్టి కర్పూరం వెలిగించవలసిన అవసరమేముంది. కానీ "యద్యదాచరిత శ్రేష్ఠ!" అన్నట్లు వారిని చూచైనా మనం నేర్చుకొని ఆచరిస్తామనే ఉద్దేశ్యముతో వారు దేవాలయాలకు వెళ్ళి టెంకాయకొట్టి కర్పూరం వెలిగించేవారు కష్టాలు తీరాలంటే కొంతమందిని ఫలానా దేవాలయంలో నిద్రచేసి టెంకాయకొట్టి కర్పూరం వెలిగించిరమ్మని ఆదేశించేవారు. కొంతమందిని అర్ధరాత్రివేళ దేవాలయానికి ప్రదక్షణలు చేయమనేవారు. ఒక భక్తురాలి మనసులో తలెత్తిన చెడుతలంపులకు ప్రాయశ్చిత్తంగా ఆమెకు తన దర్శన ఆశీస్సులు నిరాకరించినపుడు ఆభక్తురాలు "మీరేశిక్ష వేసినా అనుభవిస్తాను గానీ మీపాదాలుమాత్రం విడువలేనని విలపించినపుడు ఆమెకు ఏమిశిక్ష విధించారో తెలుసా? "నలుగురు మనుషులతో కలసి రాత్రంతా అంజనేయ స్వామి దేవాలయంలో భజన చేసుకొని తెల్లవారి తనను దర్శించమని ఆజ్ఞాపించారు. గనుక శిక్ష గూడా దేవాలయంలో భజన చేయడమే విధించారు. అంటే ఆమె మానసికంగా కచేసిన పాపానికి ఆ భజన ప్రాయశ్చిత్తమన్నమాట. అయితే ఆ భజనను శ్రమంలో చేయించకుండా మందిరంలో చేయించడమే విశేషము.

సంసార లంపటంలో నున్న మాకు అట్టి భాగ్యము కల్గదుగదా అని కొందరనవచ్చు. అందుకే శ్రీ స్వామివారు "అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో" మని లిఖితపూర్వకముగా శాసనము వ్రాసిచ్చారు. భార్యాబిడ్డలు బంధుమిత్రులు, సేవక యాచకులేగాక తన్నాశ్రయించిన పశుపక్ష్యాదులలో గూడా శ్రీ స్వామివారే పరివేష్టించియున్నారనే ఎరుకను సాధించి నడుచుకొనడమే సాధన. అదే స్వామివారు కోరిన తెగిపోని భజన. అట్టి నిరంతర ఎరుకను సాధించుటకు మహాత్ముల చరిత్ర పారాయణ సాటిలేని సాధనమని శ్రీ స్వామివారి ఆజ్ఞ.

కనుక అటు శాస్త్రవాక్యము, ఇటు బ్రహ్మజ్ఞానియైన శ్రీ స్వామివారి ఆచరణ దేవాలయ సందర్శన, నామజపము, భక్తి విశ్వాసాలతో హృదయ పూర్వకమైన పారవశ్యంతో చేసే భజనలు, పూజలు, మహాత్ముల చరిత్ర



పారాయణలు మానవ జాతిని తరింపజేసి తృప్తి, శాంతులతోగూడిన జీవితాన్నేగాక జీవిత పరమావధియైన జ్ఞాన సిద్ధికి కూడా పునాదులని తెలుపుచున్నవి.

పై పుణ్యకర్మలు ఫలప్రదం కావాలంటే ఏమి చేయాలో కూడా శ్రీ స్వామివారు శలవిచ్చారు. భాండశుద్ధిలేని పాకము, చిత్తశుద్ధిలేని పూజ వ్యర్థమని గదా వేమన వాక్యము. గనుక నేను నా చిన్ననాటి నుండి గాయత్రి పూజ, వ్రతాలు చేస్తున్నా నాకేమీ శాంతి లేదు అనేవారు. శ్రీ స్వామివారు చెప్పిన ఈ క్రింది సూక్తి, ఎంతవరకు ఆచరించి వారి చిత్తాన్ని శుద్ధి చేసుకున్నారో చూచుకోవలసి ఉంటుంది. "జోగి జంగం, మాల మాదిగవాళ్ళు నీలో చేరకుండా చూచుకో" అన్నారు. మనలోని ఈర్ష్య, ద్వేషము, అసూయ, మమకారాది దుర్గుణాలనే శ్రీ స్వామివారు మనలోని జోగి, జంగం, మాలమాదిగ వారని, వారిని పారద్రోలనిదే సాధన సాగదని అంత్యదశలో నిరంతరం అరిచేవారు.

అట్టి దుర్గుణాలలో ముఖ్యమైనది ఇతరులను విమర్శించడం. ఇది గజస్నానం వంటిదని చెప్తారు. ఏనుగు పరిశుభ్రంగా స్నానంచేసి గట్టుకొచ్చాక తన తొండముతో శరీరమంతా మట్టి చల్లుకొంటుంది. అలాగే మన పూజ, జప, ధ్యానాదుల వంటి పుణ్యకర్మలన్నింటినీ నిష్ప్రయోజనం చేస్తుందీ దుర్గుణం. ఈ దుర్గుణాన్ని శ్రీ సాయినాధుడు పందిమలభక్షణ చేయడం లాంటిదని శెలవిచ్చారు. ఈ దుర్గుణాన్నే మన నెత్తిమీద మనమే కొండను విరగదోసుకోవడం లాంటిదిగా వర్ణించారు శ్రీ స్వామివారు. వారిని చూచి ఒక రైతు "ఈయన కపిలమోకులు, ఈయన ముంత, మంటలు ఈ పిచ్చోడి కేమిపని పాటలేదు" అని అంటూ వెళ్ళిపోయాడు. స్వామి వారన్నారు "అయ్యో పొయ్యే ఆయన పోకుండా నెత్తిన మూటలు ఇరగదోసుకొని పోతున్నాడే పాపం" అన్నారు. నిష్కారణంగా మంచి చెడు తెలియక ఇతరులను నోటికొచ్చినట్లు విమర్శించడం వలన కొండంత పాపభారం నెత్తిన వేసుకోవడం తథ్యమని శ్రీ స్వామివారు బోధిస్తున్నారు.గనుక అలాంటి దుర్విమర్శలు చేయవద్దని శ్రీ స్వామివారి హెచ్చరిక. అలాంటి పనులు

చాలా స్వల్పమైన తప్పులుగా మనం భావించినా అవి మన భజన నామస్మరణ పూజలవంటి సాధనలను నిష్ప్రయోజనం చేస్తాయి. అందుకే లౌకిక వ్యవహారాలు మాట్లాడినా, ఇతరులను విమర్శించినా అట్టి సేవకుల సేవలను శ్రీ స్వామివారు నిరాకరించేవారు. గనుక స్వామి కృప నిరంతరము పొందగోరు మనము ఎంతో జాగ్రత్తగా పై పొరపాట్లు చేయకుండా జాగ్రత్త పడడమెంతో అవసరము.

శ్రీ స్వామివారి దర్శనార్థం వచ్చిన వారిలో కూడా అనేకులు అలాంటి అనుచితమైన పనులు చేస్తున్నప్పటికీ స్వామివారు వారిని గూడా అనుగ్రహిస్తున్నారు గదా అని అడుగవచ్చు. తన్నాశ్రయించిన వారెలాంటి వారయినా వారిని వట్టి చేతులతో పంపకూడదని ఆ పరమ కారుణ్యమూర్తి 100రూ॥ మేలు చేయవలసియుంటే రెండు రూపాయలకు ముట్టజెప్పి పంపుచున్నారు. గనుక రాగద్వేషయుతమైన దుర్విమర్శలను వీడి పూజ, భజన, నామ సంకీర్తనలు చేస్తే ఆ పుణ్యఫలమే మనలను శ్రీ స్వామివారి వంటి మహనీయుల దరిచేర్చి తరింప చేస్తుంది.

పరమ కారుణ్యమూర్తియైన శ్రీ స్వామివారు వారి వారి అర్హతను బట్టి సర్వవేదాల సారాన్ని ఆచరణ యోగ్యంగా, చిన్న చిన్నపాడి పాడి మాటలలో సెలవిచ్చేవారు. అహంకారమనే అడ్డుగోడ కూలద్రోసిన వారికా బోధలు అంతులేని ఆనందాన్నిచ్చేవి.

శ్రవణానందంగా భజనచేసే బృందాన్ని చూచి, స్వామివారు "తెగిపోయే భజన ఎందుకయ్యా" అన్నారు. నిరంతరం పరమాత్మను గుర్తిస్తుండడమే అసలైన తెగిపోని భజన. అలా గుర్తించేందుకు మనకడ్డుపడేది. నామ రూపాలలో అనుక్షణం భ్రమింపజేసే జగత్తేగదా-అందుకే స్వామి "అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో" మన్నారు. అలా అందరిలో స్వామిని గుర్తిస్తుంటే రాగద్వేషాలు తొలగి నిరంతర స్మరణ అనబడు తెగిపోని బజన చేయగల్గుతాము. అలాంటి నిరంతర స్మరణచేయ ప్రయత్నించే వారు చేసే భజనకు శృతి, రాగ,



లయలున్నాలేకున్నా ఆర్తి, ప్రేమ అనే జీవనాడులుంటాయి. గనుక అది జీవనాడులు తెగనటు వంటి సజీవమైన బజన. అది స్వామి కృపనేగాక స్వామిని కూడా బంధించగల్గిన శాశ్వతమైన తెగిపోనటువంటి భక్తి బంధం. దాన్ని సాధించాలంటే స్వామివారి సూక్తులు నిరంతరం మననం చేసి మన హృదయాలలో ఆ సూక్తుల ఆచరణ అనే విత్తనాలు నాటి, వాటి పోషణ పాలన అనే నిరంతర కృషి చేసినప్పుడు స్వామివారి కృపవలన మన హృదయం తగుస్థాయిలో స్పందించి స్వామివారు కోరిన తెగిపోనటువంటి భజన చేయగల్గుతాము స్వామి సూక్తుల ఆచరణ అనేకృషి ప్రారంభించకుంటే మనకు స్వామికి మధ్య తెగిపోయే భజనే మిగులుతుంది. అంతవరకు శ్రీ స్వామివారెన్ని ఆపదలు తీర్చినా, ఎన్ని సంపదలిచ్చినా తృప్తి శాంతిలేక స్వామివారి దగ్గర జోలె పట్టవలసిందే. తెగిపోని భజనచేయ ప్రయత్నించిననాడు మనం స్వామివారి హృదయ మందిరములో ప్రవేశిస్తాము అప్పుడిక జోలెతో పనేలేదు. మన యోగక్షేమాలను గురించి మనకంటే స్వామివారే ఎక్కువ తపన పడుతారు. శ్రద్ధ వహిస్తారు. అట్టి తెగిపోని నిరంతర భజనచేసే సామర్థ్యం కొరకు మహాత్ముల చరిత్రను దీక్షా పూర్వకంగా శ్రద్ధతో నిత్యం పారాయణ చేయడమొక్కటే మార్గమని నైమిశారణ్యాలలో మహామునులందరూ మహాభాగవతాన్ని శ్రవణం చేయడం ద్వారా తెలుస్తుంది. భాగవతమంటే మహాభక్తులు, మహాజ్ఞానుల చరిత్రేగదా!

మనలోని దుర్గుణాలను గుర్తించి వాటిని పారద్రోలే మానసిక పశ్చాత్తాపము, ప్రాయశ్చిత్తమనే కృషి చేయకుండా తమలో తాము కలహించుకొనే తన సేవకులను శ్రీ స్వామివారు "ముండలురండలైయున్నారు. ఒక్క పైసా సంపాదిస్తున్నారా. అంతా అప్పు. బాకీ చేస్తున్నారని" మందలింపుగా తన వేదన వెళ్ళగక్కారు. స్వామి సన్నిధిలో ఉంటే అంతా వారే చూచుకుంటారనేది సోమరిపోతుల భ్రమ మాత్రమే. అనేకమంది సేవకులు గత ముప్పైనలభై జన్మల నుండి శ్రీ స్వామివారితో కలిసే వస్తున్నారని శ్రీ స్వామివారు చెప్పియున్న సంగతి పాఠకులకు తెలిసిందే. గమనించవలసిందేమంటే శక్తినంతా వినియోగించి కృషి చేసిన శ్రీ స్వామివారు

మాత్రం సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులైనారు. అలా మానసికంగా కృషి చేయనిదే ఎన్నిజన్మలు శ్రీ స్వామివారి సహచర్యంలో, సేవలో ఉన్నా వారి స్థితి ఏమాత్రమూ మారదు సరికదా కత్తులు కటార్లతో శ్రీ స్వామివారి పరమ పవిత్రమైన సన్నిధిలోనే పోట్లాడుకునే స్థితిలోనే ఉండిపోతారు. గనుక మైసూరు మహారాజా కనపడినా ఏంలాభం-మనం చేసుకున్నదేగదయ్యా మనకు" అన్న శ్రీ స్వామివారి వాక్యం బాగా మననంచేసి నిరంతరం మానసికంగా కృషిసల్పనిదే శ్రీ స్వామివారేమీ చేయరని తెలుస్తుంది. కాకుంటే ఆ పరమకారుణ్యమూర్తిని సేవించినందులకు అనంతంగా పుణ్యం ప్రసాదిస్తారు. ఆపుణ్య ఫలాన్ని సాధనకు ఉపయోగించే బదులు ఇంద్రియ సుఖాలు నెరవేర్చుకొంటే పుణ్యఫలం క్షీణించగనే మొదటి కొస్తాము. గనుక "ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిష:" యోగి ప్రయత్నముతో తనలోని దోషాలను నిర్మూలించుకోవాలని, శ్రద్ధవాన్ లభతే జ్ఞానం అనిచెప్పిన గీతా వాక్యాలను గుర్తుంచుకొని మానసిక సాధన మొదలు పెట్టనిదే అంతా స్వామి చూచుకుంటారంటే వేసినచోటే గొంగళి ఉంటుందని గుర్తింతుముగాక! అలాంటి మానసిక కృషిసల్పే శ్రద్ధాభక్తులు ప్రసాదించమని సర్వప్రేరణాధికుడయిన శ్రీ స్వామి వారిని ఆర్తితో ప్రార్థిద్ధాం!

ఓం సర్వ సమర్థాయనమ:

శ్రీ స్వామివారికి పెట్టుకున్న మ్రొక్కుబడి తీర్చేందుకుగాను స్వామి వారికి మిద్దె ఇల్లు కట్టిస్తానంటే అట్లావద్దని ఆ డబ్బుతో గొలగమూడి ఆంజనేయస్వామి దేవాలయానికి ప్రహరీగోడ కట్టించారు స్వామి. శ్రీ స్వామివారు ఏగ్రామం వెళ్లినా తప్పని సరిగా ఒకటి రెండు రాత్రులు ఆ గ్రామంలోని దేవాలయాలలో తమ అగ్నిహోత్రం కొనసాగించేవారు. క్రమం తప్పకుండా దేవాలయాలు సందర్శించినంత నియమంగా ఇతర ప్రదేశాలు సందర్శించే వారుకాదు.

దీన్నిబట్టి దేవాలయాలంటే శ్రీ స్వామివారికెంత పూజ్యభావముందో తెలుస్తుంది. గనుక దేవాలయాలపట్ల మన భావాలను గూడ సంస్కరించుకోవలసి యుంటుంది.



ఇరవై సంవత్సరాల వయసులో శ్రీ స్వామివారు మనకర్థంగాని మాటలు అరుస్తూ ఏకాంత ప్రదేశాలలో తిరుగుచుండడం వలన అజ్ఞానులైన పామరజనం వీరికి పిచ్చి పట్టిందనుకొన్నారు. కానీ అది దివ్యమైన అవధూత యొక్క బాలోన్మత్త పిశాచ దశలలో ఉన్మాద దశ అని తెలుసుకోలేకపోయారు. పుట్టుకతోనే జ్ఞాన సంపన్నులైన స్వామివారు తానుచేసే ప్రతిచిన్నపనిద్వారా కూడా మానవాళికి వెలలేని ధర్మాన్ని బోధించేవారు. సాయంకాలం వరకూ ఏకాంత స్థలాలలో కాలం గడిపి ప్రొద్దుకూకి తన చెల్లెలు మంగమ్మ గారింటికి వచ్చేవారు. వచ్చేటప్పుడు చేలల్లో పరిగ ఏరి రెండుశేర్ల వేరుశెనక్కాయలు మూటగట్టుకొచ్చి మంగమ్మగారికిచ్చి భోంచేసి వెళ్ళేవారు. సాదన పేరుతో సన్యసించి సంఘానికి చీడపురుగులవలె తయారై అధ్యాత్మిక రంగానికే కళంకం తెచ్చే పొట్టకూటి సాధువులందరికీ శ్రమజేసి అన్నం సంపాదించుకోవాలని శ్రీస్వామివారు ఈ చర్య ద్వారా బోధిస్తున్నారు. ఎలాంటి శ్రమ చేయకుండానే గృహస్తుల అన్నం తింటుంటే పరిగ్రహరూపంలో ఆ గృహస్తుల కర్మదోషాలన్నీ నెత్తికెక్కి భగవత్సాక్షాత్కారానికి తగువైన స్థాయిలో కృషిచేయాలనే బుద్ధికుశలత నశించి పతితులౌతారని స్వామివారి ఆచరణ బోధిస్తుంది.

మనదేశంలో ఎందరో సన్యాసులున్నారు. ఎన్నో పాడుబడి నిత్య నైవేద్యానికి నోచుకోని దేవాలయాలున్నాయి. ఒక్కొక్క సన్యాసి ఒక్కొక్క దేవాలయంలో నిత్యం నామజపము-భజన-మహనీయుల చరిత్ర పఠనము అనే కొద్దిపాటి కార్యక్రమాలు చేసినా వారు తినే బిక్షకు న్యాయంచేకూర్చిన వారవుతారు. తద్వారా సంఘానికి ఎంతో సేవచేసిన వారవుతారు. అందుకే స్వామివారు ఏగ్రామంలో విడిదిచేసినా తప్పనిసరిగా రాత్రి కొంతసేపు బజన చేయించేవారు. తాను రాత్రింబవళ్ళు "ఓం నారాయణ ఆదినారాయణ" అనే మహామంత్రం చేస్తూ అందరినీ చేయమని ప్రబోధించారు. గృహస్తుల భిక్షపై ఆధారపడి జీవించే సన్యాసులందరికీ ఇది చక్కని బోధ. మానవుల పాపఫలంకంటే పుణ్యఫలం ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే ధర్మాన్ని ఆచరించడం ద్వారా దైవాన్ని త్రికరణ

శుద్ధిగా ఆరాధించగలరు. అలాంటి బలమైన పుణ్యఫలం లేకుండా ఎన్నిమార్లు గీతాపారాయణ చేయించినా అందులో చెప్పబడ్డ ధర్మాన్ని ఆచరించలేకున్నారు. గనుక ముందు పుణ్యఫలాన్ని భక్తులకు ప్రసాదించాలంటే చేవయలసిన, చేయించవలసిన కార్యక్రమం ఏమిటి? సర్వపాపాలనుండి మనలను విముక్తిచేసే ఏకైక సాధనం నామజపం, పూజ. భగవద్గీతలో దీన్ని దేప, ద్విజ, గురు, ప్రాజ్ఞ పూజనం అని చెప్పారు. పూజ అనేది శారీరక, వాచక, మానసిక పరిధులలో చేయబడుతుంది. శారీరక, వాచక పరిధులలో చేసిన పుణ్యకార్యాల ప్రభావమే చక్కని మానసిక పరిణామం తెచ్చి మానసిక పూజ చేయిస్తుంది. గనుకనే శ్రీ స్వామివారు దేవాలయాలు సందర్శించి నామజపం చేయించి టెంకాయకొట్టి కర్పూరం వెలిగించేవారు.

గనుక సాధువులందరూ శ్రీ స్వామివారు వేరుశెనగకాయలు ఏరి వారి చెల్లెలు గారికిచ్చి అన్నం తిన్న విషయాన్ని ఆదర్శప్రాయంగా తీసుకొని పాడుబడ్డ దేవాలయాలు పునరుద్ధరించి నిత్యం సత్‌సంగాలు జరిగేటట్టు చూస్తేవారి శ్రమకు వెయ్యిరెట్లధికంగా స్వామివారు అనుగ్రహిస్తారు. గృహస్తులు కూడా గ్రుడ్డిగా పాదనమస్కారాలు చేయకుండా ఆసాధువుచేసే కృషి, సంఘ సేవలను గుర్తించి సత్కరిస్తే దొంగలను పోషించకుండా ఉన్నవాళ్ళమవుతాము.

**సాధనః**

వేదాంతసారాన్ని ప్రాంతీయ భాషా పదజాలంతో పాడిమాటలలో అందించడంలో వేదమూర్తియైన శ్రీస్వామివారికి స్వామివారే సాటి. వారు పలికే ప్రతిపదము ఎంతో గంభీరమైన లోతులతో కూడిన అర్థాన్ని బోధిస్తుంది. ఒక్కొక్కపదం లోతుగా తరచి వివేచిస్తే శ్రీ స్వామివారు పిచ్చెంకయ్య కాదని, సంసార చక్రమనే అంతులేని పిచ్చితో అలమటిస్తున్న మానవాళి యొక్క పిచ్చి కుదిర్చేందుకు భువిపై అవతరించిన పిచ్చి వ్యాదుల స్పెషలిష్టని మనకు అర్థమౌతుంది.



వేలూరు లక్షమనాయుడు స్వామివారిని సేవిస్తూ నాలుగుసంవత్సరాలపాటు స్వామి సన్నిధిలో ఉండేవాడు. శ్రీవారికేదైన పనుంటేచేసి తక్కిన సమయంలో చక్కగా బోంచేసి హాయిగా నిద్రపోయేవాడు. ఒకరోజు "స్వామీ నేను మీతోకూడా ఉన్నాను కదా, మరి నాకేదైనా చెప్పకపోతిరే! ఎట్టా" అని అన్నాడు. అంటే ఏదైన ఆధ్యాత్మిక బోధ చేయలేదని వారి భావం. స్వామివారు "అయ్యా పందికొక్క సజ్జకంకుల మండెకు బొక్కేసుకొని లోపలకు పోయినట్ట నడిదాలకూర్చొని బాగా తిని బలిసి కావలికాని దగ్గరకొచ్చి నా సంగతేం చెపుతావని అడిగిందట వాడు కర్రతో ఒక్క వేటు వేసి కూరవండుకొని తిన్నాడట" అని చెప్పి ముగించారు. అందరూ పడిపడి నవ్వుకున్నారు. ఆ సేవకుని జీవితాన్ని పందికొక్కు జీవితంతో పోల్చారు స్వామి.

(1) మానవుడై జన్మించాక విచక్షణా జ్ఞానం ఉపయోగించి ప్రతివిషయం లోను శ్రీ స్వామివారిని ఆదర్శంగా తీసుకొని సాధన చేయవలసింది పోయి, విచక్షణా జ్ఞానంలేని జంతు జీవితానికి అలవాటుపడి చక్కగా తిని నిద్రపోతుంటే కాలం వ్యర్థ చేసినందుకు యముడు నిన్ను శిక్షిస్తాడని, ఎప్పుడు కబళిస్తాడో తెలియదని, నిద్ర, ఆహారాన్ని నియమించుకోమని అలా చేయకుంటే పందికొక్కుగతి తధ్యమని బోధించారు. (2) ఆహార విషయంలో పందికొక్కుకు మితంలేదు. అంతేగాక విచక్షణ కూడా లేదు. ఎంతటి విలువైన వస్తువులనైనా కేవలం పండ్లజిల కొరకు కొరికేసి మనకు మితిలేని నష్టం కలిగిస్తుంది. మనం గూడా రుచికొరకు నోటిజిల కొరకు అలా విచక్షణ లేకుండా అడ్డమైన తిండి ఎప్పుడంటే అప్పుడు ఎంతంటే అంత; ఎవరి దగ్గర కపడితే వారి దగ్గర తినడం సాధువులకు మరణ తుల్యమని శాస్త్రాలు చెప్పినదాన్నే స్వామి ఇలా అన్నారు. శరీరం నిలిచేందుకు ఆహారంగాని తినడమే జీవిత పరమావధిగా జీవించడం జంతు జీవితమని అలాంటి వాడు తినే ఆహారం దొంగసొత్తుతో సమానమని జ్ఞానేశ్వర్లు, గాంధీమహాత్ముడు చెపుతారు. గనుక అలా తినేవాడు దొంగే అవుతాడు. పందికొక్కు కూడా మన దృష్టిలో దొంగేకదా! ఎంతో మెలుకువగా అందర్నీ నిద్రపోనిచ్చి

అర్థరాత్రివేళ సంచరించి ఆహారాన్ని వెతుకుతుంది గదా, ఆహారనిద్రామైథునాలే దాని జీవిత పరమావధులు-ఎన్నో కోట్ల జన్మల పుణ్యఫలంతో తెచ్చుకున్న ఈ మానవ శరీరాన్ని భగవత్సాక్షాత్కారాన్ని పొందే కృషి చేసేందుకు ఉపయోగించకుండా ఆహారం, నిద్రా, మైథునాలకు మాత్రమే ఉపయోగిస్తే అది జంతు జీవనం-పందికొక్కు జీవితాని కేమాత్రము తీసిపోదు. అందునా సాక్షాత్తు పరంబ్రహ్మ సన్నిధిలో వారిని చూచైనా నేర్చుకొని ఆచరించాలనే జ్ఞానం లేకుండా నిద్రలో కాలం వ్యర్థంచేస్తే యముడు క్షమిస్తాడా? అలా జీవించే మూర్ఖులకు స్వామి కూడా ఏమీ చేయజాలరని-మైసూరు మహారాజు కనిపించినా ఎవరెవరు చేసుకున్నది వారికేనని, కృషి చేస్తుంటే తప్పొప్పులు సవరించి ప్రేమతో వేయిరెట్లు సహకారాన్నందించి తరింపజేయగలనేగానీ వివేకం, విచక్షణం లేకుండా జంతు జీవితంలోనే ఉంటానంటే చివరకలాంటి ఫలితమే పొందుతారు జాగ్రత్త అని హెచ్చరించారు. అలాంటి హెచ్చరిక చేసి ఆత్మబోధచేసి జంతుప్రాయమైన జీవితం నుండి నిద్రమేల్కొల్పడమే సద్గురుని కృప. అలాంటి హెచ్చరికలు ఒకటి రెండు చేసినాగానీ సద్గురుని మాట చెవిని బెట్టనివారిని "పొయ్యేవాళ్ళను పోనిచ్చేదేగదయ్యా" అంటారు. ఏ మహనీయుడైనా అంతే. గనుక మానవులందరికీ అందునా సాధకులకు ఆహారం, నిద్ర విషయాలలో జాగ్రత్త వహించడమేగాక వివేకంగల్గి జీవితపరమార్థం కొంతైన సాధించి జీవితం సార్థకం చేసుకోమని పందికొక్కులాగ అందరికీ బాధ కల్గించే జీవితానికి స్వస్తి చెప్పమని స్వామివారు మానవాళిని హెచ్చరిస్తున్నారు.

పెన్న బద్వేలు దగ్గర స్వామివారికి వాడుకగా క్షౌరంచేసే మంగలి "స్వామీ నాకు దేవుడు కనబడేటట్లు దయచూడండి" అని అర్థించాడు. అప్పుడు స్వామివారు "అయ్యా!నీయాల్నే వస్తే నీమేమి కనుక్కుంటావు" అని సెలవిచ్చారు.

అంటే దేవుడంటే ఏమిటి-ఏ రూపంలో ఉంటాడు ఎలా మాట్లాడుతాడు ఏమి చేస్తాడు మొదలైన విషయాలన్నీ ముందు తెలుసుకొని-ముందు దైవాన్ని, దైవత్వాన్ని గుర్తించే అర్హత లేనప్పుడు దైవం ప్రత్యక్షమైనా "నీవు పగటి వేషగాడివి



గదా-పొమ్మంటామే" గానీ-నిజమేదో, నకిలీ ఏదో గుర్తుపట్టలేక అవకాశం పోగొట్టుకొంటున్నాము. ఇప్పుడు నీ ఎదుట నేను ప్రత్యక్షంగా పరబ్రహ్మస్వరూపినై మహావిష్ణువుకంటె గొప్ప స్థితి మహిమ శక్తిసామర్థ్యములు గల్గి ఉంటే కూడా నన్ను నీమేమి గుర్తుపట్టగలిగావు అని కూడా చమత్కరిస్తున్నారు. గనుక దైవం కొరకు నోటి మాటలతో దేవురించడం గాకుండా గట్టి సాధనచేసి-సద్గురుని గుర్తించే వివేకం సంపాదించుకోండని మానవాళిని తన ముసి ముసి బోసినవ్వులతో స్వామి వారు హెచ్చరిస్తున్నారు. వారు తన జీవితచరిత్ర ద్వారా మనకందించిన అమూల్యమైన సాధనా మార్గాల నాచరించి అర్హత పొందమని-ఆ ప్రయత్నంలో పట్టువీడని విక్రమార్కునివలె విజృంభించి దశేంద్రియాలు బిగిస్తారో లేక వాటికి బానిసలౌతారో చూసుకోండని సాధకులకొక సవాల్ విసురుతున్నారు.

నూతేటి శ్రీరాములునాయుడు తన స్నేహితుడు కలసి ఎద్దులు కొనాలని బయలుదేరారు. తోపుగుంటలో స్వామివారుంటే దర్శించాలని వెళ్ళారు. వీళ్ళేమీ చెప్పుకోకముందే స్వామివారు "కలువాయిలో కొంటే ఆసుపత్రి ఖర్చులు కట్టియ్యాల తోపుగుంటలో కొంటే సూటికి ఇరవై రూపాయలు పిరం అని అన్నారు. ఆమాటలు వీరికి సరిగా అర్థంకాక భోజన వేళైందని దగ్గర్నే ఉన్న కలువాయి వెళ్ళి హోటలులో మాంసాహార భోజనం చేసి అదే కలువాయిలో వారి బేరానికి తగిన ఎద్దునుకొని తోలుక పోయారు. ఎనిమిదవ నాటికి ఎద్దుచనిపోయింది. ఆసుపత్రి ఖర్చులంటే ఏమిటో అప్పుడు అర్థమైంది.

అలక్ష్య వైఖరి ఎంత ప్రమాదమో చూడండి. అసలు స్వామి కృపాకరుడే అయినా విశ్వాసం లేనివారు మామిడి పూతవలె రాలిపోవడమంటే ఇదేగదా! వారు చెప్పిన మాటలు అర్థం కాకుంటే తర్కించి పలుమార్లు అడుగవచ్చు అర్థం వివరంగా తెలియజేసిందాకా కదలమని మొండికేయవచ్చు. కానీ నిర్లక్ష్యవైఖరి చాలా నష్టదాయకమైంది. అదే విశ్వాసం ఉండే కారి రామస్వామిగారు బండి కొనాలంటే బండి ఇరుసులో కోడిపుంజులు పోట్లాడుతున్నాయి అని మాత్రమే చెప్పకుండా ఆ బండి కొనవద్దని కూడా స్పష్టంగా చెప్పారు. మరి బండి ఎక్కడ

కొనమంటారని అడిగితే తగిన బండి దొరికే ఊరిపేరు దానిని కొనవలసిన ధర ఆ బండి ఏచెట్టు క్రింద ఉండేది-రామస్వామి వెళ్ళేసమయానికి ఆ బడి మీద ఎందరు మనుషులు కూర్చొని ఉండేది చెప్పారు వ్యక్తుల పేర్లు కూడా అడిగిఉంటే చెప్పి ఉండేవారే. ఉదాః- పై శ్రీ రాములునాయుడుగారి ఇల్లు ఇన్ని సంవత్సరముల తర్వాత పలానా అనంతప్ప కొంటాడని ఆ కొనే వ్యక్తి పేరుకూడా చెప్పారు గదా స్వామి-వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది అని అన్నారు స్వామి. ఆ సర్వజ్ఞమూర్తికి సృష్టిలోని భూత భవిష్యత్ వర్తమానాలకు సంబంధించిన ప్రతి చిన్నవిషయం ఎరుకే. ఉదాః- ఈ శ్రీరామయ్యే మరొకరోజు స్వామివారిని దర్శించిన వెంటనే ఈయన ఏమీ అడుగుకుండానే స్వామి "అయ్యా రామన్న పల్లెలో నీకు పనికొచ్చే ఎద్దును ఆరువందల ఇరవై రూపాయల కిస్తారు పట్టకొచ్చుకోపొండి" అన్నారు. స్వామి మాట గట్టి ఎంతో చూడాలని ఎంతసేపు పోరాడి బేరమాడినా ఒక్కరూపాయి ఖరీదు కూడా తగ్గించలేదు. ఆరు వందల ఇరవై రూపాయలిచ్చి తోలు కొచ్చాడు. ఒక్కరూపాయ ఎక్కువ ఇచ్చిఎద్దును కొన్నా శ్రీ స్వామివారి మాట వ్యర్ధమయ్యేదేకదా! ఈ విషయమే నాకు ఆగ్రామం దాటివచ్చేటంత వరకు స్ఫురించలేదంటాడు శ్రీ రామయ్య

నూతేటి శ్రీరామయ్య తన ఆయిల్ ఇంజనును సజ్జచేలో నీరు తోడాక అక్కడనుండి తెచ్చి నిమ్మతోటలోని బావికి బిగించి నిమ్మచెట్లకు నీరుకొట్టుకొనేవాడు. ఈ రెండు బావులకు ఆ ఇంజన్‌ను తిప్పుతుండేవాడు. నిమ్మతోట బావి లోతెక్కువ గనుక బావి అంచున అరడుగుల గుంట త్రవ్వి అందులోకి ఇంజన్ దింపి బిగించేవారు. ఒక పర్యాయం మోకుల సహాయంతో ఇంజన్ దింపేటప్పుడు చేయి జారినందున ఇంజన్ బావిలోని నీటిలో పడిపోయిందనుకున్నారు. కానీ దైవికంగా అలా జరుగలేదు. పడేవుంటే ఒక ఇంజను ఒక పట్టాన సరిగా పనిచేయదట. అది అలా పడకుండా ప్రమాదం తప్పడం శ్రీ స్వామివారి కృపేనని అనుకోగలిగే వారెంతమంది! నాలుగు రోజుల తర్వాత శ్రీరామయ్య స్వామి వారిని దర్శించిన వెంటనే స్వామివారు చాలా



తీవ్రమైన చూపుతో కోపంగా "ఆ ఇంజనును అక్కడ కిక్కడకు తిప్పొద్దు" అని తీవ్రంగా మందలించారు. ఆనాడు ఇంజను బావిలో పడిపోవలసిన ప్రమాదం కేవలం శ్రీ స్వామివారే నివారించారని శ్రీరామయ్యగారికి అప్పుడర్థమైంది. కానీ తనమహిమను, దివ్యత్వాన్ని ఎవ్వరికీ అంతుపట్టకుండా గోప్యంగా ఉంచే స్వామి ఈ మందలింపు ద్వారా తన మహిమను వెల్లడి చేసుకొనేందుకు గల బలవత్తరమైన కారణమేమిటనే ప్రశ్న మాయా బద్ధులమైన మనందరికీ ఒక పట్టాన తోచదు.

మన పాపఫలం కంటే తగినంత మోతాదులో పుణ్యఫలం ఎక్కువగా లేక పోవడమే మాయ మనలను కబళించేందుకు కారణం. మాయాబద్ధులమైనందుననే సద్గురుని ప్రేమ, సామర్ధ్యాలను వారు వాచా ఎరుకపరుస్తున్నప్పటికీ మనం గుర్తించి తరింపు మార్గంలో నడువలేకున్నాము. పై లీల ద్వారా శ్రీస్వామివారు "నాయనా నీవు నన్ను మరచినా నేను నిన్ను అనుక్షణమూ కంటికి రెప్పవలె సర్వకాల సర్వావస్థలయందు కనిపెట్టి కాపాడు చున్నాను, నీవు ప్రార్థించని సమయాలలో కూడా నీ సర్వ విషయాలు నేను జాగరూకుడనై చూస్తున్నాను." అని పై మందలింపులో తెలుపుతున్నారు. పరమకారుణ్యమూర్తియైన స్వామి సర్వత్రా సర్వదా మన లోపల బయటా అంతటా నిండియుండి మనలను గమనిస్తున్నాడనే ఎరుక మనకు అనుక్షణం కలిగితే అదే అనన్య చింతన-అదే ధ్యానం-అప్పుడు వాదాలకు, రహస్యంగా మాట్లాడేందుకు-స్వామి పటాలుండేచోట వారి సన్నిధి గనుక పరదూషణ చేయకూడదు (అంటే పటాలు లేనిచోట వారులేరని) అనే మన మాయాజనిత నడవడికి అస్కారంలేదు. అలాంటి మాయ నుండి జాగరూకతతో మేల్కోమని గురు తత్వంఎలా ఉంటుందో యోచించుకొని వారు మనలను ప్రేమించినంతగా మనం వారిని ప్రేమించేటట్లు చేయాలనే సద్గురుని తపనే అలాంటి హెచ్చరికలు మందలింపుల ద్వారా తన మహిమను వెల్లడి చేసుకొనుచున్నారు. తల్లికి తగిన బిడ్డలు కమ్మని మొత్తుకొనుచున్నారు. తగిన బిడ్డలుగా రూపొందేందుకు వారి దివ్యబోధలు ఆచరించు శక్తినిమ్మని ఆర్తితో ప్రార్థిద్దాం.

శ్రీస్వామివారు ప్రశ్నలు చెప్పడం-చెప్పించుకొనడం బాగా నిరసించారు.

మరి స్వామివారు ప్రశ్నలు చెప్పేవారు గదా? అంటారు. వారు చెప్పిన పద్ధతికి ఇతరులు చెప్పే పద్ధతికి ఏనుగునకు ఎర్రచీమకు గల పోలిక వంటిది. శ్రీ రాములునాయుడు, గోవిందయ్య వెళ్ళి నమస్కరించి నోరు విప్పకముందే స్వామి వారు "మీకిద్దరికి మొగపిల్లకాయలే పోండి" అని బాగా చీదరించుకొని కసిరికొట్టారు. పైభక్తులు స్వామివారిని ముఖ్యంగా ఆవిషయమే అడగాలని వచ్చారు ఎంతో ప్రేమ ఆప్యాయతతో అయ్యా అని పలకరించే స్వామి ఆనాడు ఆ విధంగా చీదరించుకొని కసిరికొట్టిన కారణమేమిటి. ఆమాటే సౌమ్యంగా ప్రేమగా చెప్పవచ్చు గదా?

వారిద్దరికి ఇంతకుముందు అనేక అనుభవముల ద్వారా తన సర్వసమర్ధత్వము, సర్వజ్ఞత్వము బ్రహ్మవ్రాతను గూడ మార్చగలనని, సృష్టి తనకంటే అన్యంగా లేదని అనేక అనుభవాల ద్వారా తెలిపియున్నారు. కానీ వారు స్వామివారి మహా అద్భుతమైన దివ్యస్థితి యొక్క గొప్పతనం మరచి తనను కేవలం పొట్టకూటికి ప్రశ్నలు చెప్పుకునే అల్పుని క్రింద జమకట్టి అలా అడిగారు. చక్రవర్తిని ఎంగిలి బీడి ముక్కయాచించినట్లుంది వీరి ప్రవర్తన. అందుకే వారి అల్పబుద్ధిని ఈసడించుకున్నారు. పై అనుభవంలో మరొక రహస్యం గూడ ఇమిడి ఉంది. బజారులో ప్రవ్నలు చెప్పి పొట్టబోసుకునే వారికి స్వామివారికి గల ముఖ్యమైన భేదాలివి.

1. స్పష్టత : కారి రామస్వామి బండి కొనాలని అడిగితే బండి కొనబోవు తారీఖు ఆబండి ఏగ్రామంలో ఏ చెట్టుక్రింద ఉంది. రామస్వామి వెళ్ళేసరికి ఆ బండిమీద ఎవరెవరు కూర్చొనుంటారు-ఎంతకు కొంటారు. అనే విషయాలన్నీ స్పష్టంగా చెప్పారు. మరొకప్పుడు శ్రీరామయ్య ఇంటిని అనంతప్పకొంటారని పదిహేను సం॥లకు ముందే చెప్పారు. ఈవిధంగా మనుషుల పేర్లు సమయముతో గూడా చెప్పగల వారెందరున్నారు. మనకు వెంకయ్యస్వామి పూనాడని ప్రవ్నలు



చెప్పేవారంతా పైవిధంగా స్వామి చెప్పినట్లు స్పష్టంగా చెప్పేందుకు బదులు అస్పష్టంగా అనేక విధాలుగా అర్థాలు చెప్పుకునే పదజాలంతో చెపుతారు. లక్ష్మీ విషయమై వచ్చావు అంటాడు. చదువు, డబ్బు, వ్యాపారం, ఆరోగ్యం అన్నీ ఆపదంలోనే సూచిస్తాడు. కుటుంబ విషయమై వచ్చావు అంటాడు. ఏదయిన కుటుంబవిషయమేగదా- భుక్తివిషయమై వచ్చావు అని ఇలాంటి పదాలు తప్ప పైవిధంగా స్వామి చెప్పినట్లు ఎవ్వరూ స్పష్టంగా చెప్పరు.

మన సమస్యను గురించి మనం స్వామికి చెప్పకుండానే వారికై వారే చెప్పిలిఖిత పూర్వకంగా తన సలహాను ఆశీస్సులను ప్రసాదించేవారు. మామూలు పొట్ట కూటి ప్రవ్నలు చెప్పే వాళ్లు మన సమస్యను గూర్చి వారికి చెప్పనిదే వారు చెప్పలేరు. ఎవరైనా చెప్పినా చెప్పవచ్చు కానీ రాబోవు ఆపదలను నివారించే శక్తిమాత్రం వారికి నూటికి నూరుపాళ్ళు లేదు. యంత్రం వేస్తారు మంత్రం తంత్రం వేస్తారు. అన్నీ డబ్బుపోకడే-ప్రయోజనం శూన్యం.

నివారణః

స్వామివారు అనేక మందికి రాబోవు ఆపదలను గూర్చి చెప్పడమే గాక వాటిని నివారించుటకు సూత్రాలు చెప్పి ఒక్కొక్కప్పుడు తన తపోశక్తితో ఆకష్టాలు నివారించేవారు కూడాను.

ప్రశ్నలడగడం శుద్ధ తెలివి తక్కువతనం :- స్వామివారు తప్ప మిగిలిన జ్యోతిష/్కలు, ఉపాసకులు, చిలక ప్రశ్నవాళ్లు, లకోటా ప్రశ్నవాళ్లు వీళ్ళెవ్వరూ మన లలాట లిఖితరేఖను మార్చలేరు. అలాంటప్పుడు ప్రశ్నలడిగి రాబోవు ఆపదలను గూర్చి తెలుసుకొని ముందునుంచే దు:ఖించడం తప్ప వేరే ప్రయోజనం లేదు.

స్వామివారు ప్రశ్నలు చెప్పడంలో అంతరార్థంః- ముందుగా రాబోవు కష్టనష్టాలను గూర్చి భక్తులకు ఎరుకపరచి తగురీతిగా రక్షించి-తద్వారా భక్తులకు స్వామిపై ప్రేమ, భక్తి, విశాసము వృద్ధి చెందేటట్లు చేసి వారిని ధర్మపథంలో నడిచేటట్లు చేయడమే వారు భవిష్యత్తు చెప్పడంలోని ఉద్దేశ్యము.

స్వామివారు నివారింపజాలని చెడుకర్మ ఫలితాలయిన ఆపదల, అకాల మరణాలు, నష్టాలను గూర్చి ముందుగా చెప్పేవారు కాదు. మాటరాలేదని కాని ఎవ్వరికీ అర్థంగాని పరిభాషలో గానీ చెప్పేవారు. ముందు చెపితే అనవసరంగా ముందు నుండే ద:ఖపడుతూ ఉంటారని అలా చెప్పేవారు కాదు.

స్వామి వంటి మీదకు రావడం:- అది కల్ల. అనేక మందికి స్వప్నాల ద్వారాను, ప్రక్కవారి వాక్కుద్వారాను, పుస్తకాల ద్వారా, ఆత్మప్రేరణ ద్వారా స్పష్టంగా నేటికీ చెప్పేస్వామి ఎవరో శరీరాన్ని ఆసరాగా తీసుకొని మాట్లాడవలసిన ఖర్మ ఆయనకు పట్టలేదు. నిజంగా స్వామే వంటి మీద ఆవేశించి ఉంటే స్వామివారు చెప్పినంత స్పష్టంగా డీటెయిల్డ్‌గా మనుషుల పేర్లు, తారీఖులతో సహా మనం అడగకనే చెప్పగలగాలి- అంతేగాని మనం అడిగితేను మన సమస్య చెపితేను కాదు. మన సమస్య వ్రాసి జేబులో పెట్టుకుంటే ఆస్వామి పూనిన వారు ఆ సమస్య అక్షరం పొల్లుపోకుండా స్పష్టంగా చెప్పమనండి, అప్పుడు స్వామి పూనాడంటే నమ్మవచ్చు. అలా చెప్పినా ఆపదను నివారించమనండి చూస్తాము. అంతా అమాయకులను భ్రమపుచ్చి దోపిడి చేయడమే. స్వామివారు రెవ్వరి వంటి మీదకు రారు. రారు.

## లీలా ప్రబోధం

శ్రీ స్వామివారు తాము సర్వవ్యాపకులమని, సర్వజ్ఞులమని, సర్వసాక్షులమని, సర్వసమర్థులమని, స్మృతిమాత్ర ప్రసన్నులమని జీవితాంతము తమ దివ్యలీలల ద్వారా ఎరుకపరుస్తూనే వచ్చారు. కాని పరిపాకంలేని మనం వారి దివ్య స్థితిని గుర్తించలేదు. ఆపద గడచిందని సంతోషించడమే తప్ప- ఆవిధంగా మనల నాదుకోవాలంటే వారెట్టి మహోన్నతమైన దివ్య స్థితిలో ఉండాలో ఊహించి గుర్తుంచి తగు విధంగా ఆ మహనీయుని సేవించి తరించలేకపోయాము ఎందుచేత? కేవలం పూర్వపుణ్యం తగినంతగా లేకపోవడమే కారణం. సత్‌సంగము, మహాత్ముల చరిత్ర నిత్యపారాయణ లేనిదే, ఎన్ని దివ్యానుభవాలను పొందినప్పటికీ ఆ లీలల నుండి సరయిన బోధన గ్రహించి



ఆచరించే సామర్థ్యం మనకుండదు. గనుక ఆ దివ్యావతార మూర్తిని తగు విధంగా సేవించి తరించలేము.

పరమ నాస్తికుడైన పోలు పెదమస్తానయ్య (పెనపర్తి గ్రామం) గారి బర్రెకు జబ్బుచేసి చనిపోబోతుంది. ఆయన అన్నకుమారుడు 8సం॥ కుర్రవాడు శ్రీ స్వామివారి విభూతి ఆ బర్రెకు పూసి శ్రీ స్వామిని ప్రార్థించాడు, నిమిషాల మీద బర్రెకు స్వస్థత చేకూరింది. మస్తానయ్య వెంటనే కృతజ్ఞతా భావంతో శ్రీ స్వామిని దర్శించాడు. మస్తానయ్య ఏమీ చెప్పకముందే స్వామి "అయ్యా రాత్రి నీ గొడ్డుకు బాగుందిగదా" అని హెచ్చరించారు. ఆ హెచ్చరికతో వారి సర్వ వ్యాపకత్వం, సర్వజ్ఞత్వం, సర్వసాక్షిత్వం, స్మృతిమాత్ర ప్రసన్నత్వం అన్నీ ఒకేలీలలో ప్రకటమయ్యాయి. అంతటితో మస్తానయ్య ఆస్తికుడుగా మారాడు.

ఇదే విధంగా మాకాణి వెంకట్రావుగారు మద్రాసు పోతుంటే "తిరవళ్ళూరు వీరరాఘవస్వామి రక్షిస్తారు. పోయిరావయ్యా" అని స్వామివారు ఆశీర్వదించారు. బస్సు ప్రమాదం నుండి బ్రతికి బయటపడ్డప్పుడు స్వామి వారెందుకలా ఆశీర్వదించారో వారికి తెలిసింది.

కలిచేడు నరసారెడ్డిని, కారి రామస్వామిని త్రాచుపాముల బారినుండి రక్షించారుస్వామి. రోశిరెడ్డి కుమారుని బండి గండం నుండి రక్షించారు. కానీ వీరందరిలోను జన్మ సంస్కారంగల ఒక్క రోశిరెడ్డిగారు మాత్రమే శ్రీ స్వామివారిని తగువిధంగా సేవించి తరించారు. మిగిలినవారందరి జీవితాలలోను ఎలాంటి మార్పులేదు.

ఇలాంటి లీలలు అనుభవించినప్పుడు మన పుణ్యఫలాన్ని బట్టి సాధనలో మన స్థితిని బట్టి మన హృదయం పరవశించే స్థాయి ఉంటుంది. మన హృదయం పరవశించిన మేరకే శ్రీ స్వామిని సేవించడం జరుగుతుంది. అంతవరకు మనం సాధించిన అర్హతే భవిష్యత్తులో మన సాధనను నిర్ణయిస్తుంది. గనుక అర్హత సాధించడమే ధ్యేయం. లెక్క లేనన్ని సాదనా మార్గాలలో ఏ సాధన ఆచరించాలనేది

గొప్ప చర్చ. మనకు ఏ సాధన మీద ప్రీతిగా ఉంటుందో, ఏ సాధనలో ఆనందం, మనశ్శాంతి, కల్గి ఆ సాధనే ఇంకా ఎక్కువగా చేయాలనే కోరిక కల్గుతుందో అదే మనకు సరైన సాధనా మార్గంగా గుర్తించి కేవల శ్రద్ధతో సాధన చేస్తుంటే సద్గురుడే తనదరి జేర్చుకోగలరు. ఏసాధన చేస్తే మంచిదన్న భక్తునితో స్వామి "అడ్డుకట్టలెయ్యకుండా ఎట్లా పాయ్యేనీళ్ళనట్లా పోనిస్తే అన్నీ అక్కడకే వస్తుళ్ళాయ్యా" అని సెలవిచ్చారు. అడ్డుకట్టలెయ్యకుండా ఉండడమంటే సాధనా మార్గాలు అనుక్షణం మార్చకుండా ఉండడమని భావము.

అజ్ఞానాంధకారంలో అలమటిస్తూ ఇంద్రియలోలురమైన మనకు సద్గురుని కృపగానీ సామర్థ్యంగానీ అనుక్షణం గుర్తుండే అవకాశమేలేదు. మనం వారి సర్వవ్యాపకమైన ఉనికిని గుర్తించకున్నా వారు మాత్రం తన భక్తులను అపారమైన ప్రేమతో కంటికి రెప్పలా అనుక్షణమూ కాపాడుతూనే ఉంటారు. కష్టాలలో మన ప్రార్థనలతో నిమిత్తం లేకుండానే మనల నాదుకోవడం వారి దివ్యప్రేమకు నిదర్శనం మాత్రమేగాక-వారి సర్వవ్యాపకత్వానికి, సర్వసాక్షిత్వానికి, సర్వసమర్థత్వానికి నిరూపణ. తద్వారా మన సాధన పటిష్టం చేసుకోమని హెచ్చరిస్తున్నారన్నమాట.

మా ఆళ్ళగడ్డ మిత్రునికి స్వప్న దర్శనమిచ్చి "నీ కారులో నా ఫోటో పెట్టుకోమని చెప్పారు స్వామి. రెండు రోజుల తర్వాత తన శత్రువుల బాంబుల దాడి నుండి బ్రతికి బయటపడ్డప్పుడు స్వామివారు ఫోటో పెట్టమన్న కారణం వారికి అర్థమైంది. గనుక మనం ప్రార్థించనవసరం లేకుండానే స్వామి మనలను రక్షిస్తారన్నమాట. స్వామివారు అనుక్షణం మనలను కనిపెట్టే ఉంటారు. మనసు స్థిరపడే వరకూ మనం మరలా మరలా తప్పులు చేస్తూనే ఉంటాము. దీనినే సద్గురుని దృష్టి నుండి దాచలేము గనుక, మన స్వార్థంవలన సాటిజీవులకు ఇబ్బంది, కష్టం కలుగకుండా ఉండేటట్లు జీవితయాత్ర సాగించమని స్వామివారిట్టి లీలల ద్వారా హెచ్చరిస్తున్నారు. అలాంటి సద్బుద్ధి, జాగరూకత, మనందరికీ ప్రసాదించమని శ్రీ స్వామివారిని ప్రార్థిద్దాం!



**కలిచేడు ఈశ్వరమ్మ ఇండ్లలో చేరడం :-**

విశ్వాసమంటే ఎలా ఉండాలో అట్టి విశ్వాసాన్ని శ్రీ స్వామివారెంత అద్భుతంగా అనుగ్రహిస్తారో ఈలీల బోధిస్తుంది. విశ్వాసమనే పదానికి కొలబద్దేలేదు. ఈ మహాతల్లి శ్రీ స్వామివారిని పరిపూర్ణంగా విశ్వసించి వారి దివ్యపాద స్పర్శచే తన నూతన గృహం పునీతమైతేనే అందులో చేరాలని నిశ్చయించుకున్నది. శ్రీ స్వామివారామె విశ్వాసాన్ని పరీక్షింపనెంచి ఆరు మాసాలా ప్రాంతాలకే మెదలలేదు. కానీ ఈమె తన బంకు క్రింద కాపురం పెట్టి వర్షం, గాలి, దొంగలబాధ, పశువులబాధ అన్ని విధాలైన కష్టనష్టాలు సంతోషంగా సహించింది. తేళ్ళు, పాముల బాధలు అనుభవిస్తున్నాసరే శ్రీ స్వామివారిపై విశ్వాసం ఏమాత్రం సడలలేదు. కాబట్టే గృహప్రవేశానికి స్వామివారు విచ్చేశారు. సర్వప్రేరణాధికుడు, సర్వసమర్థులైన స్వామివారి ప్రేరణతో మొండి బాకీలు కూడా అనాడే అడుగకుండానే వసూలవడమే చిత్రం. 10 శేర్ల బియ్యం వండి 200 మందికి అన్న సంతర్పణ చేయడం ఆకుంఠిత విశ్వాసానికి అపారమైన అనుగ్రహ లీలను ప్రసాదించారు.

చివరి క్షణంవరకు సంతోషంతో కూడిన ఓర్పు వహించి గురుకృప కొరకు వేచియుండడం ఎంతో పుణ్యము. సాధన, గురుకృప గలవారికే సాధ్యముగాని మిగిలిన వారికి వీలుకాదు. మిగిలిన వారంతా మధ్యలో రాలిపోయే మామిడి పిందెలవంటి వారే. శ్రీ స్వామివారిని నమ్ముకున్నంత మాత్రాన అన్నీ చక్కగా, సుఖంగా జరగాలని తలచడము, అలా జరుగనప్పుడు శ్రీ స్వామివారిపై అలగడము అవివేకము. రోగికి ఎప్పుడు ఆహారం ఇవ్వాలో వైద్యునకు తెలుస్తుంది. వైద్యుని నమ్మినంత మాత్రాన మనకు రుచిగల ఆహారం పెట్టించలేదని అలగడం సబబేనా? మన పూర్వకర్మల దృష్ట్యా మనకెప్పుడేమి చేయాలో మనకంటే చక్కగా మన సద్గురుమూర్తికే తెలుస్తుంది. ఈ సత్యం గుర్తించి ఓర్పుతో ఉంటే ఎన్నికోట్ల రూపాయలు ఖర్చుచేసినా రుచి చూడలేని అనుగ్రహలీలను శ్రీ మతి ఈశ్వరమ్మలాగ మనం కూడా రుచిచూడగలము. అలాంటి దివ్యలీలను రుచి చూచాక మన చైతన్యం జాగృతమై సాధనలో మరొకమెట్టు పైకెక్కుతాము. అలాంటి అభివృద్ధి

మనలో కల్గించాలనే తపనతోనే సద్గురువు మనకట్టి దివ్యలీలలు అనుగ్రహిస్తారు. ఈ సత్యం గుర్తించి నడుచుకొంటే దివ్యలీలా రూపంలో వర్షించిన గురుకృప సద్వినియోగ మవుతుంది. లేకుంటే అడవిగాచిన వెన్నెలవలె నిరుపయోగమౌతుంది. మనం మాత్రం మైసూరు మహారాజా దర్శనం పొందికూడా మేలు పొందలేని దౌర్భాగ్యులంగా మిగిలిపోతాము.

## దేవునికి చేసే ఉపచారాలు-సేవలు:-

వీటిని గూర్చి శ్రీ స్వామివారు ఎంతో చక్కని బోధచేశారు. మన శరీరానికి మనమెటువంటి ఉపచారాలు చేసుకుంటామో స్వామివారి సమాధికిగాని, పటానికిగాని అలాంటి ఉపచారాలే చేయాలి. సమాధి ఒక ఇటుకల కట్టడమని చిత్రపటమొకగ్లాసు. కాగితం-చెక్కముక్కేయనే భావన చాలా తప్పు.

ఒకరోజు శ్రీరామయ్య తన గుడిశలో ఆవుపంచితం చల్లేటప్పుడు అదికొంచం శ్రీ స్వామివారి పటంపైన పడింది. పంచితం పడితే మంచిదేలే అని తుడవకుండా వదిలేశాడు. కూర్చోని ధ్యానం చేస్తుంటే తనపైన ఏదో ద్రవం పడింది. బల్లేమైనా పోసిందేమోనని పైన చూస్తే బల్లేలేదు. ఏమిట్రా అని వేలితోతాకి వాసన చూస్తే. అది ఆవు పంచితము. వెంటనే అసహ్యంతో తుడిచేసుకున్నాడు. ఆక్షణంలో శ్రీ స్వామివారు చిత్రంగా ఆత్మలో పలికారు చూడండి. "ఏమయ్యా! నీ పైన పడితే అసహ్యంతో తుడుచుకున్నావే, నాపైన పడితే అట్లాగాదా? నీ ఎదుట పటం రూపంలో నేను లేనా ఏమి?" అన్నారు. బుద్ధితో చెంపలేసుకున్నాడు శ్రీ రామయ్య. ఇదేవిధంగా మనం అతివేడి, అతిచల్లని నీళ్ళతో అభిషేకాలు చేయడం అతిగా అలంకరణ, అతి వస్త్రధారణ, అతిగా లేపనాలు అలదడం అపచారమని మనం గుర్తించాలనే శ్రీ స్వామివారు ఇలా బోధించారు.

## నివేదనలు :-

ఈ శ్రీరామయ్యే ఒకరోజు నైవేద్యానికేమిలేక పుల్లనిమ్మకాయ కోసి పెట్టాడు. హారతయి పోయాక రోజులాగ ప్రసాదం తీసుకోగలడా? పుల్ల నిమ్మదబ్బలు గనుక



తాకనైనా తాకలేదు. మధ్యాహ్నం అన్నంతోటి పేలపిండి తెచ్చారు. ఒక పేలపిండి ముద్ద రాత్రికి నైవేద్యం పెట్టి ఒకటి రేపటికని ఉంచుకున్నాడు. హారతయ్యాక ప్రసాదంగా పేలపిండి కండ్లకద్దుకొని నోట్లో వేసుకొన్న వెంటనే తుపుక్కున ఊసెయ్యాల్సొచ్చింది. కారణం ఆ పేలపిండి పుల్ల నిమ్మరసం లాగా పులపురొద్దుగా ఉంది. ఏమిటబ్బా పేలపిండి ఇట్లాచేశారని రేపటికని దాచిన పేలపిండి తినిచూస్తే అది తియ్యగానే ఉంది. ఏమిటా ఈ చిత్రమని యోచిస్తే స్వామి చెపుతారు. పుల్లగా ఉంటే నీవు తినలేక ఊసేశావే నేనట్లాగాదా? మరి నాకు మధ్యాహ్నం పుల్ల నిమ్మకాయకోసి ఎట్లా పెట్టావు" అని హృదయంలో బల్లగుద్ది చెప్పారట.

గనుక మనం ఎలాంటి పదార్థం తింటామో అలాంటి పదార్థమే నివేదించాలి.

శగలు పొగలు పొయ్యే పదార్థాలు, మనం తినలేము గనుక అలాంటివి నివేదించడం మానాలి. అట్లాగే టెంకాయ కొట్టి నేలమీద పెట్టడం పండ్లు వగైరా నేలమీదనే పెట్టి నివేదించడం తగదు. ఏ ఆహారమైనా మనం ఆకుగానీ, ప్లేటుగానీ లేకుండా నేలమీద వేసుకొని తింటామా? ఇలాంటి సేవలన్నీ ఈవిధంగా చేయరాధని శ్రీ స్వామివారు మనందరికీ బోధిస్తున్నారు. శ్రద్ధ ఏమాత్రం తగ్గరాదు గదా!

సద్గురువునకు సర్వప్రేరణాధికుడని, విశ్వప్రేరణాధికుడని, సర్వభూత హృదయాంతర్వర్తియని పేర్లుగలవు. సద్గురుకృపకు పాత్రులైనవారు తమ ఇష్టా ఇష్టాలతో పనిలేకుండా సద్గురుని ఇష్టానుసారం నడుచుకొని తీరవలసిందే ఆ మహనీయుని సత్ సంకల్పమునకు తలవంచడం తప్ప మరొక మార్గమే కనిపించదు. పూర్ణహృదయంతో సంతోషంగా అలా దాసోహం చేయడంలోనే మన శ్రేయస్సు ఇమిడి ఉంటుందని గుర్తించి నడుచుకోవాలి. ఒక్కొక్కప్పుడు ఆ మార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలు గూడా సద్గురుని అనుగ్రహానికి చిహ్నాలని గుర్తించుకోవాలి.

చెరుకూరు క్రిష్ణయ్యకు గుండెలో మూడు వాల్వులు చెడిపోయి మంచంలో ఉన్నాడు. రాత్రి 8గం.వేళ గొలగమూడికి నడిచివచ్చి శ్రీ స్వామివారి సమాధి

దర్శించాలని తీవ్రంగా అనిపించింది. చెబితే ఇంట్లో వాళ్ళు నడిచిపోనివ్వరని, ఎవ్వరికీ చెప్పకుండా రాత్రి 9గం.లకు నడచిపోతున్నాడు. ఎనిమిది కిలోమీటర్లు, రాత్రివేళ ఒంటరిగా, గుండెయొక్క మూడు వాల్యులు చెడిపోయిన వ్యక్తి నడచి వచ్చేశాడు. శ్రీ స్వామివారి సమాధి దర్శనంతో గండెజబ్బు శాశ్వతంగా నివారణై పోయింది. ఈ సన్నివేశాన్ని నడపించిన దివ్యశక్తి కేవలం శ్రీ స్వామివారి సంకల్పశక్తేనని చెప్పనవసరంలేదు అట్టి కృప మనమూ పొందాలంటే శ్రీ స్వామివారితో ఏదో ఒకవిధంగా అనుబంధ మేర్పరచుకోవడమే మార్గం. అలాంటి అనుబంధం ఏర్పరచుకొనుటకు మార్గాలేమిటో శ్రీ స్వామివారి జీవిత చరిత్ర "అవధూతలీల" లో చూడవచ్చు.

1. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నారనే ఎరుక అనుక్షణం కలిగియుండి నడుచుకోవడం.
2. నిత్యం సాధ్యమైనంత సేపు నామజపం చేయడం.
3. బూతబలికి అన్నం సమృద్ధిగా సమర్పించడం.
4. ప్రతినిత్యం భావయుక్తంగా స్వామివారి పటాన్ని పూజించడం.
5. సత్యం, ధర్మం తప్పకుండా సేంపన్నత్వం, సాధారణత్వం సద్గురుసేవ సాధించడం ఇదే వారి దివ్య మార్గము.

శ్రీ స్వామివారు తన భక్తులను ఎన్నోవిధాల రక్షించినపుడు ఆ విషయాన్ని చాలా గోప్యంగా ఉంచేవారు. అనుభవం పొందినవారికి కూడా శ్రీ స్వామివారే రక్షించినట్లు తెలియకుండా ఉండేలాగున మెలిగేవారు. కానీ కొందరి విషయంలో అలాగాకుండా తానే వారిని రక్షించినట్లు తగు నిదర్శనం ద్వారా ఎరుకపరచేవారు. అలా ఎరుక పరచేందుకొక కారణముంది. సద్గురునకు మనయందుగల ప్రేమ మనకర్థమై మన భక్తిశ్రద్ధలు అభివృద్ధిచెంది వారిని త్రిమూర్త్యాత్మకుడుగా గుర్తించి తగువిధంగా సేవించి వారి బోధల నాశ్రయించి తరిస్తామని స్వామివారు అలా చేసేవారు. అట్టి మార్పు మనలో రానప్పుడు వారి దివ్యలీలా రూపంలో వర్షించిన కృపంతా అడవిగాచిన వెన్నెలవలె వ్యర్థమౌతుంది. గనుక నేటికి గూడా శ్రీ స్వామివారు వేయికళ్ళతో ఎదురు చూస్తుంటారు.



శ్రీ స్వామివారికి తంబుర ఫోటో తీయించిన రమణయ్య ఒకరోజునది దాటుతున్నాడు. నదీ ప్రవాహం సెకండ్లమీద పెరిగిపోయి నీరు ముక్కుల వరకు వచ్చేశాయి. నెత్తిన బరువుంది. గనుక ఈదుటకు వీలులేదు. ప్రాణాపాయ స్థితిలో స్వామిని స్మరించాడు. ఇంతలో తనపైగుడ్డ నీళ్ళలో పడితే ఎలాగో దాన్నికూడా పట్టుకొని చాలా కష్టంమీద గట్టుచేరాడు. పైపంచ పిండి ఆరేస్తుంటే ఆ పంచెమీద చెక్కు చెదరని స్వామివారు సిరాతో వేసిన అరచేతి ముద్ర ఉంది. ఆ గుడ్డపైన ఆ ముద్ర పడేందుకు వీలులేదు. ఒక వేళ ఉన్నా అది నీళ్లలో తడిసి పిండినపుడు చెల్లాచెదురైపోవాలి. అలా జరుగలేదంటే అర్థమేమిటి. నదిగండం గడిచింది నీ కండబలం వలన కాదు నా కృపవల్లనేనని శ్రీ స్వామివారు ఎరుక పరచేందుకే అలాంటి లీల చూపారని రమణయ్య వెంటనే గుర్తించాడు. దాంతో ఆయన భక్తి శ్రద్ధలెంతగా పెంపొందాయో చెప్పలేము.

## ఆహార పదార్థాలను అక్షయం చేయడం:-

బద్రాచలంలో వెంకమ్మగారికి, కలిచేడులో ఈశ్వరమ్మగారికి, సంగంలో పల్లంరెడ్డి కృష్ణారెడ్డి గారికే గాక అవసరమైనప్పుడల్లా ఆశ్రమంలో జరిగే ఈలీలను గుప్తంగా ఉంచుకున్న స్త్రీలకు గూడా ఈ దివ్యలీలను అనుగ్రహించియున్నారు. ఈ దివ్యలీలల వివరం మనం అవధూత లీలలో చూడగలం. చేతిలో తగినంత డబ్బు లేకుండా పనిలోకి దిగి ఆరు నెలల లోపల ఆరులక్షల వ్యయంతో ఆశ్రమంలో కమ్యూనిటీ హాల్ నిర్మించడమొక అద్భుతలీల. పైలీల అంతరార్థమేమిటని లోతుగా ఆలోచిస్తే-మన అహంకారాలను సమూలంగా దహించేందుకేనని శ్రీ స్వామివారు మౌనబోధ చేస్తున్నారు. నూతేటి శ్రీరామయ్య బావిలోని వజ్రసమానమైన కఠిన శిలను మట్టిగా మార్చారు స్వామి. చనిపోయిన వారిని బ్రతికించగల స్వామి చేయ జాలని దంటూ ఏముంది. కావాలంటే మట్టిని బంగారు చేయలేరా! అంతటి మహనీయ మూర్తికి మన ధనాన్ని వారికి ధర్మం చేశామనుకోవడం అపచారం. ఈ సృష్టంతా వారిసొత్తేగదా? వారు దయతో మనకను గ్రహించినదాన్ని కృతజ్ఞతతో వారికి సమర్పిస్తున్నామన్న భావనుండాలిగాని-

మన డబ్బువారికి ధర్మమం చేసేటంతటి ఘనులమా మనం? వారికి లేకుంటే మనం ఇవ్వగల సమర్థులమా. ఈలాంటి అహం కారయుత ఆలోచనలు తలెత్తిన కాశీరాం షింపీ ఏమైనాడో అతని అహం కారాన్ని సాయినాథుడెలా సరిదిద్దాడో సాయినాథుని చరిత్రలో చూడగలము. గనుక నాజబ్బు నయంచేస్తే కోరినంత డబ్బిస్తానన్న అహంకారితో "ఏందయ్యా ఆయన చెప్పేది-అందరికీ మనమిస్తుంటే అయనేందంట మనకిచ్చేది" అని స్వామివారన్న మాటలు గుర్తుంచుకొని ఎవరు ఏమి సమర్పించినా మనకు సిరిసంపదలిచ్చినందుకు దైవంపట్ల కృతజ్ఞతాభావంతో సమర్పించాలే తప్ప అన్య భావాలను మనసులో రానివ్వొద్దని స్వామి మనకీలీలల ద్వారా బోధిస్తున్నారు.

## ఆణిముత్యాలు

"బ్రేవ్‌మన్ త్రేపే వారికి కాదయ్యా, ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా" అని సెలవిచ్చారు. ఆమాటలను ఆచరణ ద్వారా బోధించారు. వర్షాలులేక పశువులకు నీళ్ళు మేత లేక ఎండుటాకులు, చింపిరి కాగితాలు మేసే పశువులను చూచి వర్షం కురిసేంతవరకు అన్నపానీయాలు మాని నాలుగైదు రోజులు దీక్షచేసి వర్షం కురిపించాకనే గంజి త్రాగిన కరుణామయుడు శ్రీ స్వామి. సర్వజీవులను తన ఆత్మగానే ప్రేమించే మహనీయమూర్తి స్వామి. ఇతర జీవుల ఆకలి తీర్చేందుకు అవసరమైతే తానే అన్న పానీయాలు మానుకోకున్నా పరవాలేదు. ఆశ, పిసినిగొట్టుతనం మాని మనకున్నంతలో ధారాశంగా ఆకలై కొంగుబట్టే అభాగ్యుల కివ్వగల్గితే చాలు. అందుకే చివటంఅమ్మ "ప్రొద్దుకూకుతుంది చేయిచాపండ్రా" అని సెలవిచ్చారు. శ్రీ స్వామివారిలాగా మనం తినగల్గినంత అన్నం భూతబలికి ప్రతినిత్యం సమర్పించేందుకు మన మనసొప్పుకోదు. పోనీ సాటి జీవుల సమిష్టి కృషి ఫలితంగానే మనకీ ఆహారం పండి వచ్చిందనే కృతజ్ఞతాబావంతో వీలైనంత వరకు దండిగా భూతబలి సమర్పించాకనే ఆహారం స్వీకరించే అలవాటైనా నేర్చుకోమని శ్రీ స్వామివారి ఆచరణ మనలను హెచ్చరిస్తుంది.



## వాక్‌నియమము

మాకేమైనా బోధించండి స్వామీ అంటే చూచి నేర్చుకోమన్నారు. శ్రీ స్వామివారి జీవిత విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే కొన్ని అద్భుత విషయాలు బయటపడతాయి. స్వామివారితో సన్నిహిత సంబంధంగల అనేకమందిని నేను విచారించిన మీదట నిగ్గుతేలిన విషయం-వారు ఏనాడు కూడా ఎవ్వరినేగాని పొగడిగాని విమర్శించిగాని ఎరుగరు, ఫలానా వ్యక్తి మంచివాడనిగాని లేక చెడ్డవాడని గాని ఒక్క సారయినా ఒక్కమాట అని ఎరుగరు.

నాభినందతి సద్వేష్టిఅన్నగీతావాక్యానికి శ్రీస్వామివారి ఆచరణే బాష్యము. ఈ ఒక్కవిషయం మన మాచరించినా శ్రీ స్వామివారి కృపకు పాత్రులమై తరించగలము. పరోక్షంగా ఇతరులను విమర్శించినపుడు మన పుణ్యం వాళ్ళకిచ్చి వాళ్ళ పాపం మనం తీసుకుంటామట. ఆ విధంగావిమర్శించడం పంది మలభక్షణ చేయడంకంటే హీనమని సాయినాథుడు సెలవిచ్చారు గనుక శ్రీ స్వామి వారిని చూచి మనమా ఒక్కవిషయం ఆచరించినా తప్పక తరించగలము. మన సాధనంతా ఈ విమర్శల వలన గజస్నానం వలె వ్యర్థమౌతుందని శాస్త్రం. గనుకనే సాధకులకు వాక్ నియమము చెప్పబడింది.

ఒకరోజు దక్షాది రమణయ్య, పోలు మస్తానయ్యను "ఓరె మస్తానా!" అని పిలచి అతని మనసు బాధపెట్టినందుకుగాను దక్షాది రమణయ్యకు మూడు వందల పాపం లెక్క వ్రాయబడినదని శ్రీ స్వామివారు సెలవిచ్చియున్నారు. గనుక వాక్కు విషయములో మనమెంత జాగ్రత్తగా నడుచుకోవాలో ఆలోచించుకోవాలి అందునా తమ జీవితాలనుసాధన కంకితం చేసిన వారింకెంత జాగ్రత్తగా ఉండాలో యోచించుకోవాలి.

మనం స్వల్పమైనవని భావించే పొరపాట్లు నిజానికి చిన్నవేకాదు. గడ్డి పోచలు ఎంత బలహీనంగా కనిపించినా అవన్నీ త్రాడుగా పేన బడినపుడు మదుపుటేనుగును గూడా బంధించగలవు. అలానే కర్మబందాన్ని కల్గిస్తుంది.

సాటివారిని నిందించడం పంది మలభక్షణ చేయడం లాంటిదని అలాంటి పని వలన షిర్డివంటి మహాపుణ్యక్షేత్ర సందర్శన ఫలితం గూడా వ్యర్థమౌతుందని శెలవిచ్చారు. "బుద్ధిలేనివాడా" అని సాటివారిని అనినాగూడా నరకానికి పోవలసి వస్తుందని క్రీస్తు కూడా చెప్పారు దీనినే వాక్కును నియమించుట లేక సరళమైన వాక్కును గల్గియుండుట అని ఋషులు అన్నారు సాయి సమకాలికుడు మహనీయుడు అయిన తాజుద్దీన్‌బాబా ఇలా అన్నారు. "కాబాను తగులబెట్టితే తగుల బెట్టేవు. ఖురాను తగులబెట్టినా పెట్టేవు. మధ్యం త్రాగితే త్రాగేవు, విగ్రహారాధన జరిగే మందిరంలో నివసించినా పరవాలేదేమోగాని మనిషి హృదయాన్ని మాత్రమెన్నడూ గాయపరచుకు. కారణం భగవంతుని నిలయమైన ఏడవ స్వర్గం మానవ హృదయంలో దాగియుంటుంది."

శ్రీ స్వామివారు చిన్న చిన్న పొడి మాటలతో ఎంతో గొప్పవిలువైన జీవితావసర సత్యాలను బోధించారు! నిత్యజీవితంలో అట్టి ఆచరణ లేకుండా మనం చేసేపూజ, జపము, ధ్యానము ఫలవంతాలుగావని భగవద్గీత చెబుతుంది. ఇలాంటి దుష్ట సంస్కార్తాల నుండి బయటపడాలంటే హృదయ పూర్వకమైన కన్నీటితో గూడిన ప్రార్థనే మార్గమని రామకృష్ణ పరమహంసగారు తెలిపారు. అట్టి ఆచరణ నిమ్మని స్వామివారిని ప్రార్థిద్దాం.

జై సద్గురురాయా!

మన కంటబడ్డ ప్రతి విషయాన్నీ మన అజ్ఞానయుతమైన అల్పబుద్ధితో విమర్శించడమెంత గొప్పదోషమో స్వామివారు పదేపదే తన సేవకులకు బోధించేవారు. అది మనందరికీ చక్కని బోధే.

ఒకరోజు శ్రీ స్వామివారు నిప్పటించిన కపిలమోకు ముక్కనొక చేత. మరొక చేతిలో ఉగ్గం పెట్టినదుత్త. పంగాలు కచ్రపట్టుకొని, కపిల మోకు ముక్కల చిన్న కట్టను శిరస్సున ధరించి పరమశివునివలె తన దోవని తాను వెళుతున్నారు. ఆ మార్గాన పోతున్న ఒక వాగుడుగాయ అన్నాడు. "ఈకపిల మోకు మంట



ముంత ఏమిటీ వేషం ఈయన? ఈ పిచ్చోడికేమి పనిలేదు, పాటలేదు" అని అంటూ వెళుతున్నాడు. స్వామి అన్నారు ప్రక్కనున్న వ్యక్తి శంకరరెడ్డితో "పొయ్యేవాడు పోకుండా మూటలు నెత్తినేసుకొని పోతున్నా డెందుకయ్యో"

అంతటి మహనీయుని దర్శన భాగ్యమే దుర్లభం. కానీ మన పాపకర్మల ఫలితమే మన కన్నులకు చీకట్లు కమ్మించి శ్రీ స్వామివారి నిజస్థితిని గుర్తించ లేకుండా చేస్తుంది. వారి స్థితిని గుర్తించి మేలుపొందకున్నా నష్టంలేదు కానీ చూచిన దాన్నంతా విమర్శించే ఒక చిన్న దుర్గుణం చూడండి ఎంత గొప్పభారాన్ని తెచ్చి పెట్టిందో. శ్రీ స్వామివారి నోటివెంట ఎన్నడూ వట్టి మాటలు రావు ఏమాట వచ్చినా అక్షరాల అది జరిగి తీరవలసిందే. మరి ఇప్పుడు ఆ విమర్శించి నతడు కొండంత పాపభారం నెత్తిన వేసుకొని పోయాడని శెలవిచ్చారు. అంటే ఎవరినైనా సరే విమర్శించడం. తక్కువజేసి మాట్లాడటం-మాత్రమేగాక ఎదుటి వారిని గురించి తక్కువ భావాలు కల్గియుండడం కూడా ఎంత బాధాకరమో శలవిచ్చారు. ఇతరుల దోషాలను ఏకరువుపెట్టేవారితో క్రీస్తు అంటారు. "ఇతరుల కంటిలో నలుసు తీసే కంటే నీకంటిలోని దూలం తీసేసుకో."

ఒకరోజొక సేవకుడు మరొకనిపై తప్పులు ఫిర్యాదు చేశాడు. అప్పుడు స్వామి "నోరు విప్పకూడదయ్యా" అని సలహా ఇచ్చారు. నోరు విప్పితే ఎంత పాపమో పై సన్నివేశంలో చూచాము. శ్రీస్వామివారి ఈ సలహాను వారి సేవకుడు కల్లూరి పోలిరెడ్డి ఎంతో చక్కగా ఆచరించి తరించారు. ఎందరెన్ని చెప్పినా "ఊ' ' కొట్టే దానికి సంబంధమే ఉండదు. ఈయన వినడంలేదని గ్రహించినప్పుడు ఆ వ్యక్తి తిన్నగా వెళ్ళి పోయేవాడు. ఆవిధంగా గురువాజ్ఞను పాటించాడు. గనుకనే శ్రీ స్వామివారు పోలిరెడ్డి భౌతికకాయాన్ని స్వహస్తాలతో సమాధి చేయడం గాక భగవన్నామ స్మరణతో పూర్తి ప్రజ్ఞతో తనువు చాలించేటట్లు చేశారు. అయితే ఈ "నోరు విప్పకూడదయ్యో" అన్నవిషయంలో తద్దినానికి తేలు కాటుకు ఒకే మంత్రమన్నట్లు వ్యవహరించడం తెలివితక్కువౌతుంది. చాడీలు చెప్పడం, ఇతరులను విమర్శించడంలో నోరు విప్పవద్దన్నారుగాని. కర్తవ్య నిర్వహణలో

దర్మాధార్మలు మాట్లాడవలసినప్పుడు కూడా నోరు విప్పకుండా కూర్చోమని అర్థం చెప్పుకోకూడదు. అందుకే ఒక దుండగుడు మితిమీరి నిందిస్తుంటే "రోశిరెడ్డీ ఏమైనా మాటుంటే మాట్లాడుకోపో" అని యుద్ధానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు స్వామి. అంతేగానీ ధర్మం నిలిపేందుకు నోరు విప్పకూడదని బాష్యం చెప్పుకోవడం అపార్థమౌతుంది.

**వడ్డీవ్యాపారము:-**

అన్యాయార్జితమైన ధనం తప్పనిసరిగా పోతుందని దానిని అనుభవించే అవకాశం భగవంతుడు మన కివ్వడని స్వామివారు మరొకసారి బోధించారు. ఒక ఇల్లాలు వడ్లు బదులిచ్చి "నాము" అనే పేరుతో అధికంగా లాభం పొందేది. ఆమె ఇల్లు అగ్ని ప్రమాదానికి గురియై చాలావడ్లు కాలిపోయాయి. ఇరుగుపొరుగు వారు కొన్ని వడ్లు మాత్రమే బయట పోయగలిగారు. స్వామివారితో ఆ ఇల్లాలు తన నష్టాన్ని గూర్చి విన్నవిస్తే "అసలు దక్కింది, వడ్డీనేగదా పోయింది." అని సెలవిచ్చారు అంటే నాము వడ్లన్నీ కాలిపోయాయి. కరుణామూర్తియైన భగవంతుడు నీ అసలు వడ్లు నీకు దక్కనిచ్చాడని బోధించారు. గనుకనే స్వామివారు "వడ్డీ విషయాలలో కూడా ధర్మముండాలయ్యో" అని సెలవిచ్చారు. అందుకే దురాశ దు:ఖమునకు మూలమన్నారు పెద్దలు. ధర్మబద్ధంగా కనీస జీవితావసరాలకు సరి పడేటట్లు సంపాదించుకోమని, దురాశతో అధిక లాభాలు సంపాదించాలని ప్రయత్నిస్తే చివరకు దు:ఖం మాత్రమే మిగులుతుందని శ్రీ స్వామివారు మరొకసారి బోధించారు.

**కర్మక్రతువులు:**

చనిపోయినవారికి కర్మక్రతువులు చేయడం వ్యర్థమని, పంచభూతాలు పంచ భూతాలలో కలసిపోయాక ఈ కర్మకాడంతా అర్థరహితమైనదని, వ్యాఖ్యానించేవారికి శ్రీ స్వామివారి ఆచరణ కనువిప్పు కల్గిస్తుంది. శ్రీ స్వామివారి మహాద్భుత లీలలు చూచాక మన మేధస్సుకు అందని రీతిలో శ్రీ స్వామివారి



సామర్థ్యం పని చేస్తుందని, ఏవిషయంలోనైనా శ్రీ స్వామివారి ఆచరణ యొక్క అర్థం మనకంతు బట్టకున్నా వారి ఆచరణే మానవాళి ఆచరించదగిన సత్యమైన శ్రేయో మార్గమని తెలుస్తుంది. మనకర్థంగానంత మాత్రాన కర్మ క్రతువులను నిష్ప్రయోజనమైనవిగా తలచడం మంచిదికాదని ఈ క్రింది సన్నివేశం నిరూపిస్తుంది.

గొలగమూడి ఆశ్రమ బావిలోని దరులన్నీ విరగబడియున్న రోజులలో స్వామివారు "ఆ బావిలో చాలా పొడుగాటాయన ఉన్నాడయ్యా, ఆయనకు లెక్క చెల్లిపోయింది." అని అనేకమార్లు చెబుతుండేవారు. ఆమాటల కర్థమెవ్వరికి తెలియదు. ఆబావిని రిపేరు చేయిస్తుంటే అందులో నాగుపాముందని పెద్ద కేకలు పెడుతూ పనివాళ్ళంతా బావిలో నుండి పైకి ఎక్కి వచ్చేశారు. ఆమార్గానపోతున్న షికారి మస్తాన్ ఆభావిలోకి దిగి తన తుపాకితో ఆ నాగుమాబును కాల్చి చంపేశాడు ఈ విషయం తొళిశమ్మ స్వామివారికి చెప్పింది. "అమ్మో ఐదావుల పాలుదెచ్చి పాముకు ఖర్మచేయండి. చీకటిపోయి వెలుతురొస్తుంది." అని అజ్ఞా పించారు. అదేవిధంగా ఐదావుల పాలు తెప్పించి ఆపామును కాల్చిన షికారి మస్తాన్‌చేత ఆ పామును తగల బెట్టిన స్థలంలో పోయించారు. ఆపాలాభిషేకంతో ఆపాము రూపంలో నున్న ప్రేతాత్మకు చీకటి అనే అజ్ఞానం పోగొట్టి వెలుతురనే జ్ఞానమార్గం ప్రసాదించారు స్వామిగనుక చనిపోయినవారికి కర్మక్రతువులు శ్రద్ధతో ఆచరించాలని ఆకర్మ కలాపం ద్వారా ఆ ప్రేతాత్మకు ఉత్తమ గతులు గల్గుతాయని మనకీ లీలద్వారా స్వామివారు బోధిస్తున్నారు.

**టెలిఫోన్:**

ఒకరోజు శ్రీ స్వామివారు కలిచేడు నుండి వేరొక గ్రామం వెళ్లబోతున్నారు. "స్వామీ మరలా మీదర్శన భాగ్యంఎప్పుడు అనుగ్రహిస్తారో గదా" అని కంటతడి పెట్టింది ఈశ్వరమ్మ అనే భక్తురాలు.

"అదేందమ్మో? టెలిఫోన్ లైను వేసినట్లుండ్లా. దారం తెగిపోకుండా చూసుకుంటే ఎప్పుడూ మీ దగ్గర్నే ఉంటుండ్లా" అని స్వామివారు ఆమెకు

అభయమిచ్చారు. ఆ అభయం మనందరికీ వర్తిస్తుంది. భక్తి విశ్వాసాలతో మానసికంగా ఆమె స్వామివారితో ఏర్పరచుకున్న బాంధవ్యమే ఆ టెలిఫోను లైను. శ్రీ స్వామివారి కృపను నిరంతరం పొందాలనే ధ్యేయంతో శ్రద్ధా భక్తులతో జీవిత సన్నివేశాలలో సత్యం ధర్మం తప్ప కుండా నడుచుకోవడమే దారం తెగిపోకుండా చూచుకోవడమంటే. సంపూర్ణ శరణా గతితో ప్రతిచిన్న విషయం కూడా శ్రీ స్వామివారిపై ఆధారపడినన్నాళ్ళూ ఆ టెలిఫోను లైను దారాలు తెగవన్నమాట. మన మావిధంగా ఉన్నప్పుడు శ్రీ స్వామివారు తప్పక మనచెంత నుండి గమ్యం చేరుస్తానని మనందరికీ వాగ్దానం చేస్తూలైను తెగకుండా చూచుకొనవలసిన బాధ్యత మనపై పెట్టారు.

ఇవే మాటలు మరొకప్పుడు-"వాళ్లుండే దాన్ని బట్టిగదయ్యా మన ముండేది' ' అనికూడా చెప్పారు. ఈ విషయానికి మహాభక్తురాలు పక్కమ్మే నిదర్శనం. ఒక రోజు చలమానాయుడు, వక్కెమ్మ ఒకరి వెనుకొకరు పెన్నానది దాటుతున్నారు. ముందుపోయే చలమానాయుడికి మాత్రం రొమ్ముల లోతు నీళ్ళు, గుడ్డలన్నీ తడిసి పోయాయి. ఆయన వెనుకన్నే వచ్చే వక్కెమ్మకు మాత్రం మోకాళ్లలోతే ఉంది. శ్రీ స్వామివారి భక్తరక్షణా దక్షతను గూర్చి వీరిద్దరి విశ్వాసాలలో గల తరతమ బేదాలే ఈ లీలలో ప్రకటమయ్యాయి.

ఒకరోజు స్వామీ తమరినెవరో ఒక మమాత్ముడు అనుగ్రమించి నాలుకపై బీజాక్షరాలు వ్రాసినందున ఇంతటి గొప్పస్థితి సిద్ధించిందని చెప్పుకొనుచున్నారు, నిజమేనా? అని అడిగిన సేవకులతో శ్రీ స్వామివారు "మైసూరు మహారాజు కనబడినంత మాత్రాన మనకేమొస్తుందయ్యా! మనం చేసుకున్నదే గదా మనకు!' ' అని శెలవిచ్చారు. మామూలు పల్లెటూరి మాటల్లో వేదసారాన్ని చెప్పటంలో శ్రీ స్వామివారికి స్వామివారే సాటి.

పురుష ప్రయత్నమంటూ ఏమీలేదు. అంతావారివారి కర్మానుసారం జరిగి తీరుతుందని చెప్పే మాట శుద్ధతప్పని, సోమరిపోతులు ఇంద్రియలోలురు తమ



బలహీనతలు కప్పిపుచుకొనేందుకు వల్లించే నిరర్థక వాక్యాలేనని శ్రీ స్వామివారు పై మాటల ద్వారా తీర్పు చెప్పారు.

ప్రాక్తనం చైహికంచేతి ద్వివిదంవిద్ధి పౌరుషం
ప్రాక్తనోద్యతనేమాసు పూరుషార్థేనజీయతే

అన్న ఉపనిషద్వాక్యాన్ని శ్రీ స్వామివారు పై మాటల్లో బోధించారు. మానవునకు జంతుకోటికిగల ముఖ్యబేదమే విచక్షణా జ్ఞానము, జ్ఞానస్ఫురణ. గనుక సాధనలో పురుష ప్రయత్నానికెంతైనా ప్రధాన్యముంది. శరీరక అనుభవాలన్నీ పూర్వకర్మానుసారం ప్రాప్తమవడం సత్యమే. కానీ సాధన-మనోనిగ్రహాల విషయంలో మానవునకు సంపూర్ణ స్వేచ్ఛ ఉందని పైశ్లోకం చెబుతంది. మన సాధనా ఫలితాలు ఏక్షణానికాక్షణం మన లెక్కకు జమచేయబడి మనకై మనము క్రొత్తబాటలు నిర్మించుకొని శాంతిసౌధ మెక్కుతామని శ్రీ స్వామివారి మాటలు నిరూపిస్తున్నవి. శ్రీ స్వామివారి మాటలు ఉపనిషద్వాక్యాలకు ప్రతిబింబాల వడమెంత చిత్రమైన విషయమో! మైసూరు మహారాజు గూడా ఆయా రంగాలలో గొప్ప ప్రతిభను సంపాదించిన వారిని మాత్రమే చేరదీసి సత్కరిస్తారు అంతేగానీ అందరినీ సత్కరించడు అదేవిదంగా కష్టపడి సాధనచేసి అర్హత సంపాదించిన వారిని మాత్రమే మైసూరు మహారాజులాంటి సద్గురువు తారసిల్లి అనుగ్రహిస్తారని మిగిలిన అర్థార్థులందరూ చాక్ లెట్లడిగే పిల్లలతో సమానమని శ్రీ స్వామి బోధిస్తున్నారు.

### ప్రీప్రోగ్రాం:

శ్రీ స్వామివారు అప్పుడప్పుడూ తమాషాగా మాట్లాడేవారు. అలా జరుగబోతుందని కలలో గూడా ఊహించని మనకా మాటలు నవ్వులాటకు పలికినట్లని పించడం సహజం. కానీ లోతుగా ఆలోచిస్తే అమూల్యమైన రత్నాలవంటి బోధలు ఆమాటల మాటున దాగి ఉండేవి.

అప్పటివరకు మౌనంగా ఉన్న స్వామిమోపూరు దశయ్యతో "అయ్యో!

వనమ్మ వేరే బోతుండ్లా! అప్పుడు అన్నీ మనమియ్యాలయ్యా" అన్నారు. చిన్న తనంలోనే భర్తపోయాక తన మరిదిదశయ్య గారింట్లో గత ఇరవై సంవత్సరాలుగా కాలం గడిపే వనమ్మ వేరే బోతుందంటే నమ్మగలమా? గనుక స్వామివారు తమాషాకే అలా అంటున్నారని తలచారందరూ. కానీ పదిరోజుల తర్వాత శ్రీ స్వామివారి మాటలు అక్షరాలా నిజమయ్యాయి. దశయ్యగారి బియ్యం సామానుతో వాళ్ళింట్లోనే వేరే వంట చేసుకోసాగింది.

ఈ సృష్టిలో చాలా సూక్ష్మమైన అంశములవరకు ముందే నిర్ణయించబడి ఉంటుంది, ఎప్పుడు ఎవరు ఎవరితో తగాదాపడేది-ఎవరు ఎవరివద్ద అన్నం తినేది- ఏమి తినేది కూడా నిర్ణయమై ఉంటుంది. ఏ ధాన్యపుగింజ ఎవరినోట్లో పడేది ముందే నిర్ణయమై ఆ గింజపై వ్రాయబడి ఉంటుందని కబీరు చెప్పిన వాక్యం నిత్యసత్యమని తెలుస్తుంది. ఆ నిర్ణయాలన్నీ సర్వజ్ఞుడైన స్వామివారికి తెలసు గనుకనే ముందుగా చెప్పగలిగారు. ఏ బండ ఎప్పుడు విరగబడేది. ఏ ఇల్లు ఎప్పుడు ఎవరు కొనేది, ఏ బాండలిక ఎప్పుడు రంధ్రంపడేది, ఏ పాము ఎప్పుడు ఎక్కడ తిరుగుతుందనేది, ఏబండి మీద ఎన్ని గంటలకు ఎవరెవరు కూర్చుంటారు ఎంతకు అమ్ముతారు ఇలా ఎన్నోవిషయాలేగాక ఎవరెవరు ఎప్పుడెప్పుడు ఏమి మాట్లాడుతారనే విషయం గూడా శ్రీ స్వామివారు ముందే చెప్పియున్నారు. అంటే జరుగబోయే సర్వవిషయాలు ముందుగానే సినిమా ఫిల్ములో ఎక్కి ఉన్నాయన్నమాట. పరమాత్మ ఆడించే ఈ సినిమాలో ఆయా వ్యక్తులు వారివారి మాటలు పలికి తీరుతారు.

అయితే ఆ సన్నివేశాన్ననుభవించే మానవులు ఆ సన్నివేశం పట్ల వహించే భావాలు మాత్రం నిర్ణయించబడవట. జీవులు విధి చేతులో కీలుబొమ్మలని, అలా మాట్లాడకుండా ఉండేందుకు వారికి స్వేచ్ఛలేదని తెలిసిన స్వామివంటి జ్ఞానులు ఆ సన్నివేశాలపట్ల రాగద్వేషాలు లేకుండా నిర్లిప్తంగా సినిమా చూచినట్లు చూస్తుండి పోతారు. అజ్ఞానులు మాత్రం ఆ సన్నివేశంలో లీనమై రాగద్వేషాలు పెంచుకొని రాబోవు జన్మలకు విత్తనాలైన సంస్కారాలు సిద్ధం చేసుకుంటారు.



గనుక సాధకులైనవారు వారనుభవించే సన్నివేశాలలో మనస్సు నిగ్రహించుకునేందుకు, రాగద్వేషాలు ఇష్టా ఇష్టాలు లేకుండా మసలుకొని కర్మ క్షాళనం చేసుకొనేందుకు సన్నివేశంలో మన పాత్ర నటిస్తూనే వచ్చే జన్మలకు ఫిల్ములో మన బొమ్మలు లేకుండా మానసికంగా ఎలా జాగ్రత్త పడాలో మనం తెలుసుకునేందుకు మోపూరు దశయ్యతో వనమ్మ వేరేబోయే విషయం ముందుగానే శ్రీ స్వామివారు ప్రస్తావించారు.

ఇలాంటి అవగాహన లేకుంటే మానవుడు సత్యం ధర్మం కూడా త్రికరణ శుద్ధిగా ఆచరించలేడు. ముందు జరుగబోయే సన్నివేశాలన్నీ ముందుగానే నిర్ణయమై ఫిల్ములో ఎక్కించబడి ఉన్నాయనే నిశ్చయమైన అవగాహన లేకుంటే భయంవలన మానవుడు సత్యం, ధర్మమం ఆచరించేశక్తికోల్పోయి పతితుడయ్యే ప్రమాదమెంతైనా ఉంది. ఇలాంటి బలహీనతలన్నింటికి శ్రీ స్వామివారు అప్పుడప్పుడూ అర్థరహితంగా (మనదృష్టిలో) మాట్లాడిన పొడి పొడి సంభాషణలే చాలా బలమైన ఔషధాలుగా పనిచేస్తాయి. ఎప్పుడు? ఆ సంభాషణల అంతర్యాన్ని గూర్చి లోతుగా యోచించి నప్పుడు-ఆచరించినపుడు, పై విషయాన్నే మరొక విధంగా కూడా ఉపనిషత్తులు చెప్పాయి.

చెట్టుయొక్క సర్వలక్షణాలు విత్తనంలో ఇమిడియున్నట్లు భవిష్యత్తంతా నిర్ణయమైంది. అయితే విత్తనానికి నీరు, గాలి తగిల్తేనే మొలకొస్తుంది. లేకుంటే భవిష్యత్తులో రాబోయే వృక్షం (సంసార వృక్షం) నశిస్తుంది. అవగాహన లేనందున సన్నివేశంలో లీనమై రాగద్వేషాలు వహిస్తే విత్తనానికి నీరు, గాలి లభించిందని అర్థం. రాగద్వేషాలు వహించకుండా మనస్సు నిగ్రహించుకుంటే సంసార వృక్షానికి భవిష్యత్తే లేదు.

### చీకటి పోగొట్టుకోండి:

సోమశిల దగ్గర సాధువులంతా సభచేశారు. వారితో స్వామి చీకటి పోగొట్టుకోండయ్యా-గలభా చేయబాకండి అని సెలవిచ్చారు. ఏతండ్రికైన తనబిడ్డ

ప్రయోజకుడై తన స్వశక్తిపై స్వతంత్రుడుగా నిలబడి అవసరమైతే పదిమందికి చేయూత నివ్వగలగాలని ఉంటుందిగాని ఎల్లకాలం కావలసిన దానికల్లా తన దగ్గర చేయిజాపేవాడుగా ఉండాలన్పించదు. అదేఅతడి తపన. ప్రాకృతికమైన దేహం ప్రసాదించిన పామరుడు స్వార్థపరుడూ అయిన తండ్రికే యింత తపన ఉంటే, తల్లి, దండ్రి, గురువు, దైవమూ తానే అయిన ప్రేమమూర్తికి, సద్గురువుకు ఎంత ఆరాట ముంటుంది? స్వామి ఆశించేది మనం సాధ్యమైనంత త్వరగా ఏమీ కోరనక్కర్లేని స్థితిని చేరాలనే, అదే ద:ఖ నివృత్తి, ముక్తి, ముక్తి పొందాలని భక్తునకున్న కోరిక కంటె ఎన్నోరెట్లు ఆరాటం గురువుకు అట్టి స్థితిని ప్రసాదించాలని ఉంటుంది. అట్టి నిర్హేతుకమైన ప్రేమస్వరూపి గనుకనే అతడు దైవము, తల్లి, తండ్రి, ఆప్తుడు అయినాడు. అతడట్టి ప్రేమమయుడని, దానికితోడు సర్వజ్ఞుడని మనం విశ్వశించడమే వారిని గురువుగా తలచడమంటే. అట్టివారిని మనమేం కోరాలి? మనం దానిని కోరుతున్న మాటే నిజమైతే దానిని సులభంగా పొందేలాగ యోచించడం ఆయన బోధిస్తే దానినెందుకు ఆచరించము? అందునా తననే తల్లి, తండ్రి, గురువు, దైవంగా భావించి సేవించే సేవకులు శ్రీ స్వామివారి బోధను విస్మరించి లౌకికులు, కేవలం పామరులైన గృహస్థులతో సంపర్కం పెట్టుకొంటుంటే స్వామివారికి కడుపు మండేది.

ఒకరోజు శ్రీ స్వామివారు తన సేవకుల నుద్దేశించి తిట్టరాని తిట్లు తిట్టి తన మనోవేదనంతా వెళ్ళగక్కారు." మండలు రండలై ఉన్నారు. అంతా అప్పు, బాకీచేస్తున్నారు. చిల్లిగవ్వ సంపాదిస్తున్నారా". అంటూ తన ఆవేదన వెళ్ళబోసు కున్నారు. ఏమి? ఎందుకంత బాధ స్వామికి? తనకు షడ్రసోపేతమైన భోజనం పెట్టలేదనా? తనకు కనువిందైన పాదపూజలు చేయలేదనా? అందరు గురువుల్లాగ తనను పూలమాలలతో ముంచెత్తలేదనా? జీవితాంతం ఏనాడూ ఎవ్వరినీ పల్లెత్తుమాట అనని స్వామి ఉగ్రుడై అనరాని మాటలతో తన అక్కసు వెళ్ళబోసుకున్నా రెందుకు? లోతుగా యోచించాల్సిన విషయమే ఇది.



లడ్డు పెడితే మిరప్పొడి కలుపుకొని తిన్న స్వామికి మన నివేదన లేమి సంతృప్తి నివ్వగలవు. కనీసం వారి పాదాలచెంత పుష్పాలుంచినా అంగీకరించని స్వామికి పూల మాలలేం సంతోషపరచగలవు. మన గొప్ప చాటుకునేందకే చేసుకునే వేడుక లేపాటి తృప్తి నివ్వగలవు. మరి వారికి ప్రీతీ గల్గించే కార్యాలేవి?

ప్రతి నిత్యం ఎంతో ఆహారం సాటిజీవులకై వెదజల్లనిదే ముద్దకూడా ముట్టే వారు కాదు. గనుక భూతబలికెంత ఆహారం సమర్పిస్తే వారికంత ప్రీతి. ఆకలైకొంగుపట్టిన వారికన్నం పెడితే ప్రీతి. హోదా కొరకు డిన్నర్లు చేస్తేమాత్రం కాదు సుమా!

తంబర మీటుతూ నామజపం రాత్రింబవళ్ళు తన్మయులై చేశారు. అలా చేసేవారిని పాడేవారిని పిలిపించుకొని తనదగ్గర భజన చేయమనేవారు. అంతేగానీ ప్రేక్షకుళ మన్ననల కొరకురాగాలు తీస్తేకాదు సుమా! గనుక మనం కూడా ఆర్తితో భజన, నామ సంకీర్తన చేస్తే సంతోషిస్తారు. నామ జపంతో పునీతమైన ఆహారం సమర్పిస్తే ఎంతో సంతోషంగా తినేవారు. తెచ్చినవారి బాహ్యమైన వేష ధారణగానీ ఆచార వ్యవహారాలు గానీ అసలు పట్టించుకునేవారు కాదు. గనుక నామజపమంటే వారికెంత ప్రీతో తెలుస్తుంది.

దుర్విమర్శలు, లోక దూషణలు -పుక్కిటి పురాణాలు, ఊసుబోని కబుర్లంటే శ్రీ స్వామివారికి చెడ్డమంట. అలాంటి పనులు చేసి వచ్చిన సేవకుల సేవలను వెంటనే నిరాకరించి బుద్ధిచెప్పేవారు. నేడుగూడా మనగతీ అంతే.

సత్యం ధర్మం తప్పొదన్నారు. ధర్మం కొరకు పోరాడిన వారిని ఎంతో గొప్పగా ఆశీర్వదించారు. తనలోని దర్గుణాలు పోగొట్టుకొనేందుకు హృదయ పూర్వకమైన ప్రయత్నం చేసి కన్నీటితో ప్రార్థించినవారి నెంతో మెచ్చుకొని చేయూతనిచ్చి పై స్థితికి చేర్చారు. మహనీయుల చరిత్ర పారాయణ-దైవ దర్శ నానాకి ముఖ్యమైన సాధనని తెల్పి అలా పారాయణ చేసిన వారికి వారు కోరిన నిదర్శనాలిచ్చి అనుగ్రహించారు. స్త్రీల పొరుగంటేనే గిట్టని స్వామి పారాయణ, నామజపం, సత్సంగంచేసే స్త్రీలోస్తే తనను తాకేందుకు కూడా అనుమతిచ్చారు.

గనుక సత్సంగం, పారాయణ, నామజపమంటే శ్రీ స్వామివారికెంత ప్రీతికరమైన సాధనలో యోచించండి.

కానీ నేడు మనం వారి కృపను పొందాలంటే ఇన్నిమార్లు నీదివ్య చరిత్ర పారాయణ చేస్తాననిగానీ, ఇన్ని గంటలు నామజపం చేస్తాననీగానీ, ఇన్ని గంటలు భజన చేస్తాననిగానీ మ్రొక్కు పెట్టుకొనేవారు మచ్చుకొక్కరయినా కనపడరు. పూలమాలలు, ప్రసాదాలు టెంకాయలు సమర్పించే మహనీయులే ఎక్కబడితే అక్కడ కొకొల్లలుగా తయారయ్యారు-అవే చేయమని చెప్పే అజ్ఞులు గూడా అధికమయ్యారు.

ఆప్రేమమూర్తి మాత్రం తన ప్రేమామృతాన్ని సర్వులకు సమానంగానే వర్షింపజేస్తున్నారు. వారి అభిమతాన్ని గుర్తించి వారుకోరిన దక్షిణ సమర్పిస్తే వారి అండ ఆశీస్సులు సదా పొందగలుగుతాము. లేకుంటే విసుగెత్తి వారి సేవకుల లాగ మనలను కూడా తిట్టిపోసి "ఆవేదనతో పొయ్యేవాళ్ళను పోనిచ్చేదే గదయ్యా' ' అని చూస్తుంటారు. చీకటి పోగొట్టుకొనే ప్రయత్నం చేస్తూ శ్రీ స్వామివారి మార్గంలో నడవడమా లేక లోకం మెప్పుకొరకు వేడుకలు, అలంకారాలతో రాగాలు తీస్తూ ఘనత వహించడమా మీరే తేల్చుకోండంటూ-"వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మన ముండేది" అని నిర్మోహమాటంగా చూస్తున్నారు స్వామి "చీకటి పోగొట్టుకోండి" అంటే పైవిధంగా ఆచరించి సద్గురు కృప పొందితే జ్ఞానమనే వెలుగు లభించి చీకటి తొలుగుతుందని చెప్పారన్నమాట "గలభా చేయబాకండి" అంటే ధర్మబోధ అనే పేరుతో మీటింగులు పాదపూజలు ఏర్పాటుచేసి ఆచరణ శూన్యమైన ఆర్భాటాలు మాని హృదయ పూర్వకమైన ఆర్తితో సద్గురు వాక్యాన్ని ఆచరించి ధన్యత చెందమని బోధించారు.

**వేదసారం :**

సాదన ఎలా చేయాలని అడిగిన వారితో "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా" అన్నారు. ఇది వేదాలు, ఉపనిషత్తుల సారమని ఈ క్రింది శ్లోకం చెపుతుంది.



యదా సర్వేప్రముచ్చంతే కామయేశ్య హృధిశ్రిత: అధమర్త్యోఅమృతో భవతి అత్ర బ్రహ్మసమశ్నుతే కావాలి అనే కోరికలన్నీ బాగుగా హృదయమునుండి తొలగిన మరుక్షణమే మానవుడు అమృతత్వము పొందును. అని అర్థం కోరికలన్నీ పోవడమంటే జీవించాలనే కోరిక కూడా ఉండకూడదట. ప్రతివారికి మరణభీతి ఉంటుందట. అది మరణమాసన్నమైనప్పుడే తెలిస్తుందని శ్రీ భరద్వాజగారు చెప్పేవారు.

**దండోపాయము :**

శ్రీ స్వామివారు భూదేవికంటే మించిన ఓర్పుగల మహనీయుడు. తానం చెర్లలో శ్రీ స్వామివారొక కుష్ఠ పీడితురాలిని జాలితో చూచినందుకు విచారణ జరిపి వివరాలు సరిగా చెప్పలేదని గట్టి మోకుతో కొట్టి కట్టేశారు. కానీ స్వామివారు నోరు విప్పలేదు. కోటితీర్థం దగ్గర పెన్నవెల్లువకు కొట్టుకొచ్చిన దూలం తెచ్చి గుండంలో వేశాడని ఒక దుండగుడు చెంపదెబ్బ కొట్టినా మాట్లాడలేదు. కలువాయి సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ స్వామివారిని అనుమానించి పోలీస్ స్టేషన్‌లో పెట్టినప్పుడు కూడా సంతోషంగా కూర్చున్నారే గానీ ఒక్కమాట ఎదురాడలేదు. వారిని హింసించిన దుర్మార్గులు కాలాంతరంలో తగిన ఫలితాలు వారే అనుభవించారు.

ఇట్టి మహనీయుని ఓర్పును ఆసరాగా తీసుకొని అధర్మ ప్రవర్తనకు దిగి ధర్మపరులను హింసిస్తుంటే శ్రీ స్వామివారు యుద్ధం ద్వారా ధర్మస్థాపన చేసేవారు. తనను హింసించినా సహిస్తారు కాని అధర్మంగా భక్తులకు బాద కల్గిస్తే సహిస్తారా!

స్వామి సేవకులలో ఒకరు రోశిరెడ్డిని అధర్మంగా దూషిస్తూ నిందారోపణ చేస్తున్నాడు. కానీ రోశిరెడ్డి మాత్రం ఓర్పుగా చెప్పవలసిందంతా చెప్పి ఆ పైన మాట్లాడకుండా ద:ఖాన్ని దిగమ్రింగి స్వామివారి చెంత కూర్చున్నాడు. ఆ దుర్మార్గుని వ్యవహారం హద్దుమీరిందో ఏమో స్వామివారు "రోశిరెడ్డి! ఏమైన మాటుంటే మాట్లాడుకోపోయ్యా" అనేమాటతో యుద్ధానికి తయారుకమ్మని శంఖాన్ని చేతి కిచ్చారు. శ్రీ స్వామివారి భావాన్ని గుర్తెరిగిన రోశిరెడ్డి రోషభీషణాకారుడై ప్రత్యక్షంగా ప్రత్యర్థితో తలపడ్డాడు. ఆ దుండగుడు నరకుతానని గొడ్డలి తీసుకుంటే,

నిరాయుధుడయిన రోశిరెడ్డి ఆ గొడ్డలి పెరికి అవతల పారేసి నరసింహావతార మెత్తాడు. ఆ పెనుగులాటలో రోశిరెడ్డి గోరు అవతలివాని గొంతులో దిగబడి రక్తప్రవాహమయింది. శ్రీ స్వామివారిదంతా చూస్తున్నారే గానీ పల్లెత్తు మాట అనలేదు.

ఆ గాయపడిన సేవకుడు తన పలుకుబడి ఉపయోగించి రోశిరెడ్డిని ఆశ్రమం నుండి తరిమి వేయాలని తన అభిమానులను తీసుకొచ్చాడు. అందరూ కలిసి అలాంటి దుర్మార్గుడు ఆశ్రమంలో ఉండ తగడని గనుక ఆశ్రమం నుండి తరిమి వేయమని శ్రీ స్వామివారికి ఉచిత సలహా ఒకటి పారేశారు.

సర్వసాక్షియైన శ్రీ స్వామివారికి ధర్మాధర్మాలు మనం నేర్పాలా! "అయ్యా ఒకర్ని పొమ్మని చెప్పేదానికంటే మనం పోవడం మంచిది గదయ్యా" అని ఒకే ఒక వాక్యం పలికారు. ఎక్కడి వాళ్ళక్కడ గుట్టు చప్పుడు కాకుండా వెళ్ళిపోయాగు.

పై సన్నివేశం ద్వారా శ్రీ స్వామివారు అధర్మం హద్దు మీరినపుడు యుద్ధానికి దిగడమే ధర్మమని-అలాగాక చేతులు ముడుచుకొని కూర్చుంటే అధ్యాత్మికత అనే పేరుతో అధర్మం చేసినట్లు అవుతుందని బోధిస్తున్నారు.

ఇదేవిధంగా అధార్మాన్ని ఖడించడం కూడ మన విద్యుక్త ధర్మమని చెప్పారు. అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఎదిరించి నివారించే ప్రయత్నం. చేయకుండా ఉండడం కూడా అధర్మమని దాని ఫలితం తప్పక అనుభవించాలని బోధించారు.

ఒకరోజు స్వామి భక్తుడు మరొక భక్తుని అధర్మంగా నిందారోపణ చేసి నిందిస్తున్నాడు రోశిరెడ్డి తనదారిన తాను పోకుండా అదర్మపరుని వాదం ఖండించి స్వామి చెంతకొచ్చాడు. రోశిరెడ్డి వచ్చీ రాకముందే స్వామి "రోశిరెడ్డి నీకిరోజు అరులోకాల ఆస్థి వచ్చిందయ్యా" అని హెచ్చరించారు. గనుక అధర్మం పట్ల మన ప్రతి స్పందన ఎలా ఉండాలో మనమే నిర్ణయించుకోవాలి.



**పాపభారం:**

కేవలం ధర్మమెరిగి యుండడమే చాలదు. ధర్మసూక్ష్మమెరిగి నడుచుకోవడంమెంతో అవసరమని స్వామివారు కొన్ని సందర్భాలలో తన భక్తుల కిచ్చిన సలహాలు తెలుపుచున్నవి. పాపకర్మలలో ఎవరెవరు భాగస్వాములౌతారో ఎరిగియుండడమెంతో అవసరం. ఒకరోజు కారి రామస్వామి తన అప్పులు తీరే మార్గం కనబడలేదని, పొలం అమ్మి వేయాలని వాపోయాడు. "అయ్యా నీవు చేసే వ్యాపారం చేస్తే అన్నీ తీరిపోతాయి" అని సెలవిచ్చారు స్వామి. రామస్వామి కటిక వ్యాపారం పాపమని స్వామివారు చెప్పియున్నందున దానిని మానేశాడు. ఆ విషయం గుర్తుచేస్తే స్వామివారన్నారు "అయ్యా జీవాలు సాకిన ఆసామికి, అమ్మినవానికి, అమ్మించిన మధ్యవర్తికి, లారీవానికి, కోసినవానికి మాంసం తెచ్చిన వానికి, వండిన వానికి తిన్నవానికి అందరికీ పాపమొస్తుంది పదిమందిలో నీవు పదకొండవ వాడవు గదయ్యా" అని సెలవిచ్చారు. భారతంలో జెప్పినట్లు అధర్మమం చేయించినవారికి, చేయమని సలహా ఇచ్చినవానికి, దాన్ని ప్రోత్సహించినవానికి, చేసిన వానికి చేస్తుంటే చూచి కూడా నిగ్రహించే ప్రయత్నం చేయకుండా ఉన్నవారికి, అందరికీ ఆ అధర్మకార్యంలో పాప భాగముంటుందని చెప్పిన దానికి స్వామివారి మాటలు చక్కగా సరిపోయాయి. గనుక ఆ అధర్మాన్ని చూచి ఆనందించడం, అధర్మాన్ని శక్తివంచన లేకుండా నివారించే ప్రయత్నం చేయకపోవడం. ఆశ్రిత పక్షపాతము, బంధుప్రీతి వలన అధర్మం జరుగుతుంటేత ఓర్పు అనే ముసుగుచాటున మన బలహీనతను కిప్ప పుచ్చుకుంటే సర్వసాక్షయైన సృష్టి సూత్రం మన వాటా పాపం మన నెత్తికెత్తక మాన దని చక్కగా గుర్తించి జాగరూకతతో నడుచుకోమని స్వామి హెచ్చరించారు. అట్టి శక్తినిమ్మని శ్రీ స్వామివారిని ఆర్తితో అనుక్షణం ప్రార్థిద్దాం. అలాగానప్పుడు ఇలాంటి చిన్నచిన్న పాపభారాలన్నీ కలిసి పెద్ద భారమై సద్గురుని నిజస్థితిని కండ్లారా చూస్తున్నా వారిని గుర్తించి తగు విధంగా సేవించే హృదయ స్పందన కరువై పెన్నిధి లభించినా దక్కించుకోలేని దౌర్భాగ్యులంగా మిగిలిపోతామని గుర్తించు కోవాలి.

## ప్రత్యేక దర్శానాలు :

శ్రీ స్వామివారికి మనమెంతో గొప్పగా ఆర్థికంగాను, వస్తురూపేణాను శారీరకంగాను మన సేవ సమర్పిస్తున్నాము గదా! మరి మనకంత మాత్రం ప్రత్యేక దర్శనం ఇప్పించకూడదా ఈ పూజారులు అని కొందరు. ప్రత్యేకంగా ప్రసాదాలు పూలమాలలు మా సేవకు గుర్తింపుగా ఇస్తే మేమిచ్చిన దాంట్లో ఎన్నో వంతు ఇస్తారు అని మరి కొందరు అమాయకులు స్వామి సేవకుల పైన కమిటీ మెంబర్ల పైన కినుక వహించడం సహజం. కానీ శ్రీ స్వామివారి జీవిత విధానాన్ని, వారాచరించి చూపిన దివ్యమార్గాన్ని కొంతలోతుగా పరిశీలిస్తే అలాంటి భావాలు అర్థరహితాలే గాక శ్రీ స్వామివారి కృప మనకందకుండా చేసే అడ్డుగోడలని తెలుస్తుంది.

"నా జబ్బు బాగుచేస్తే శ్రీ స్వామివారికి చాలా డబ్బిస్తానన్న శ్రీ మంతునితో స్వామివారు" ఏమిటయ్యా ఆయననేది. అందరికీ మన మిస్తుంటే ఆయనేంది మన కిచ్చేది" అని సెలవిచ్చారు. స్వామి వారికెవరేమి సమర్పించినా అది నిజానికి భగవంతుని సొత్తే భగవంతుడు కరుణతో మనకు ప్రసాదిస్తే తిరిగి కృతజ్ఞతతో దానిని వారికి సమర్పిస్తున్నామనే భావమే సరియైనది. అలాగాక నేను సమర్పిస్తున్నానని తలచడం అహంకారమే అవుతుంది. అదెంత గొప్ప పొరబాటో ఆలోచించాలి. సంకల్ప మాత్రంచేత కొండలను సహితం బంగారంగా మార్చగల సృష్టికర్తకు మనమివ్వడమేమిటి! అలాంటి భావం మనలో మెదిలిందంటే. మన కానుకెంత గొప్పదైనా స్వామివారి దృష్టిలో అది కాకిరెట్టే! కానుకలు సమర్పించామనే మిషతో ప్రత్యేక దర్శనాలు కోరడం ద్వారా మనపుణ్యం కాస్త అప్రత్యేక దర్శనాలకు సరి పోతుంది. వారి దగ్గర మనకు దక్కేది శ్రమ మాత్రమే. అలాగాక ఎంతో అణుకువ సవ్రమతలతో అందరికంటే తక్కువ వారిలాగ స్వామి సన్నిధిలో మసలకున్నప్పుడే స్వామివారి కృప మనపై వర్షిస్తుందని గుర్తింతముగాక.



## ఉపవాసం:

సాధకులందరికీ ఒకే ఆధ్యాత్మిక సాధన సరిపోతుందను కోవడం పొరపాటు. వారి వారి గతజన్మల సాధన ననుసరించి సాదనలో వారున్న స్థితిననుసరించి ఒక్కొక్క సాదన ఒక్కొక్క సాదకునకు తగియుంటుంది. ఏ సాధకునకు ఏ సాదన తగియున్నదనే విషయం ఒక్క సద్గురునికే తెలిసియుంటుంది. ఎవరికి తగిన సాధన వారికి సూచించడంలోనే సద్గురుని సామర్థ్యం ఇమిడియుంటుంది. అలా గాకుంటే ఈ పాటికి గురువుల ఉపదేశాలు తీసుకున్న వారంతా గొప్ప మహాత్ములుగా వెలిగిపోయేవారే గదా!

శ్రీ స్వామివారికి సర్వజీవుల పూర్వాపరాలన్నీ అనుక్షణం తెరచిన పుటల వంటివి. వారి గతజన్మ వృత్తాంతాలను గురించి తెలుసుకొనేందుకు వారికెట్టి గణితముగానీ అతీతస్థితి లోనికి వెళ్ళవలసిన అవసరంగానీ ఉండేది గాదు. ఆ జీవిని చూచిన వెంటనే బొళ, బొళా వారి పూర్వజన్మ వృత్తాంతాలన్నీ చెప్పేవారు.

ఈ మహనీయుడు ఉపవాసం నిషేధించారని గానీ, ప్రోత్సహించారని గానీ నిరుష్టంగా చెప్పలేము. వారి వారి సంస్కారాన్ననుసరించి కొందరికి ఉపవాసం తగదని మాన్పించారు. మరికొందరికి ఉపవాసం విధించారు. ఉదా:- మంగమ్మగారు తొలి ఏకాదశికి ఉపవాసముంటే "అన్నం చూస్తుళ్ళామ్మా- తినేసిరా" అని అమెచేత అన్నం తినిపించారు. కానీ రోశిరెడ్డి గారితో "అయ్యా ఐదురోజులు అన్నం లేకుండా ఉండేవాడెవడో చూపించయ్యా" అన్నరు. ఎవరో ఎందుకు నేనే ఉంటాను స్వామీ! అని దీక్షచేస్తే వారి దీక్షను ప్రోత్సహించారే గానీ మంగమ్మను వారించినట్లు వద్దని వారింపలేదు. ఈ రోశిరెడ్డికి కొన్ని సంవత్సరాలపాటు ఒంటిపూట భోజనం విధించారు మరికొన్ని సంవత్సరాలు ఒక్కపూట జావ మాత్రమే త్రాగి ఉపవసించమన్నారు చివరి దశలో కొన్నాళ్ళు చక్కెరనీళ్ళు మరి కొన్నాళ్లు కేవలం వేడినీరు మాత్రమే సేవించేవారు.

తీవ్రంగా సాధనచేసి తరించాలనే వారికి లౌకికుల సంపర్కం పనికిరాదనే

వారు స్వామి. అందుకే తనను ప్రత్యక్షంగా సేవించే మోక్షగాములు ఇతరులతో లౌకిక విషయాలు మాట్లాడినపుడు వారి సేవను నిరాకరించారు. "అయ్యా ఆయన మనషుల్లోకి పోయివచ్చాడు ఆయనవద్ద నాకు జావ నీవు పొయ్యయ్యా' ' అని మరొకరి చేత జావ పోయించుకునేవారు. లౌకికుల సంపర్కమే సాదకులకు పనికి రాదని స్వామివారి ఆజ్ఞ. అలాంటప్పుడు పరమ లౌకికులనుండి పరిగ్రహం (వస్తువులు తీసుకొనడం) సాధకులకెంత దోషమో ఆలోచించండి.

నేనొకప్పుడు (రచయిత) స్వామివారి చెంత సేవచేస్తూ ఉంటానంటే "ఆయన అన్నం ఆయన తింటూ ఇక్కడ ఉండమనయ్యా" అని ఆజ్ఞాపించారు. వారి మాట కొన్నాళ్ళ తర్వాతయినా అక్షరాలా పాటించవలసి వచ్చింది. కష్టార్జితం తప్ప ఇతరత్రా ఎక్కడ భోంచేసినా తీవ్రంగా అనారోగ్యానికి గురయ్యేవాణ్ణి. క్రమేణా ఆత్మబోధ ద్వారా ఈ సత్యం గుర్తించేటట్లుచేసి ఆచరింపజేశారు స్వామి.

అది మొదలు నా ఆరోగ్యం మెరుగు కాజొచ్చింది. కానీ శ్రీ స్వామివారి ఆజ్ఞలెంత శక్తివంతములో సంపూర్ణంగా అర్థంకావాలంటే నాలాంటి ఇంద్రియలోలునికెన్ని జన్మలకైనా సాధ్యమా? శ్రీ స్వామివారు అపార కరుణామూర్తి. వారి ఆజ్ఞలను నేను సంపూర్ణంగా పాటించలేదని ఒకనాడు "చిన్న తప్పయినా తప్పే" నని నా స్వప్నంలో పలికారు. కారణం ఆనాడు మొహమాటపడి ప్రసాదమనే పేరుతో ఇతరుల సొత్తు ఒక అరటి పండు తిన్నాను. వెంటనే ఆ తప్పుకు తగ్గ శిక్ష కూడా వేశారు.

నాటి హెచ్చరికతో శ్రీ స్వామివారి కృపవలన చాలా దోషాలు సవరించుకున్నాను. తత్ఫలితంగా చాలా కాలం నుండి బాధిస్తున్న మోకాళ్ళ నొప్పులు మాయమయ్యాయి. కానీ కొన్నాళ్ళ తర్వాత ఏమరుపాటు, అశ్రద్ధల ఫలితంగా ఆకలిగా ఉందని స్వామివారి ప్రసాదం కొంచెం తిన్నాను. అది "నీ అన్నం నీవు తినయ్యా" అన్న ఆజ్ఞనుల్లంఘించినట్లు అని ఆ క్షణంలో గుర్తురాలేదు. అదే మాయ అదే ప్రకృతి. ఆక్షణం నుండి నా పరిస్థితి దారం తెగిన గాలిపటంలా



తయారయింది. పరమ పాములుల కంటే హీనస్థితికి పడిపోయాను. నాలోని ఈ మార్పు నాకు తెలుస్తూనే ఉంది. కానీ ఆపతన వేగాన్ని నిగ్రహించలేకున్నాను. నాభావాలు, నియమపాలన, క్రియాశీలత, కార్యదీక్ష, అన్నీ సర్వనాశనమై పోయాయని గుర్తించగల్గడం గూడా శ్రీ స్వామివారి కృపే. అట్టి నీచస్థితిలో జీవించడం కంటే మరణమే మేలని పించింది. అందుకు ప్రాయశ్చిత్తంగా 24గం. ఆహారం స్వీకరించకుండా ఇంటి గడప త్రొక్కకుండా ఆశ్రమ ప్రాంగణంలో అనాధగా ఉండేటట్లు శిక్ష విధించుకున్నాను. ఆతర్వాత క్రమేణా నా పరిస్థితి మెరుగు కాజొచ్చింది. గనుక స్వామివారి ఆజ్ఞల నుల్లంఘించడమెంత దౌర్భాగ్యమో కొంతయినా అర్థమైంది. మాయకు లోబడక శ్రీ స్వామివారి ఆజ్ఞలను ఆచరించే శక్తిని ప్రసాదించమని శ్రీ స్వామివారిని కన్నీటితో ప్రార్థిస్తున్నాను. జై శ్రీ సద్గురునాధా!

**మోక్ష ప్రదాతః**

తద్విద్ధి ప్రణి పాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్షంతితే జ్ఞానం జ్ఞానినః తత్వదర్శినః

అన్న గీతావాక్యాన్ననుసరించి ముముక్షువులైన వారు తప్పక శ్రీ స్వామివారి వంటిమహనీయులను సేవించి తీరాలి. "సూర్యచంద్రులన్నంతవరకు ఉండేదే గదయ్యా" అన్న శ్రీ స్వామివారి అభయం నిత్యసత్యమై యున్నది.

రాముడు, క్రిష్ణుడు మొదలుకొని బుద్ధుడు నానక్ రామకృష్ణపరమహంస సాయినాధుడు వంటి అవతార పురుషులందరూ మానవులకు లౌకికమైన సహాయ మందించడమేగాక పారలౌకికంగా అర్హులైనవారికి జ్ఞానాన్ని కూడా ప్రసాదిస్తూ వస్తున్నారు. అట్టి అవతార పురుషులలో ఒకరైన భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారుకూడా భక్తుల కష్టాలు బాపడమే గాకుండా వారివారి అర్హతకు తగినట్లు ముముక్షువులకు తన సంపూర్ణ సహకారాన్ని మహాసమాధి అనంతరం కూడా అందిస్తున్నారు. సద్గురువు కొరకు తపిస్తూ నిత్యం "గురుబ్రహ్మ గురువిష్ణు" అనే శ్లోకం చదువుకొని మూడు ముద్దల అన్నం సద్గురువుకని

సమర్పిస్తూ వచ్చిన పాలకొండ సుబ్బారెడ్డిగారికి ఆనాడు శ్రీ స్వామివారు స్వప్నదర్శనమిచ్చి తాను ఫలానాచోట ఉన్నాను. వచ్చి సేవించమని ఆజ్ఞాపించి వారిని తన సేవలో ఉంచుకొన్నారు.

ఇదేవిధంగా మహాసమాది అనంతరం కూడా ముముక్షువుల నెందరినో తన సన్నిధికి చేర్చుకొని తగువిధంగా శిక్షణ నిచ్చి అనుగ్రహిస్తున్నారు. ఉదాహరణకు ఇబ్రహీంపట్నం పి. మాధవరావుగారు పూర్వజన్మ కర్మానుసారం కొన్ని మానసిక బాధలకు లోనైన రోజులలో చిత్రమైన రీతిలో తన జీవితచరిత్ర గ్రంథాన్ని మాధవరావుగారికి చేర్పించి దాని పారాయణ ద్వారా వారికి మానసిక శాంతి ప్రసాదించారు స్వామి. కృతజ్ఞతాపూర్వకమైన హృదయంతో నాటి నుండి స్వామివారిని ముముక్షువై ఆరాధించసాగారు. వారి భక్తి విశ్వాసాలు అభివృద్ధిచేయ సంకల్పించి వారికి శ్రీ స్వామివారు భౌతిక దర్శనం కూడా ప్రసాదించారు. అప్పటి నుండి వారి సాదన మూడు పువ్వులు ఆరుకాయలై ఫలిస్తుందని వేరే చెప్పనక్కరలేదు.

ఎక్కడో రైల్వే డ్రైవరుగా ఉన్న తొగురు వెంకయ్యగారిని తన సన్నిధికి రప్పించి మంత్రోపదేశంచేసి నిరంతరం తన సేవ స్మరణ చేయిస్తున్నారు. ఇదే విధంగా జి.వి. రమణమూర్తిని గూడా ఆధ్యాత్మికంగా అనుగ్రహించడం జరిగింది. ఈ మానవజన్మ సాఫల్యం చేయమని షిరిడిసాయిని సేవించే నన్ను తన సన్నిధికి రప్పించి చిత్రమైన అనుభవాలతో అనుగ్రహిస్తున్నారు. వీరేగాకుండా సుదూర ప్రాంతాలలో మా విజయనగరం మిత్రుని వంటి వారి నెందరినో శ్రీ స్వామివారు ఆధ్యాత్మికంగా అనుగ్రహిస్తూ భౌతికంగా దర్శనం కూడా ప్రసాదించారు. మహాసమాధి అనంతరం షుమారు నాలుగు సం॥ తర్వాత అంటే 1986సం॥లో మా మిత్రునికే గాక ఆ గ్రామస్తులకు కూడా భౌతిక దర్శనభాగ్యం గల్గించడం ఎంత గొప్ప అద్భుతమో యోచించండి. హృదయపూర్వకంగా కృషిచేసే ముముక్షువులందరికీ తక్షణం శ్రీ స్వామివారు తన చేయూతనిచ్చి అనుగ్రహిస్తున్నారు. నిత్య పారాయణ పూజ-నామజపం చేసుకొంటూ స్వామివారు బోధించిన ధర్మాన్ని సాధ్యమైనంత వరకు నిజజీవితంలో ఆచరిస్తూ అలా ఆచరించలేనప్పుడు



అట్టి ఆచరణను ప్రసాదించమని స్వామివారిని కన్నీటితో ప్రార్థించడం చేస్తుంటే అనుక్షణం శ్రీ స్వామివారి సన్నిధి మన కనుభవమవుతూనే ఉంటుంది. సూర్యచంద్రులున్నంతవరకూ వారిచ్చిన అభయం నెరవేరవలసిందే గదా!

శ్రీసల్లా శ్రీరాములు శెట్టిగారు-కృష్ణాపట్నం నెల్లూరు జిల్లావారికి శ్రీ వెంకయ్యస్వామివారు ఇచ్చిన స్వప్న సందేశము వలన వారు సర్వాంతర్యామియని, సర్వజ్ఞులని, శ్రోత్రియులని (శాస్త్రము లెరిగినవారు) ప్రేమమయులని, వారిని విశ్వసించి సేవించేవారిని అనుక్షణము కంటికిరెప్పలా కాపాడుతూ వక్రమార్గములో జీవితం గడిపి పాపఫలం మూటగట్టుకోకుండా అనుక్షణమూ రక్షిస్తారని మరొకసారి మనకు చక్కనిబోధనందిస్తూ మనందరినీ శ్రీరాములు శెట్టిగారి మార్గ మాచరించమని హెచ్చరిస్తున్నారు. శ్రీ స్వామివారిని ప్రార్థించకుండానే శ్రీ స్వామివారు తనకై తానే ఈ స్వప్న సందేశమందించడంలో భావమిదే.

శ్రీ వెంకయ్య స్వామివారి మాల వేసుకొని దీక్ష చేసిన కొందరు భక్తులు దీక్ష విరమించాక, వారు ధరించినదీక్షావస్త్రాలు ఈ సల్లా శ్రీరాములు శెట్టిగారికి ఇచ్చారు. శ్రీ రాములు శెట్టిగారు ఆ నాలుగుమూరల కాషాయరంగు పంచెలు జాయింట్ చేయించి ఉతికి మరునాడు ధరించేందుకు సిద్ధంగా ఉంచుకున్నాడు. ముందటిరోజు రాత్రి శ్రీ స్వామివారు శ్రీ రాములశెట్టిగారి స్వప్నంలో ఇలా పలికారు. "యర్రగుడ్డలు కట్టుకున్నట్లు కాదు. అబద్దంచెప్పకూడదయ్యో"' అని ముమ్మారు పలికి అదృశ్యమైనారు. శ్రీ రాములు శెట్టిగారు ఆబట్టలు తాను వాడుకోకుండా మరొకరికిచ్చేశారు. కాని అందులోని కాషాయరంగు కండువామాత్రం ఉంచుకున్నాడు తాను స్నానానంతరం వళ్ళుతుడుచుకోవాలని ఆకండువా అక్కడ పెట్టి స్నానం చేసి వచ్చేలోగా దాన్నికూడా శ్రీ స్వామివారు అదృశ్యం చేసేశారు. "ఆశ పోతే అంతా పోతుండ్లాయ్యా" అన్న శ్రీ స్వామివారి మాటను వీరిచేత చక్కగా ఆచరింపజేశారు.

అహింసా, సత్య, మక్రోధ: త్యాగ, శ్శాంతి రపైసునం-అని భగవద్ గీతలో దైవీసంపదలక్షణాలు సాదకులు అలవరచుకోవాలని చెప్పబడ్డాయి. వాటిలో శ్రీ స్వామివారు సత్యం గూర్చిచెప్పారు గనుక ఆ లక్షణాలన్నీ కల్గియుండాలని చెప్పినట్లే. అట్లాగే భక్తియోగంలో భక్తుని లక్షణాలన్నీ చెప్పారన్నమాట. బాహ్యమైన వేషధారణతో తృప్తిచెంది ధన్యుల మయ్యామని తలచవద్దని ఆయాలక్షణాలు (సంపన్నత్వం, సాధారణత్వం) స్వతసిద్దంగా ఆచరించి ధన్యులు కమ్మని బోదిస్తున్నారు. ఈ ప్రయత్నములో తన్నాశ్రయించిన సాధకుడు తప్పుచేయాలన్నా చేయకుండా ఆకరుణామయుడు మనలనాదుకుంటారని, అయితే మనం హృదయపూర్వకంగా శ్రీ స్వామివారిని ఆశ్రయించాలని మనందరికీ భోదిస్తున్నారు.

ఈ శ్రీరాములు శెట్టిగారు ప్రస్తుతం ఆశ్రమంలో ఉంటూ శ్రీ స్వామివారికి బిక్షాన్నం అనికేపల్లినుండి తెచ్చే సేవచేస్తున్నాడు. వీరు మనందరిలాగే కనబడినా వీరి హృదయ నైర్మల్యం ఏమిటో శ్రీ స్వామివారే చక్కగా ఎరుగగలరు. గనుకనే వీరు అర్థించకనే వీరి సమ్యకు శ్రీ స్వామివారు ఈ క్రింది విధంగా సలహాఇచ్చారు.

ఏమంత్రం జపిస్తే ఉత్తమ ఫలితముంటుంది? ఏమంత్రం లేకుండా కేవలం ఓం కారమే జపిస్తే సరి పోతుందా అనే సందేహం వీరిని అనేక రోజులనుండి పీడిస్తుండేది. ఎందరినడిగినా సంతృప్తి కరమైన సమాధానం దొరకలేదు.

ఒకనాడు వీరు తనస్వప్నములోనేతన సందేహాన్ని గూర్చి అడగాలని శ్రీ స్వామివారి మందిరంలో ప్రతిరాత్రి జరిగే భజన దగ్గరకు వెళ్లాడు. భజన అయ్యాక భజన భక్తులందరూ వెళ్ళిపోయారు. తాను చూస్తూ నిలుచున్నాడేకానీ ఎవ్వరినీ అడుగలేదు. ఇంతలో అక్కడ శ్రీ మల్లిక వెంకయ్య అనే శ్రీ స్వామివారి సేవకుడు కనిపించారు. ఇతను కట్టెలు కొట్టి శ్రీస్వామివారి అగ్నిగుండానికి సమర్పించడం తప్ప ఏమీ తెలియని వాడు కదా! ఇలాంటి సమస్యను గూర్చి వీరినడిగి ఏమి ప్రయోజనము" అని అనుకుంటూ నిలుచొని ఉన్నాడు. శ్రీ వెంకయ్యగారు



తనకైతానే ఈయవైపు చూస్తూ "ఓం అంటే సరిపోతుండ్లాయ్యా, ఓం అంటే బాగుంటుంది, ఓం అనుకోమంచిదే" అని పలికి అదృశ్యమయ్యారు. "అరే! వెంకయ్య లేడే ఇంతలోనే ఏమయ్యాడు!" అని తన స్వప్నంలో అనుకుంటుండగానే స్వప్నం అంతరించి మెలకువ వచ్చింది. అప్పుడు వెంటనే కొట్టొచ్చినట్లు ఒక సత్యం గుర్తొచ్చింది. శ్రీ మల్లిక వెంక్యగారు సమాది చెంది అప్పటికి నాలుగు సంవత్సరాలైంది. ఈనాడు శ్రీ స్వామివారే నాపై ఎనలేని కరుణతో శ్రీ మల్లిక వెంకయ్యరూపంలో దర్శనమిచ్చి నా సమస్యకు చక్కని సమాధాన మిచ్చారు. ఇదే శ్రీ స్వామివారు మనకు అందించే బోధ. మనం పరిశుద్ధ హృదయంతో వారి నాశ్రయించిన మాటే నిజమైతే శ్రీ స్వామివారు మనమడగకనే మన పవిత్రమైన కోరికలు తీరుస్తుంటారన్నమాట

## లీలా ధ్యేయము

శ్రీ స్వామివారి చరిత్రంతా చూచాక మనకొక అనుమానం రావడం సహజం. శ్రీ స్వామివారికి సర్వం తెలుసు. ఎవరెవరికి ఎప్పుడెప్పుడు ఏ వ్యాదులు రాబోతాయో తెలుసు ఏ ఏ కష్టాలు ఎప్పుడెప్పుడు ఎవరికి సంప్రాప్తమవుతాయో కూడా వారికి తెలుసు, సమర్ధ సద్గురువైన ఆ మహనీయుడు సంకల్పమాత్రంతో అందరి నొసటి వ్రాతలు మార్చగలరు. కష్టాలు బాపగలరు నిస్వార్థమైన ప్రేమంటే ఏమిటో వీరి దగ్గరే మనం చూస్తాము. వారెంతటి కరుణామయులో వారి కృప చవిచూచిన వారికే తెలుస్తుంది. మరి అలాంటి దయామయుడు తాను ఆదుకోదలచుకున్నవారికి ఆ కష్టాలన్నీ సంప్రాప్తంగాకముందే వారికి తెలియకుండానే తొలగించవచ్చుగదా? వారికా కష్టాలు వచ్చాక అనేక బాధలు అనుభవించాక-తనకు మ్రొక్కుబడి చెప్పుకున్న తర్వాత గానీ, గొలగమూడికి వచ్చి సమాధి దర్శించాకగానీ, వీరి చరిత్ర పారాయణ చేశాకగానీ, సమాధికి ప్రదక్షిణలు చేశాకగానీ తగ్గించడంలో అర్థమేమిటి? తన భక్తులకు అనవసరంగా ఇబ్బందులు కల్గించడమే గదా? రెండవది తన మహిమను ఎంతో గోప్యంగా ఉంచుకునే మహనీయుడు పైన చెప్పిన సాదనలు చేశాక వారి కష్టాలు తొలగించడం ద్వారా

తానే ఆ కష్టాలు తొలగించినట్లు భక్తులకు తెలుపుకున్నట్లేగదా? అది వారి గోప్యమైన పద్ధతికి విరుద్ధము కాదా? కష్టాలు తీర్చడమొక్కటే వారి ధ్యేయమైతే స్వామివారే రక్షించినట్లు భక్తులకు తెలియజేసిన తర్వాతనే కరుణించనక్కరలేదు. దొంగకు తేలుకుట్టినట్లు తాను కరుణించినట్లు తెలియ నీయకుండా సంకల్పమాత్రంతో తొలగించ వచ్చుగదా?

ఈ దివ్యలీలా ప్రదర్శనకు కష్టాలు బాపడమేగాక మరొక మహత్తర ధ్యేయముంది. మనలో భక్తి, ప్రేమ, విశ్వాసాలు అనే బీజాలు నాటి మొక్కలు మొలిపించి ఆ మొక్కలను పెంచి పెద్దచేసి వాటి ఫలితాల ద్వారా మనచేత ధర్మాచరణ చేయించడమే వారి ముఖ్యధ్యేయము. స్వామి ద్వారా సహాయము పొందినవారు కృతజ్ఞతా భావంతో స్వామివారు మననుండి కోరే ప్రేమపూర్వకమైన ధర్మాచరణ ద్వారా వారిని తృప్తిపరచాలని శ్రీ స్వామివారి తపన. ఆవిధంగా శ్రీ స్వామివారు బోధించిన ధర్మం మన మాచరిస్తే జన్మజన్మలకూ దఃఖమే మన ఛాయలకురాదు. (మన అధర్మ ప్రవర్తనే గదా మన కష్టాలకు కారణం). అలాంటి శాశ్వతానందం మనకివ్వాలనేది వారి లీలా ప్రదర్శన ధ్యేయం. ఈ సత్యాన్ని గుర్తెరిగి వారు బోధించిన ధర్మ బోధవ ఆచరించి కృతజ్ఞత చూపుదాం!

ఈ విషయాన్ని శ్రీ స్వామివారు ఒక చక్కని లీల ద్వారా మనందరికీ బోధిస్తున్నారు. తిక్కారప్పాడు నుండి ఒక మిత్రుడు మూత్రంలో శుద్ధపోతూ బలహీనమై వచ్చాడు. అన్నం మామూలుకంటే రెండింతలు తింటాడు కానీ కూర్చున్న చోటునుండి కదలలేడు. అంత నీరసం. తన కాళ్ళు చేతులే తనకు బరువుగా తయారైనంత బలహీనత. డాక్టర్ల ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మనిషి చూసేందుకు బాగానే ఉన్నాడాయె. తొలి దర్శనానికే శ్రీ స్వామివారు కలలో కన్పించి ఏదో ఆకుపచ్చని ఆకుపెట్టి తినమన్నారు. తెల్లవారినుండి సగం బాధ నివారణైంది. మరుసటి వారం రాత్రి కలలో శ్రీ స్వామివారు తన రెండు పిడికెళ్ళతో అతని ముఖంలో నుండి ఏదో పెరికేసినట్లు భంగిమ చేశారు. స్వామివారి పిడికెళ్ల నిండా సన్నని పొడవైన మెలికలు తిరిగే పాములు వచ్చాయి.



ఆ పాములను మండే గుండంలో పడేసి "ఇక నీ పీడ పోతుందిలేయ్యా" అన్నారు స్వామి. నాటినుండి అతడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు. మరుసటి వారం వచ్చి తాననుకొన్నట్లు స్వామివారికి టెంకాయలుకొట్టి మ్రొక్కు చెల్లించుకొని వెళ్ళాడు. మాట ప్రకారం చెల్లించాడు గనుక ఇక స్వామివారి వైపే మెదలలేదు. ఇంటిదగ్గర పటమైన పెట్టుకొని నిత్యం స్వామివారిని తలచుకొన్నవాడు కూడ గాదు. మరలా మూడు వారాల తర్వాత అతని బాధలు మొదటికొచ్చాయి. దిక్కుతోచక మరలా స్వామి సమాధి దర్శనం చేసుకున్నాడు. కానీ మునుపటివలె తొలివారంలేనే కాదుగదా మూడు వారాలైనా బాధ తగ్గలేదు ఏమి చేయాలో తోచక అందరినీ అడుగుతున్నాడు. కరుణామయుడైన శ్రీ స్వామివారే ఆయనను నా దగ్గరకు వెళ్ళమని ఎవరి ద్వారానో చెప్పించారు. నేను విషయమంతా విచారించి "శ్రీ స్వామివారి ఎడల కనీస ధర్మమంగా ఉండవలసిన కృతజ్ఞతాభావం లేకపోవడమే అతని బాధలు తిరగబెట్టేందుకు కారణమని" చెప్పాను. జీవితంలో మనిషికి ముఖ్యంగా కృతజ్ఞతాభావం ఉండాలి. మన కేదైనా చిన్న సహాయం చేసినవారిని కూడా ఎక్కడైనా కనిపిస్తే కృతజ్ఞతతో పలకరిస్తాము. ఆనాడు వారు చేసిన సహాయం గుర్తుచేస్తాము. మరి స్వామివారిపట్ల అంతమాత్రమైనా కృతజ్ఞత చూపనక్కరలేదా? కనుక "ప్రతి నిత్యం అన్నం తినబోయే ముందు అన్నం కూర కలిపి మూడు ముద్దలు తీసి ఆకులోగాని కాగితంలో గాని పెట్టి ఇంటి బయటిపెట్టి అన్ని జీవులలో ఉన్న వెంకయ్యస్వామివారికి సమర్పయామి అని స్వామివారికి నమస్కరించుకొని భోంచేస్తుండు. శ్రీ స్వామివారి పటం ఇంట్లో పెట్టుకొని నిత్యం కడ్డీలు వెలిగించి నమస్కరించుకో-వీలున్నప్పుడంతా శ్రీ స్వామివారి చరిత్ర చదివించుకొని విను. అందులో స్వామివారి మాటలు జీవితంలో ఆచరించేందుకు ప్రయత్నించు. అలాచేస్తే స్వామివారు మనవెంట నుండి ఈ బాధేకాదు ఇక రాబోవు కష్టాలనుండి కూడా కాపాడుతారు." అని చెప్పాను అతడలా చేయడం మొదలుపెట్టాక అతని ఆరోగ్యం చక్కబడింది. అది మొదలుకొని వీలున్నప్పుడంతా వచ్చి స్వామివారి సమాధిని సేవించుకొని పోతున్నాడు.

గనుక శ్రీ స్వామివారు తామే భక్తుల బాధలు తీర్చినట్లు ఎరుకపరచుకోవడంలో అంతరార్థాన్ని మనకీ లీలద్వారా స్వామివారు బోధించారు. మన బాధలు తీర్చడం ద్వారా మననుండి కోరేది కృతజ్ఞతా పూర్వకమైన ప్రేమ. సాటి జీవులలో శ్రీ వెంకయ్యస్వామివారు ఉన్నారనేటటువంటి నిరంతర ఎరుక. అలాంటి ఎరుక గలిగి వారు బోధించిన సత్యం ధర్మం మనచేత ఆచరింపజేయాలని అనుక్షణము తపనపడుతూ నేటికీ మరలా మరలా మన బాధలు తీరుస్తూనే ఉన్నారు. పొయ్యే వాళ్ళను పోనిచ్చేదే గదయ్యా అనేటట్లు చేసుకుంటామో లేక దారంతెగిపోకుండా నడుచుకొని శ్రీ స్వామివారితో నిరంతరం సంబంధం పెట్టుకుంటామో అనే ప్రశ్న మనకేవదలి బోసినవ్వులు నవ్వుతూ చూస్తున్నారు స్వామి.

స్వామివారు సృష్టికి మూలమైన పరబ్రహ్మము. కనుక మనందరికీ తల్లీ దండ్రీ వారే. అందుకే ఈ అద్భుతలీలా ప్రదర్శన చేస్తున్నారు. ఏతల్లిగాని, తండ్రిగాని తనబిడ్డ బానిసబ్రతుకు బ్రతకాలని తలంచరు. కనుకనే మన తండ్రియైన భగవంతుడు మనకు స్వేచ్ఛ నిచ్చాడు. దానితోటి మనకు కొన్నినియమాలు కూడా పెట్టారు. ప్రకృతిలో ఏది కూడా నియమనిబంధనలకు లోబడి నడవకుంటే పనిచేయలేదు. నియమ నిబంధనలు లేకుంటే అస్తవ్యస్తం గందరగోళం, చీకటే ఫలితం. భగవంతుడు ఏర్పరచిన నియమాలు మానవుడు పాటించినంతసేపు అఖండమైన ఆనందం అనుభవిస్తాడు. అదే శ్రీ స్వామివారు నిరంతరం అనుభవించే బ్రాహ్మీస్థితి. కానీ స్వామివారి బిడ్డలమైన మానవులము వారు ఏర్పరచిన నియమాలు ఉల్లంఘించి దు:ఖముకొని తెచ్చుకొన్నాము. కరెంటు యంత్రం దగ్గర పనిచేసేవారు నియమోల్లంఘనచేస్తే ఏమౌతుందో యోచించండి. ఆ విధంగా దు:ఖము కొని తెచ్చుకున్న మనచేత తిరిగి ఆ ప్రకృతి సిద్ధమైన నియమాలు, ధర్మము పాటింపజేసేందుకే శ్రీ స్వామివారు మానవాకారం దాల్చి ఈ లీలా ప్రదర్శన చేస్తున్నారు. లీలా రూపంలో స్వామివారి కృప చవిచూచిన తరువాతనైనా మనం వారు కోరిన పని చేస్తామని మనలను వెంటాడి వేసారిపోతున్నారు. మీరు నన్ను వదలినా నేను మిమ్ములను వదలనని పట్టు



వీడకుండా మనవెంటపడి అలసిపోతున్నారు. వారు జీవితాంతం ఆచరించి చూపిన ధర్మాన్ని ఆచరించి ఆ సద్గురు మూర్తికి ఆనందం కల్గించి తరిద్దాం.

"మందల కనుక్కుంటే మంగళవారమైనా మంచిదేనయ్యా" అన్నారు శ్రీ స్వామివారు. మంగళవారం అనేది ఏశుభకార్య ఆరంభానికి పనికిరాని వారమని సామాన్యంగా తలచడంపరిపాటి. కాని మందలకనుక్కుంటే మంగళవారం కూడా మంచిదే నంటారు శ్రీ స్వామివారు. ఈ మందల కనుక్కోవడ మంటే ఏమిటో ఆచార్య శ్రీ భరద్వాజమాష్టరుగారు వివరించేవారు. పనిలో నేర్పరి తనం చూపడమొక్కటే సరి పోదని, మానవుడు చేసే ప్రతిపని భగవంతుని సేవగా పరిగణించ బడాలంటే ఆపనినిసరైన భావనతో చేయగలగాలని చెప్పేవారు. అప్పుడే మానవుడు కర్మయందు కౌశలం మాత్రమే గాక శుకౌశలం చూపగలుగుతాడని చెప్పేవారు. ఉదాహరణకు స్త్రీలు వంట చేసేందుకు పాత్రలు శుభ్రంచేస్తున్నారు. వంట చేస్తున్నారు అనుకుందాం. సామాన్యంగా కొంత శ్రద్ధాభక్తులు గలవారు ఇలా తలుస్తారు" ఈ పాత్రలు శుభ్రం చేయడం, వంట చేసి వీళ్ళందరికీ పెట్టడమనే గుదిబండవంటి పనినాకు దాపురించింది. ఇదిలేకుంటే చక్కగా కొంతసేపు పూజ. భజన చేసుకుందును గదా" అని వాపోవడం కద్దు. ఇది సరైన భావనకాదంటారు ఆచార్యులవారు.

అహం వైశ్వాన రోభూ త్వాప్రాణినాందేహమా శ్రీత: అన్న గీతా శ్లోకం ప్రకారం ఆపరమాత్మే జీవుల ఆకలి రూపంలో వారు తినే ఆహారాన్ని స్వీకరిస్తున్నానని చెపుతాడు. గనుక స్త్రీలు పాత్రలు శుభ్రంచేసి వంట చేయడమనే పనికూడభగవంతుని సేవేగదా. వారు చేసే వంట కాలన్నీ ఆకలి రూపంలోని పరమాత్మకునివేదించబడుతున్నాయనే పవిత్రభావంతో వారు పాత్రలు శుభ్రంచేయడం, వంట చేయడం, ఇల్లు శుభ్రంచేయడం వంటి అన్ని పనులూ చేయడమే కర్మశుకౌశలమవుతుంది. అట్టి పవిత్రభావనలేకుండా వంట ఎంతరుచిగా చేసినా అది కౌశలము మాత్రమే అవుతుంది. అట్టి పవిత్ర భావంతో ప్రతివారు

ప్రతిపని చేయగల్గడాన్నే శ్రీ స్వామివారు మందలకనుక్కోవడంగా చెప్పారు" అని ఆచార్యుల వారు చేప్పేవారు.

ఇదే విధంగా వ్యవసాయదారులుకూడా భావించాలి. వ్యవసాయం అనే కృషితో ఎన్నో జీవులలోని ఆకలిని తీర్చగలుగుచున్నాను. గీతా వాక్యం ప్రకారం "ఆకలి" అంటే పరమాత్మేకదా గనుక వ్యవసాయం చేయడమనే పని అంతా పరమాత్మసేవగా భావించి చేయడమే మందుల కనుక్కోవడమంటే. అట్లాగే మానవుడుచేసే ప్రతి పని భగవంతుని సేవగా భావించగల్గడమే మందల కనుక్కోవడంగా శ్రీ స్వామివారు చెప్పారు. ఆ విధంగా కర్మయోగ మాచరించగల్గితేనే సర్వ్యులూ క్రమముక్తికి అర్హులవుతారంటారు ఆచార్యులవారు.

జై సద్గురురాయా!



**భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి**



## శ్రీ స్వామివారి సూక్తులు

1. త్రేపేవారికి కాదయ్యా ఆకలై కొంగుపట్టేవారికన్నం పెట్టాలయ్యా.
2. వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది.
3. సంపూర్ణ విశ్వాసంతో ఇక్కడకొచ్చి ఏమనుకొంటే అదయ్యేదేగదయ్యా
4. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో.

మైసూరు మహారాజా కనిపిస్తే లాభమేమి, మనంచేసుకున్నదే మనకు

మీరు నన్ను వదలినా నేను మిమ్మలను వదలను.

వేయి గొఱ్ఱెలలో ఉన్నా మన గొఱ్ఱెను కాలుబట్టి లాక్కొస్తాను.

అందరినీ సమానంగా చూచుకుంటే భగవంతుడు కనిపిస్తాడు.

వెంకయ్య పేరుమీద పెడికెడు మెతుకులు పెట్టినవారికి తెచ్చినవారికి వారి మంచి చెడ్డలన్నీ మనమే చూడాలయ్యా.

మంత్రోపదేశ మడిగితే "మంత్రమెక్కడుంది-తంత్రమెక్కడుంది చూచుకుంటే పోయేదేగదయ్యా" అన్నాడు.

సన్యాసులు ధర్మంగా ఉండడంలో గొప్పేముంది. సంసారములో దర్మంగా ఉండడమే గొప్ప.

వడ్డీ విషయంలో కూడా ధర్మంగా ఉండాలయ్యా.

సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ సాధించు అన్నారు.

పావలా దొంగిలిస్తే పదిరూపాయలు నష్టం (40 రెట్లన్నమాట)

లాభంలో భాగమాసిస్తే పాపంలో గూడా భాగమొస్తుంది.

ఒకర్ని పొమ్మనే దానికంటే మనం పోవడం మంచిదయ్యా.

మీరునన్ను చూస్తుంటే నేను మిమ్మల్ని చూస్తుండ్లాయ్యా

కూతుర్ని కోడల్ని సమానంగా చూచుకుంటే దేవుడు కనబడుతాడు.